www.prajapaksham.in
PRAJAPAKSHAM ★
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar
సంపుటి 28, సంచిక: 266 | శనివారం | 21-03-2026 | హైదరాబాద్ పేజీలు: 12 | వెల రూ. 5.00







అదే బాట

# అభివృద్ధి.. సంక్షేమం

ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన సాగిస్తున్నాం. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశాం. గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నాం. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.
— డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

## రూ.3,24,234 కోట్లతో వార్షిక బడ్జెట్

| | |
|---|---|
| రెవెన్యూ రాబడి రూ.2,41,263 కోట్లు | ద్రవ్య లోటు రూ.58,459 కోట్లు |
| రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు | రెవెన్యూ మిగులు రూ.6,858 కోట్లు |
| మూలధన వ్యయం రూ.47,267 కోట్లు | రుణాలపై వడ్డీలకు రూ.21,304 కోట్లు |

● ఇందిరమ్మ ఇళ్లకు తగ్గిన నిధులు ● శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ● శాసనమండలిలో తెలంగాణ పద్దు సమర్పించిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నింటినీ కొనసాగిస్తూనే, పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను ప్రతిపాదించింది. రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి, ధనిక అనే తేడా లేకుండా 1.15 కోట్ల మంది మందికి 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'తో పాటు మరో 8 కొత్త పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2026–27 వార్షిక సంవత్సరానికి గాను మొత్తం రూ.3,24,234 కోట్లతో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్ర రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా ప్రతిపాదించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వ్యవసాయం, నీటిపారుదల శాఖకు నిధులను తగ్గించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆరు గ్యారంటీ పథకాల్లో ఇందిరమ్మ ఇళ్లకు నిధులు తగ్గించారు. 'తెలంగాణ 2026–2027' వార్షిక బడ్జెట్‌ను శాసనసభలో శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. అదే విధంగా శాసనమండలిలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రవేశపెట్టారు. శాసనసభలో భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం శుక్రవారం మధ్యాహ్నం 12.05 గంటలకు ప్రారంభమై, మధ్యాహ్నం 1.52 గంటలకు ముగిసింది. కొత్తగా తరువాయి 2లో

## 9 కొత్త పథకాలు 03

ప్రతి కుటుంబానికి రూ.5లక్షల 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'
కొత్తగా 2 లక్షల పెన్షన్లు
మరిన్ని తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
ప్రీప్రైమరీ నుంచి ఇంటర్ వరకు బ్రేక్ ఫాస్ట్
ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య భద్రత, రూ.1.20కోట్ల ప్రమాద బీమా
ఎటిసి ట్రైనీలకు నెలకు రూ.2వేల స్కాలర్‌షిప్



మండలిలో మంత్రి ఉత్తమ్

## ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి జీవిత బీమా

భూముల అమ్మకానికి వ్యతిరేకం కాదు
వచ్చే నిధులను స్నో, పౌడర్‌లకు ఖర్చు చేయడానికి వ్యతిరేకం
హిల్ట్, భూ బదలాయింపుపై ఏ విచారణకైనా సిద్ధం
టెన్ ప్లస్ టూ విధానం అమలు చేస్తాం : సిఎం రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌ను ఫ్యూచరిస్టిక్(భవిష్యత్తు దృష్టి కలిగిన) బడ్జెట్ అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఈ బడ్జెట్‌లో అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిచ్చామని పేర్కొన్నారు. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ మరింత పైకి ఎదిగేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ భూముల అమ్మకానికి వ్యతిరేకం కాదని, అయితే అమ్మిన భూములతో వచ్చే నిధులను పౌడర్, స్నోలకు వాడుకూడదని, భవిష్యత్తు కోసం ఖర్చు చేయాలనేదే తమ అభిమతమని తెలియజేశారు. భూములు అమ్మకం ద్వారా వచ్చే నిధులతో రోడ్లు, పారిశ్రామిక అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం శుక్రవారం శాసనసభ వాయిదాపడిన తరువాత జర్నలిస్టులతో ముఖ్యమంత్రి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ విజన్ లక్ష్యానికి బడ్జెట్ పెద్ద పీట వేసిందని, అన్ని రంగాలు, అన్ని వర్గాలకు నిధులు కేటాయించామని, దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో ప్రతి తరువాయి 12లో

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) పండుగను ముస్లిం సోదర సోదరీమణులు తమ కుటుంబ సభ్యులు, బంధు మిత్రులందరితో సంతోషంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. రంజాన్ పండుగ లౌకికవాదానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు, క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, జకాత్, ఫిత్రా పేరుతో పేదలకు చేసే దాన ధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయన్నారు. గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని, ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా కలిసిమెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా దువా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.



## తీపీ చేదు బడ్జెట్

సిపిఐ ఎల్‌పి నేత కూనంనేని సాంబశివరావు

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ఉగాది పచ్చడిలా తీపీ చేదుల మిశ్రమంగా ఉందని సిపిఐ శాసనసభాపక్ష నేత, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం రాష్ట్ర బడ్జెట్ ఆయన స్పందిస్తూ తెలంగాణ రాష్ట్రం మొత్తంగా రూ. 8.64 కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందని అన్నారు. దీంతో పాటు మరో రూ ఒక లక్ష కోట్ల రూపాయల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, ఆ లెక్కలు ఈ బడ్జెట్ చూపించలేదని పేర్కొన్నారు. ఇంత డబ్బు ఎలా తీసుకువస్తారనేది పెద్ద ప్రశ్న? ఈ దశలో బడ్జెట్ ప్రవేశపెట్టడం అంటే కత్తి మీద సాము లాంటిదని, ఎవరూ కూడా చేయగలిగిందేమీ లేదన్నారు. ఉన్న దాంట్లో కొంచెం కష్టమైన, క్లిష్టమైన స్థితిలో ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చేదు, తీపిల మిశ్రమంగా భావిస్తున్నామని చెప్పారు. గతంలో ఏ వస్తువు పైనా ఎంతెంత పన్నులు పెంచేది అనేది మనకు తెలిసేది కానీ, జిఎస్టి వచ్చిన తర్వాత ఇప్పుడు తెలియడం లేదని, మనకు తెలియకుండానే మన రక్తం తాగేస్తున్నారని విచారణ వ్యక్తం చేశారు. అందువలన ఈ బడ్జెట్ మంచిదా, చెడ్డదా చెప్పడానికి తరువాయి 2లో



## బడా జూటా బడ్జెట్

బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉపనేత హరీశ్‌రావు

తెలంగాణ ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిన బడా జూటా బడ్జెట్ అని, ఇందులో విజన్ లేదని బిఆర్‌ఎస్ శాసనసభా పక్షం ఉప నాయకులు టి.హరీశ్‌రావు అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన బడ్జెట్‌పై స్పందిస్తూ బిసి, ఎస్‌సి, ఎస్‌టి డిక్లరేషన్లు కేవలం ఓట్ల కోసమే అని ఈ బడ్జెట్ నిరూపించిందన్నారు. గత బడ్జెట్‌లో రాజీవ్ యువ వికాసం కోసం రూపాయి ఖర్చు చేయకుండా మళ్ళీ అదే బడ్జెట్ పెట్టారని ఆరోపించారు. గత ఏడాది చదివిన బడ్జెట్ మళ్ళీ చదివినట్లు కనిపించిందన్నారు. రాజీవ్ గాంధీ, ఇందిరమ్మ ఆత్మ ఘోషించే బడ్జెట్ అని అభిప్రాయపడ్డారు. మహిళలకు రూ.2500లు, ఉద్యోగస్తులకు, ఆర్‌టిసి, తరువాయి 2లో

## ప్రసంగాలకే పరిమితం కావద్దు 04

పూర్తిస్థాయిలో ఖర్చుచేసేలా చర్యలు తీసుకోవాలి : సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



## అత్యంత నిరాశాజనకం

ఒక ఫెయిల్డ్, ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్
విద్యకు కేవలం 8 శాతమేనా : బిజెపి

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ అత్యంత నిరాశాజనకంగా ఉందని, ఇది కేవలం ఒక ఫెయిల్డ్ ఫాల్స్, ఫ్యాన్సీ బడ్జెట్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. ఈ బడ్జెట్ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందన్నారు. బడ్జెట్‌లో విద్యకు కేటాయించిన 8 శాతం వాటా పొరుగు రాష్ట్రాల కంటే చాలా తక్కువన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించలేక ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో వస్తున్న ఏరోస్పేస్ పరిశ్రమలు, రీజనల్ రింగ్ రోడ్, రైల్వే ప్రాజెక్టులన్ని ప్రధాని మోదీ చొరవ, కేంద్ర నిధులతోనే సాధ్యమవుతున్నాయని స్పష్టం చేశారు. రైతు భరోసా బకాయిలు, నిరుద్యోగ భృతి (రూ. 4,000), మహిళలకు ఆర్థిక సాయం (రూ. 2,500) వంటి ఆరు గ్యారంటీల అమలుపై బడ్జెట్‌లో స్పష్టత లేదని మండిపడ్డారు. మూసీ పేరుతో పేదల ఇళ్లను కూల్చడంపై మండిపడుతూ, ప్రాజెక్ట్ వ్యయం అకస్మాత్తుగా పెంచడం వెనుక అవినీతి కోణం ఉందని ఆరోపించారు. ఆలయాల అభివృద్ధిని, అర్చకుల వేతనాలను పట్టించుకోకుండా, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే మైనారిటీ బడ్జెట్‌ను పెంచారని ఆయన విమర్శించారు.



## ఈనెల 29న యుద్ధ వ్యతిరేక ర్యాలీ

ప్రపంచ దేశాలకు సంకటంగా యుద్ధం
నిలువరించేందుకు భారత్ ప్రపంచ దేశాలతో కలిసి శాంతికి కృషిచేయాలి
యుద్ధ వ్యతిరేక కమిటీ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్

సామ్రాజ్యవాద కాంక్షతో తన సంతోషం కోసం అమెరికా ఇరాన్‌పై చేస్తున్న యుద్ధం ప్రపంచ దేశాలకు సంకటంగా మారిందని, దీనిని నిలువరించేందుకు భారత్‌దేశం ప్రపంచదేశాలతో కలిసి ప్రపంచశాంతికి కృషి చేయాలని యుద్ధ వ్యతిరేక కమిటీ తరువాయి 12లో

## గోదావరిలో ఐదుగురు విద్యార్థులు గల్లంతు

దైవదర్శనానికి వచ్చి అనంత లోకాలకు
ముగ్గురి మృతదేహాలు లభ్యం
కొనసాగుతున్న గాలింపు చర్యలు

ప్రజాపక్షం/భద్రాచలం

భద్రాచలం సమీపంలోని ఏపిలో గల కొల్లుగూడెం గోదావరి తీరంలో ఐదుగురు విద్యార్థులు గల్లంతై దుర్మరణం పాలయ్యారు. ఈ హృదయ విదారకర ఘటన శుక్రవారం తీవ్ర విషాదాన్ని నింపింది. భద్రాచలానికి చెందిన శ్రీకర్, అభిరామ్‌తో పాటు ఏపిలోని మదనపల్లికి చెందిన సతీష్, ఉయ్యూరుకు చెందిన నవదీప్, తేజజ్ఞ, విజయనగరంకు చెందిన హర్ష, దీపక్ అనే ఏడుగురు స్నానాల కోసం గోదావరిలోకి దిగారు. లోతును అంచనా వేయలేకపోయిన వారు కొట్టుకుని పోయే క్రమంలో హర్ష, దీపక్ అనే ఇద్దరికి ఈత రావడంతో ప్రాణాలతో తరువాయి 12లో

## భూముల ద్వారా రూ. 23 వేల కోట్లు

రూ.45వేల కోట్లకుపైగా మద్యం ఆదాయం ● పెట్రోల్,డీజిల్ వ్యాట్ ఆదాయం రూ.19 వేల కోట్లు

ప్రజాపక్షం/ హైదరాబాద్

వచ్చే ఆర్థిక సంవత్సరం (2026–27)లో భూముల విక్రయం, దాని ఆధారం ఇతర మార్గాల ద్వారా రూ.23 వేల కోట్లు సమీకరించాలని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ప్రభుత్వ భూముల, ఆస్తుల విక్రయం ద్వారా రూ.6,500 కోట్లు, ఓపెన్ ప్లాట్లు, ఫ్లాట్లు, ఇళ్ళ అమ్మకం ద్వారా రూ.3,500 కోట్లు సాధించాలని భావిస్తోంది. అలాగే భూములు ఆధారం చేసుకొని అదనపు వనరుల సమీకరణ (భూముల తనఖా, లీజు, ఇతర ) రూపంలో రూ.13వేల కోట్లు పొందాలని బడ్జెట్‌లో పేర్కొంది. అలాగే ఖనిజాలు, పర్యావరణ ప్రభావ రుసుంపై రాయల్టీ కింద రూ.6,600 కోట్లు సాధించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇసుక విక్రయం రూపంలో రూ.750 కోట్లు, ఖనిజాలు ఉండే భూములపై సెస్ రూపంలో రూ.200 కోట్లు కలిపి రూ.950 కోట్లు వస్తాయని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఇక మద్యం నుంచి పన్నులు, వ్యాట్, ఫీజుల రూపంలో సుమారు రూ.47 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం ఆశిస్తుంది. ఇందులో బీరుపై సుంకం ద్వారా రూ.4,500 కోట్లు, విదేశీ మద్యం పై సుంకం కింద రూ.15,045 కోట్లు, ఫీజుల కింద రూ.4,500 కోట్లు, యూజర్ చార్జీల కింద రూ.3,500 కోట్లు వస్తాయి. అలాగే ఎక్సైజ్ వ్యాట్ కింద రూ.19,273 కోట్లు వస్తాయని అంచనా. పెట్రోలు, డీజిల్ విక్రయాలపై వ్యాట్ ద్వారా రూ.18,649 కోట్లు లభిస్తాయని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. వాహనాలపై లైఫ్ ట్యాక్స్, గ్రీన్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు తదితర రూపంలో రూ.8,814 కోట్లు వస్తాయని అంచనా.

### రూ. 8 లక్షల కోట్లు దాటిన రుణాలు

ఈ నెలాఖరుకు రాష్ట్రంపై రుణ భారం రూ.8.05 లక్షల కోట్లుకు చేరనుంది. ఇందులో ప్రత్యక్ష రుణభారం రూ.5.03 లక్షల కోట్లు కాగా, గతంలో ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చిన, ఇతర కార్పొరేషన్‌ల ద్వారా తీసుకున్న బడ్జెటేతర రుణాలు రూ.3.01 లక్షల కోట్లు. వచ్చే ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ప్రభుత్వ ప్రత్యక్ష రుణభారానికి మరో రూ.58, 458 కోట్లు తోడు కానున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది.

# అమెరికా ఎఫ్-35కి ఇరాన్ దెబ్బ

**టెహ్రాన్:** అమెరికా ఎఫ్35 యుద్ధ విమానాన్ని ఇరాన్ దెబ్బతీసింది. ఇందుకు సంబంధించిన వీడియోను ఇరాన్ విడుదల చేసింది. ఎఫ్ 35 యుద్ధ విమానాన్ని తమ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకోవడంతో అది పశ్చిమాసియాలోని అమెరికా స్థావరంలో అత్యవసరంగా దిగిందని ఇరాన్ ఒక ప్రకటన చేసింది. 'మా గగనతల రక్షణ వ్యవస్థ అర్ధరాత్రి దాటిన తర్వాత అమెరికా సైన్యానికి చెందిన ఎఫ్35 యుద్ధ విమానాన్ని దెబ్బతీసింది. అది ఏ స్థాయిలో దెబ్బతిన్నదనే దర్యాప్తు చేస్తున్నాం. విమానం పూర్తిగా ధ్వంసం కావడానికే ఎక్కువ అవకాశాలున్నాయి' అని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ వెల్లడించింది. గాలిలో విమానాన్ని ఒక క్షిపణి ఢీకొడుతున్నట్టుగా ఉన్న వీడియోను ఇరాన్ విడుదల చేసింది. ఇదే ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ స్పందించారు. ఓ యుద్ధ విమానం అత్యవసరంగా దిగిందని, దానికి పెద్దగా నష్టం జరగలేదని, ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోందని హాకిన్స్ తెలిపారు. కాగా ఎఫ్34 ఈ విధంగా అత్యవసరంగా దిగడం మునుపెన్నడూ జరగలేదు. ఈ విమానం విలువ 82.5 మిలియన్ డాలర్లు ఉంటుంది.



ఇలావుంటే, ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధం మూడో వారంలోకి ప్రవేశించింది. టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ విరామం లేకుండా వైమానిక దాడులు జరపడం మరింత ఉద్రిక్తతలను సృష్టిస్తున్నది. ఇరాన్ ప్రజలు నౌరూజ్ (పర్షియన్ నూతన సంవత్సరం) జరుపుకుంటున్న సమయంలోనూ దాడులు జరగడం విచారకరం. ఇరాన్ రాజధాని టెహ్రాన్ చుట్టుపక్కల భారీ పేలుళ్లు వినిపించగా, ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై క్షిపణి దాడులను కొనసాగించింది. ఈ యుద్ధం కేవలం సైనిక ఘర్షణగా మాత్రమే కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ నియంత్రణ కారణంగా, ప్రపంచ చమురు సరఫరా తీవ్ర ఒత్తిడికి గురైంది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు ఐదవ వంతు ఈ మార్గం ద్వారా వెళ్లడం వల్ల, అక్కడి ఉద్రిక్తతలు చమురు ధరలను గణనీయంగా పెంచాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు యుద్ధం ప్రారంభం తర్వాత 60 శాతం వరకు పెరిగి, తాత్కాలికంగా బ్యారెల్‌కు 119 డాలర్లను దాటాయి. కాగా, ఇరాన్ ప్రతిదాడులు గల్ఫ్ ప్రాంతంలోని కీలక చమురు, వాయువు సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఖతార్‌లోని రాస్ లఫాన్ ఎల్ఎన్‌జి కేంద్రానికి నష్టం వాటిల్లడంతో ఎగుమతులు సుమారు 17 శాతం తగ్గాయి. సౌదీ అరేబియా, కువైట్, అబుదాబి ప్రాంతాల్లో కూడా ఇంధన మౌలిక సదుపాయాలు దాడులకు గురయ్యాయి. ఈ పరిస్థితి గల్ఫ్ దేశాలను ప్రత్యక్షంగా యుద్ధంలోకి లాగుతున్న ప్రమాదాన్ని పెంచుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకారం, ఇరాన్ సైనిక సామర్థ్యం తీవ్రంగా దెబ్బతిన్నది. అయితే ఇందుకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు ఇవ్వలేదు. మరోవైపు, ఇరాన్ ఇంకా క్షిపణులు, డ్రోన్ల ద్వారా ప్రతిదాడులు చేయగలగడం, యుద్ధం త్వరగా ముగిసే అవకాశాలు లేవన్న అనుమానాలకు తావిస్తున్నది. అమెరికా ఈ యుద్ధంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, భూసైన్యాన్ని పంపే యోచన లేదని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. కాగా, వరుస దాడుల నేపథ్యంలో మరణాల సంఖ్య పెరుగుతోంది. ఇరాన్‌లో 1,300 మందికి పైగా మరణించగా, ఇజ్రాయెల్‌లో క్షిపణి దాడుల వల్ల వందల సంఖ్యలో మరణించారని అంటున్నారు. అయితే, అధికారికంగా ఇంకా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. లెబనాన్‌లో హిజ్బుల్లాతో జరిగిన ఘర్షణల కారణంగా లక్షలాది మంది నిర్వాసితులయ్యారు. మొత్తం మీద, ఈ యుద్ధం ప్రాంతీయ ఘర్షణను దాటి, గ్లోబల్ ఆర్థిక వ్యవస్థను, ఇంధన మార్కెట్లను, భౌగోళిక రాజకీయ సమతౌల్యాన్ని ప్రభావితం చేసే స్థాయికి చేరుకుంది.

# హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవండి

### ఇయు దేశాల డిమాండ్



**బ్రసెల్స్:** మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం ప్రభావంతో ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, యూరోపియన్ యూనియన్ దేశాలు కీలకమైన డిమాండ్లు ముందుకు తెచ్చాయి. బ్రస్సెల్స్‌లో సమావేశమైన 27 దేశాల నాయకులు హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలని, అలాగే నీటి మరియు ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను వెంటనే నిలిపివేయాలని కోరారు. ఈ జలసంధి ప్రపంచ చమురు, వాయువు రవాణాకు అత్యంత కీలక మార్గం కావడంతో, అక్కడి అస్థిరత గ్లోబల్ మార్కెట్లను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. యూరోపియన్ కౌన్సిల్ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో యుద్ధం కారణంగా సాధారణ ప్రజల ప్రాణనష్టం పట్ల ఆందోళన వ్యక్తం చేయడంతో పాటు, అంతరాయం లేని ఇంధన సరఫరా అవసరాన్ని ప్రస్తావించింది. ఇరాన్ తన పొరుగు గల్ఫ్ దేశాలపై దాడులు నిలిపివేయాలని కూడా కోరింది. అదే సమయంలో, పెద్ద ఎత్తున శరణార్థుల సంక్షోభాన్ని నివారించేందుకు అంతర్జాతీయ సహకారం అవసరమని పేర్కొంది. అయితే, యూరోపియన్ దేశాలు ఈ యుద్ధంలో నేరుగా పాల్గొనే ఆసక్తి చూపించడం లేదు. అమెరికా విజ్ఞప్తులకు స్పందిస్తూ సైనిక సహాయం అందించడంపై వారు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కొన్ని ప్రధాన దేశాలు హోర్ముజ్ జలసంధిలో నౌకా రవాణా భద్రత కోసం చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, యుద్ధం కొనసాగుతున్నంత వరకు ప్రత్యక్ష జోక్యం సాధ్యం కాదని స్పష్టం చేశాయి. ఇంధన సంక్షోభం దీర్ఘకాలికంగా మారితే యూరప్ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన నష్టం కలగొచ్చని నాయకులు హెచ్చరిస్తున్నారు. అందుకే తక్షణ శాంతి, స్థిరత్వం అవసరమని వారు గట్టిగా భావిస్తున్నారు.

# దొరైస్వామి నియామకాన్ని స్వాగతించిన చైనా




**బీజింగ్:** చైనా, భారతదేశం కొత్త రాయబారిగా విక్రం దొరైస్వామి నియామకాన్ని స్వాగతించింది. ఈ నియామకం ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. 1992 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి దొరైస్వామి ప్రస్తుతం యునైటెడ్ కింగ్‌డమ్‌లో భారత హైకమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన త్వరలో బీజింగ్‌లో బాధ్యతలు స్వీకరించనున్నారు. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియన్ ప్రకారం, రాయబారులు దేశాల మధ్య స్నేహపూర్వక, సహకార సంబంధాలకు కీలకమైన వారధులు. దొరైస్వామి బాధ్యతలు చేపట్టిన తరువాత చైనా–భారత్ సంబంధాల అభివృద్ధికి సానుకూలంగా పనిచేస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తికరంగా, దొరైస్వామి తనకు 'వెయ్ జియామెంగ్' అనే పేరును ఎంచుకున్నారు. దీనికి 'మిత్రత్వాన్ని పెంపొందించే వ్యక్తి' అని అర్థం. దొరైస్వామి చైనాలో పనిచేసిన అనుభవం కలిగిన సీనియర్ దౌత్యవేత్త. తన కెరీర్ ప్రారంభంలో హాంకాంగ్, బీజింగ్‌లో సేవలందించారు. మాండరిన్ భాషపై పట్టు కూడా ఆయనకు ఉంది. ఈ నేపథ్యం ఆయనను చైనా విషయాల్లో నిపుణుడుగా నిలబెడుతోంది. చైనా అధికార మీడియా కూడా ఈ నియామకాన్ని సానుకూలంగా విశ్లేషించింది. భారత్ బీజింగ్‌తో సంబంధాలను స్థిరీకరించడానికి అనుభవజ్ఞుడైన దౌత్యవేత్తను పంపిందని అభిప్రాయపడింది. ముఖ్యంగా 2020 గల్వాన్ ఘటన తర్వాత ఉద్రిక్తతలకు లోనైన సంబంధాలను పునర్నిర్మించే ప్రయత్నాల్లో ఈ నియామక ప్రాధాన్యతను గుర్తుచేసుకుంది.

# విద్యారంగానికి దశ, దిశ చూపలేని బడ్జెట్ కేటాయింపులు

### ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఏ.వి.సుధాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్‌లో విద్య రం గానికి ముప్పై శాతం కేటాయించాలని కమిటీలు సూచిస్తున్న, కనీసం మేనిఫెస్టోలో పొందుపర్చిన విధంగా 15 శాతం కూడా కేటాయింపులు జరపకపోవడం విద్యాశాఖ పట్ల ప్రభుత్వానికి గల చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుందని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఏ.వి.సుధాకర్ అన్నారు. గత రెండు సంవత్సరాల బడ్జెట్‌లో నామమాత్రంగా విద్య శాఖకు నిధులు కేటాయించారని, ఈ సారి కూడా అంతే కేటాయించడం శోచనీయమన్నారు. అలాగే బడ్జెట్‌లో పెండింగ్ బిల్లులు, పిఆర్‌సి అంశాల ఊసే లేదని, ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్నం భోజనం, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు తదితర అంశాలకు కేటాయించిన బడ్జెట్ సరిపోదని వివరించారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రతకు రూ.1056 కోట్లు స్వాగతిస్తున్నప్పటికీ వాటిని దారి మళ్లకుండా చూడాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సందర్భంలో కూడా ఇంత తక్కువ కేటాయింపులు జరపడం విడ్డూరంగా ఉందన్నారు.

# బడ్జెట్‌లో ఆర్‌టిసిపై చిన్నచూపు

### రూ.15 వేల కోట్ల నిధులు కేటాయించాలి
### టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాలక్ష్మి పథకం కింద జీరో టికెట్ విలువ నెలకు రూ. 400 కోట్లకు పైనే ఆర్‌టిసి ఇస్తుందని, అలాగే గతంలో ఆర్‌టిసికి ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయి రూ.2500 కోట్లు కలిపి ఈ ఏడాది రూ.7300 కోట్లు బడ్జెట్‌లో పెట్టాల్సి ఉండగా కేవలం రూ.4305 కోట్లు పెట్టి ఆర్‌టిసిపై ఈ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి. మౌలానా, కో కన్వీనర్‌లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్ బి.యాదగిరిలు ఒక ప్రకటనలో విమర్శించారు. కేవలం మహాలక్ష్మి పథకం కింద మాత్రమే అరకొర నిధులు కేటాయించి, ఆర్‌టిసి అభివృద్ధికి, రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుకు, విద్యుత్ బస్సుల కొనుగోలుకు, నూతన డిపోల నిర్మాణాలకు, కార్మికులకు ఇవ్వాలిన 2021,2025 రెండు వేతన సవరణలకు, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలకు చెల్లింపులకు ఒక్క రూపాయి కూడా కేటాయించక పోవడాన్ని జెఎసి తీవ్రంగా ఖండిస్తున్నది. బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపు ప్రభుత్వం పునరాలోచన చేసి ఇతర మార్గాల ద్వారా ఆర్‌టిసికి రూ.15వేల కోట్లు కేటాయించి, ఆర్‌టిసి సంస్థ పట్ల ఉద్యోగుల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వ్యవసాయం — అనుబంధ రంగాలకు రూ.23,179 కోట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఈ ఏడాది బడ్జెట్‌లో వ్యవసాయ – దాని అనుబంధ రంగాలకు ప్రభుత్వం కోత విధించింది. 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం రంగానికి రూ.23,179 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. గత ఏడాది బడ్జెట్ లో రూ.24,439 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ సంవత్సరం రూ.1260 కోట్ల మేర తగ్గించింది. ఈ ఏడాది బడ్జెట్‌లో వివిధ పథకాలకు గాను రూ.21,851 కోట్లు, నిర్వహణకు గాను రూ.1,328 కోట్లను ప్రతిపాదించింది. రైతు భరోసాకు ఈ ఏడాది కూడ ప్రభుత్వం రూ.18 వేల కోట్లను ప్రతిపాదించింది. సన్న ధాన్యానికి గాను క్వింటాల్‌కు రూ.500 బోనస్‌కు సంబంధించి గత ఏడాది రూ.1800 కోట్లను కేటాయించిన ప్రభుత్వంఈ సంవత్సరం దానిని రూ.3500 కోట్లకు పెంచింది. అదేవిధంగా పంటల బీమాకు రూ.1,886 కోట్లు, వ్యవసాయ యాంత్రీకరణకు గాను రూ.344 కోట్లను ప్రతిపాదించింది. పశు సంవర్ధక శాఖకు, మత్స అభివృద్ధి శాఖలకు ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో 1529 కోట్లను ప్రతిపాదించింది. గత ఏడాది బడ్జెట్ లో రూ.1,674 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ ఏడాది మాత్రం రూ.145 కోట్లు కోత విధించింది.

**ప్రజాపంపిణీకి ఈఏడాది మరింత పెరిగిన నిధులు**

ప్రజా పంపిణి వ్యవస్థకు ప్రభుత్వం ఈ ఏడాది కూడ మరింత భారీగా నిధులను కేటాయించింది. గత ఏడాది బడ్జెట్‌లో పౌర సరఫరాల శాఖకు ప్రభుత్వం రూ.5,734 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ సంవత్సరం రూ.7366 కోట్ల మొత్తాన్ని ప్రతిపాదించింది. రాష్ట్రంలో ప్రతి ఏటా ధాన్యం దిగుమతి అంతకు అంతా పెరుగుతుండడంతో ఆ మేరకు ప్రభుత్వం నిధులను కూడ పెంచింది. ఈ రబీ సీజన్‌లో 60 లక్షల మెట్రిక్‌టన్నులు దొడ్డు ధాన్యం, 30 లక్షల మెట్రిక్ టన్నులు సన్నధాన్యం మొత్తం 90లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వంఇందుకు అనుగుణంగా నిధులను పెంచింది. దీంతో గత ఏడాది కంటే ఈ సంవత్సరం పౌర సరఫరా శాఖకు అదనంగా రూ.1632 కోట్లను ప్రతిపాదించింది.

**సాగునీటి రంగానికి నిధుల కోత :**

సాగు నీటి రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో కొంత మేర నిధులో కోత విధించింది. ప్రభుత్వం 2024–25 సవరణ బడ్జెట్‌లో రూ.22,284.96 కోట్లు, 202526 బడ్జెట్‌లో రూ.23,373 కోట్లను కేటాయించిన ప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో మాత్రం రూ.22,615 కోట్లకు పరిమితం చేసింది. ఇందులోను నిర్వహణకు పద్దు కింద రూ.10,743 కోట్లు, సాగునీటి ప్రాజెక్టు పథకాలకు గాను రూ11,872 కోట్లను ప్రతిపాదించింది. 2028 నాటికి రాష్ట్రంలోని అన్ని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. అదేవిధంగా 30 నెలలలో పాలమూరు –రంగారెడ్డి ప్రాజెక్టును, 2027 మార్చి నాటికి కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ఇటీవల నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది మరింత పెద్దఎత్తున నిధులు కేటాయింంపు ఉంటుందని అంతా భావించారు. ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా ఈ ఏడాది బడ్జెట్‌లో మరింత తగ్గించడం గమన్వారం.

## దేవాలయాల అభివృద్ధికి 'అక్షయ పాత్ర'

### బడ్జెట్‌లో భారీ నిధులు!

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ధార్మిక క్షేత్రాల వైభవాన్ని పునరుద్ధరించేందుకు తెలంగాణ ప్రభుత్వం నడుం బిగించింది. నేడు అసెంబ్లీలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు భారీగా నిధులు పెంచారు. గత ఏడాది కేవలం రూ.190 కోట్లు మాత్రమే కేటాయించగా, ఈసారి ఆ మొత్తాన్ని రూ.345 కోట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ధూప దీప నైవేద్య పథకం: రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఆలయాల్లో అర్చకులకు ఇచ్చే గౌరవ వేతనం మరియు ధూప దీప నైవేద్య ఖర్చుల కోసం నిధులను గణనీయంగా పెంచారు. వేద పాఠశాలల బలోపేతం: పురాతన వేద పాఠశాలల నిర్వహణ, వేద పండితుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధులను కేటాయించారు. ప్రధాన క్షేత్రాలైన యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, వేములవాడ రాజన్న, భద్రాద్రి రామయ్య ఆలయాల అనుబంధ వసతుల కల్పనకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత నిచ్చారు. గత కొన్నేళ్లుగా నామమాత్రపు కేటాయింపులతో ఉన్న దేవాదాయ శాఖకు, ఈసారి దాదాపు రెట్టింపు నిధులు కేటాయించడంపై భక్తులు, అర్చక సంఘాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా వచ్చే ఏడాది జరగనున్న భారీ ఉత్సవాలకు ఈ నిధులు వెన్నుదన్నుగా నిలవనున్నాయి.

## బడా జూటా బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

సింగరేణి కార్మికులకు మొండిచేయి యాదవ్, ముదిరాజ్, గౌడ్‌లకు, బిసిలకు, ఆశా, అంగన్వాడీ వర్కర్లకు మొత్తంగా ఈ బడ్జెట్లో సకల జనులకు దక్కింది శూన్యమేనన్నారు. అసెంబ్లీ సాక్షిగా సిఎం ఆరు గ్యారెంటీలు అమలు చేశామని అబద్ధాలు చెపుతున్నారన్నారు. ఎమ్మెల్యే జి.జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ బిసిలకు ఇస్తామన్న రూ.20 వేల కోట్ల బడ్జెట్ కోసం ఎదురు చూశామని రెండు ఏళ్ళు మోసం చేసి మరోసారి బిసిల గొంతు కోశారన్నారు. ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ ఈ బడ్జెట్ హైదరాబాద్ ప్రజలను మోసం చేసినట్లు ఉందన్నారు.

# ముఖ్యమైన రంగాలకు కోత : సిపిఐ(ఎం)



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 3,24,233 కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ, దళిత, గృహనిర్మాణం, నీటిపారుదల, విద్యుత్ తదితర ముఖ్యమైన రంగాలకు గత బడ్జెట్ కంటే ఈ బడ్జెట్‌లో నిధులు కోతపెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ పేర్కొంది. ప్రతిపౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే పరిపాలన లక్ష్యం అన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోటేషన్‌ను ఉట్టంకించిన ఆర్థికమంత్రి చెప్పి అందుకు భిన్నంగా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రతిపాదించారని పేర్కొంది. బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలుకు ఎలాంటి నిర్దిష్టమైన ప్రతిపాదనలు లేవని, రైతు భరోసా కోసంరూ. 25 వేల కోట్ల అవసరం ఉంటే, రూ.18 వేల కోట్లు మాత్రమే ప్రతిపాదించారని, మహాలక్ష్మి పథకానికి మహిళలకు రు.2,500లు ఊసే లేదని, అట్లాగే కౌలు రైతులకు మొండిచేయి చూపిన ప్రభుత్వం,. వ్యవసాయ కూలీలకు రు.12,000ల ప్రతిపాదన లేదని వెల్లడించింది. . రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పైగా ఇళ్లు లేవారు ఉంటే, ఈ బడ్జెట్ లో కేవలం రు.5,500 కోట్లు మాత్రమే ప్రతిపాదన చేశారని, . ముఖ్యంగా దళితుల సంక్షేమానికి ఖర్చు పెట్టాల్సిన దాంట్లో రూ.4,076 కోట్లు ,గృహ నిర్మాణానికి ఈ బడ్జెట్ లో 1,344, కోట్లు నీటి పారుదల రంగానికి రూ. 790 కోట్లు కోత లు విధించారని వెల్లడించింది. మొత్తంగా ఈ బడ్జెట్ అంతా కూడా అంకెల గారడీ తప్ప, ప్రజలకు, ముఖ్యంగా సంక్షేమ తరగతులకు నిధులు కేటాయింపులు లేని ఈ బడ్జెట్‌ను పునర్ సమీక్షించాలని డిమాండ్ చేసింది.

## తీపి చేదు బడ్జెట్...

(మొదటి పేజీ తరువాయి)

లేదన్నారు. ఈ బడ్జెట్ 1 కోటి 50 లక్షల కుటుంబాలకు కుటుంబ జీవిత భీమా సౌకర్యం కల్పించడం మంచి పరిణామమని, కుటుంబంలోని ఎవరికైనా ప్రమాదం జరిగితే ఆ కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా వస్తుందని చెప్పారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తామనడం మంచి పరిణామమని తెలిపారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ కార్డులు అందించి, నగదు రహిత వైద్యం సౌకర్యం కలించడంతో 23.5 లక్షల కుటుంబాలకు మేలు జరుగుతుందని చెప్పారు. అలాగే పెన్షనర్లు, ఉద్యోగులకు ప్రమా దం జరిగితే రూ. 1.20 కోట్ల భీమా వర్తింపజేయడం, 60 సంవత్సరాలు నిండిన తర్వాత సహజ మరణం పొందితే రూ. 10 లక్షల బీమా సౌకర్యం కల్పించడం ఆ కుటుంబాలకు భరోసా కల్పిస్తుందని పేర్కొన్నారు.

**విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలి..**


విద్యా రంగానికి సంబంధించి పాత బడ్జెట్ పోల్చితే ఏమి మెరుగు లేదని కూనంనేని సాంబశివరావు అన్నారు. గత బడ్జెట్ విద్యకు 7.57 శాతం నిధులు కేటాయిస్తే, ఈ బడ్జెట్ 8.22 శాతం కేటాయించారని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్ విద్యకు కనీసం 20 శాతం అయిన నిధులు కేటాయించాలని విద్యావేత్తలు చెబుతున్నారనీ, కానీ విద్య, వైద్య రంగాల్లో నిధుల కేటాయింపులో ప్రభుత్వం ఫెయిల్ అయిందని భావిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఉన్నత విద్య, స్పోర్ట్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ వంటి వాటిపై కొంత ఫోకస్ పెడుతున్నారు, కానీ కింది స్థాయికి వెళితే మాత్రం యూనివర్సిటీలలో కనీసం ప్రొఫెసర్లు, టీచర్లు, లెక్చరర్ల నియామకం కూడా చేపట్టడం లేదన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పేరుతో నెట్టుకొస్తున్నారు, అందువల్ల విద్యరంగంలో ప్రమాణాలు పడిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు.

**వైద్య రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలి..**

వైద్య రంగానికి సంబంధించి బడ్జెట్ 4.2 శాతం మాత్రమే నిధులు కేటాయించారని, కనీసం 10 శాతం అయిన కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. మొత్తంగా చూస్తే బడ్జెట్ కొన్ని అంశాలు మంచిగా ఉన్న, కొన్ని అంశాలు ఇంకా ప్రజల అబిష్టానికి అనుగుణంగా లేదు. 'గత బడ్జెట్ 3.04 లక్షల కోట్లు అయితే, రివైజ్ దాంట్లో రూ. 2. 81 కోట్లు తీశారు. అంటే రూ. 22 వేల కోట్లు ఖర్చు చేయలేదు. మార్చి 31 వ తేదీ వరకు మొత్తంగా క్లారిటీ వస్తుంది. ప్రస్తుత బడ్జెట్ రూ. 3.24 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టారు. ఇందులో మళ్లీ అప్పు దాదాపు రూ.58 వేల కోట్ల బడ్జెట్ లోటు చూపిస్తున్నారు. అంటే మళ్లీ అప్పు చేయాల్సిందే. గత బడ్జెట్ రూ. 22 వేల కోట్లు తగ్గినట్టుగానే ఈ బడ్జెట్ కూడా సుమారు రూ. 45 వేల కోట్లు తగ్గే అవకాశం ఉంది. అంటే ప్రతి సంవత్సరం ప్రవేశపెట్టే బడ్జెట్ ఆడంభరంగా అంకెల్లో కనిపించే బడ్జెట్, వాస్తవికంగా వచ్చే సరికి డబులు సరిపోవట్లేదు. ఈ బడ్జెట్ పేద వారి ప్రస్తావన ఎక్కడ కనిపించలేదు. అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆర్‌టిసి ఉద్యోగులు, జర్నలిస్టులు, కాంట్రాక్టు కార్మికులు, జెన్ కో సింగరేణి, జర్నలిస్టుల ప్రస్తావన లేకపోవడం దారుణం. పాత బడ్జెట్ యధాతథంగా కొత్త బడ్జెట్ ఎక్కించారు. కొద్దిగా పెంచుకుంటూ వెళ్లారు. కానీ, పైన పేర్కొన్న వారి పరిస్థితి ఏంటి? పరిష్కారం ఎలా? అని ప్రశ్నించారు. గత బడ్జెట్ ఇందిరమ్మ ఇండ్లకు రూ. 14 వేల కోట్లుగా కేటాయించారు. కానీ, ప్రస్తుతం రూ. 7 వేల కోట్లు కేటాయించారు. అంటే సగానికి సగం కోత విధించారు. మొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా గతేడాది 4.50 లక్షల ఇళ్లు ఇచ్చారు. ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున కేటాయించారు. ఇప్పుడు 3,500 ఇళ్లు ఉంటాయా? లేక పాత వాటికే ఖర్చు పెడతారా? ఈ చర్యలతో ప్రభుత్వం చాలా ప్రమాదంలో పడే అవకాశం ఉంది. అంతిమంగా రూ. 8.64 లక్షల కోట్ల అప్పుల ఊబి నుంచి బయటపడాలంటే కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా కచ్చితంగా అవసరముంది. లేకపోతే 'చల్తీ కా నామ్ గాడీ తరహాలో ప్రభుత్వ పరిపాలను సాగుతుంది' అని కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.







## అభివృద్ధి..సంక్షేమం

(మొదటి పేజీ తరువాయి)

రెండు లక్షల నూతన పెన్షన్లు మంజూరు చేయగా, ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు బ్రేక్ ఫాస్ట్‌ను, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఈ రెండు పథకాలకు రూ.900 కోట్లు ప్రతిపాదించారు. ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలను, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక రవాణా వ్యవస్థలతో పాటు అన్ని వసతులతోతో కూడిన 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు'గా మార్చుతున్నట్టు, ఇందుకు రూ.500 కోట్లను ప్రతిపాదించినట్లు ఆయన ప్రకటించారు.

ఆరు గ్యారంటీల కోసం మొత్తం రూ.50,713 కోట్లను ప్రతిపాదించారు. గత ఆర్థిక సంవత్సరం రూ 56,084 కోట్లను ప్రతిపాదించగా, నీటి పారుద శాఖకు రూ 22,615 కోట్లను ప్రతిపాదించగా,గత ఏడాది రూ. 23,179 కోట్లను ప్రతిపాదించారు. ప్రాథమిక విద్యను బలోపేతం చేసేందుకు 33 జిల్లాల్లో 1,362 ప్రీప్రైమరీ విభాగాలను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన ప్రభుత్వం, దీనిని వచ్చే విద్యా సంవత్సరంలో 2,000 నుండి 2,500ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు వివరించారు. దివ్యాంగ విద్యార్థుల శారీరక వైకల్యం వారి విద్యాభ్యాసానికి , ప్రగతికి ఏమాత్రం అడ్డంకి కాకూడదనే ఉద్దేశ్యంతో, అటువంటి వారికి తగిన తోడ్పాటును అందించే లక్ష్యంతో ఇంటర్మీడియట్ విద్య చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టివిక్రమార్క ప్రకటించారు.

గత ప్రభుత్వాల ఆర్థిక విధ్వంసాన్ని సరిదిద్దుతూ, ఆర్థిక క్రమశిక్షణతో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యమని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు, రాజకీయ అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఈ బడ్జెట్ అటు సంక్షేమానికి, ఇటు అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తూ రూపొందించామని అన్నారు.

ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు గతంలో కంటే మెరుగైన కేటాయింపులు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించారు. తాము గత పాలకుల మాదిరిగా కాకుండా, ప్రజల సేవకుల లాగా పని చేస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ పాలన సాగిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో పెద్దపీట వేశామన్నారు. గతంలో జరిగిన ఆర్థిక తప్పిదాలను సరిదిద్దుతూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబి నుంచి బయటపడేసేందుకు కఠినమైన ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్నామని సభకు వివరించారు. దేశంలోనే తెలంగాణను అన్ని రంగాల్లో నెంబర్ 1 స్థానంలో నిలబెట్టడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు.

**దేశ సగటు వృద్ధి కంటే తెలంగాణ వృద్ధి రేటు 2.7 శాతం అధికం**

2025–26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జిఎస్‌డిపి) ప్రస్తుత ధరల ప్రకారం రూ.17,82,198 కోట్లు, గత సంవత్సరంతో పోలిస్తే వృద్ధి రేటు 10.7 శాతంగా నమోదయింది. అదే సమయంలో, దేశ జిడిపి రూ.3,57,13,886 కోట్లు కాగా, వృద్ధిరేటు 8 శాతంగా ఉన్నది. తెలంగాణ వృద్ధి రేటు దేశ సగటు వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువగా ఉంది. దేశ జిడిపిలో రాష్ట్ర జిఎస్‌డిపి 5.0 శాతం వాటా కలిగి దేశానికి ఒక బలమైన 'గ్రోత్ ఇంజిన్'గా తెలంగాణ నిలుస్తోంది. భారతదేశ వృద్ధిరేటు తగ్గుతూ మందగమనంలో ఉన్నప్పటికీ, తెలంగాణ రాష్ట్ర వృద్ధిరేటులో మెరుగైన పెరుగుదల కనిపించింది. ప్రస్తుత ధరల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో 9.8 శాతంగా ఉన్న దేశ జిడిపి వృద్ధి రేటు, 2025–26 నాటికి 8 శాతానికి పడిపోయింది. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జిఎస్‌డిపి ) వృద్ధి రేటు 2024–25లో 10.6 శాతం నుంచి 2025–26 నాటికి 10.7 శాతానికి పెరిగింది.

**కేంద్రంతో పోలిస్తే 1.9 రెట్లు పెరిగిన తలసరి ఆదాయం**

రాష్ట్ర తలసరి ఆదాయం గణనీయంగా పెరిగింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో, ప్రస్తుత ధరల ప్రకారం రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931 కాగా, వృద్ధి రేటు 10.2 శాతంగా ఉన్నది. దేశ తలసరి ఆదాయం రూ 2 లక్షల 19 వేల 575 కాగా వృద్ధిరేటు కేవలం 6.9 శాతం. దేశ తలసరి ఆదాయంతో పోల్చితే తెలంగాణ తలసరి ఆదాయం 1 లక్ష 99 వేల 356 రూపాయలు, 1.9 రెట్లు ఎక్కువగా ఉంది.

**తగ్గిన వడ్డీ**

గత ప్రభుత్వ హయాంలో పరిమితులకు మించి చేసిన అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై తీవ్ర భారం పడిన నేపథ్యంలో గత ప్రభుత్వం అధిక వడ్డీకి తీసుకొచ్చిన రూ.25,612 కోట్ల రుణాలను తక్కువ వడ్డీకి పునర్ వ్యవస్థీకరించింది. అలాగే రుణ చెల్లింపుల వ్యవధిని పెంచి, అసలు చెల్లించాల్సిన కాలాన్ని 20–39 సంవత్సరాలకు పొడిగించింది. తద్వారా 2025–26 నుండి 2031–32 సంవత్సరం వరకు చెల్లించాల్సిన రూ.34,058 కోట్ల నుంచి రూ.11,915 కోట్లకు తగ్గింది. దీని ద్వారా, రాష్ట్రానికి రూ 22,142 కోట్ల క్యాష్ అవుట్ ఫ్లో తగ్గి నగదు వెసులుబాటు కలిగినట్టు బడ్జెట్‌లో పేర్కొంది.

**కేంద్ర ప్రయోజిత పథకాల వినియోగం**

గత ప్రభుత్వం 2014 నుండి 2023 వరకు కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను సరైన రీతిలో వినియోగించుకోకపోవడంతో కేంద్రం నుంచి మంజూరైన నిధులను కూడా వివిధ పథకాల అమలుకు ఖర్చు చేయలేకపోయామని, ఇతర అవసరాలకు నిధులు దారి మళ్లించారని బడ్జెట్‌లో పొందుపర్చారు. దీంతో కేంద్రం నుంచి రావాల్సిన తదుపరి వాయిదాలు నిలిచిపోయి, తెలంగాణకు తీరని నష్టం జరిగిందని, అందుకే ఈ పరిస్థితులను వెంటనే గుర్తించి 2014–15నుండి 2023–24 ఆర్థిక సంవత్సరం వరకు కేంద్ర ప్రాయోజిత పథకాల కింద బకాయి పడిన నిధులన్నింటినీ సంబంధిత శాఖలకు సుమారు రూ.3 వేల కోట్లను ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసినట్టు బడ్జెట్ స్పష్టం చేసింది.




## 2026-27 బడ్జెట్‌లో ప్రభుత్వ శాఖల వారీగా కేటాయింపులు (రూ. కోట్లలో)

| శాఖ పేరు | కేటాయించిన నిధులు |
|---|---|
| వ్యవసాయం, సహకార శాఖ | రూ. 23,179 కోట్లు |
| పశుసంవర్ధక, మత్స్యశాఖ | రూ. 1,529 కోట్లు |
| వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ | రూ.12,511 కోట్లు |
| ఇంధన శాఖ | రూ. 21,285 కోట్లు |
| పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖ | రూ.1,049 కోట్లు |
| ఆర్థిక శాఖ | రూ. 60,438 కోట్లు |
| ఆహార, పౌర సరఫరాల శాఖ | రూ. 7,366 కోట్లు |
| సాధారణ పరిపాలన శాఖ | రూ. 1,190 కోట్లు |
| ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ | రూ. 13,679 కోట్లు |
| ఉన్నత విద్యా శాఖ | రూ. 5,443 కోట్లు |
| హోం శాఖ | రూ. 11,907 కోట్లు |
| గృహ నిర్మాణ శాఖ | రూ. 7,430 కోట్లు |
| పరిశ్రమలు, వాణిజ్య శాఖ | రూ. 3,747 కోట్లు |
| సమాచార సాంకేతిక, కమ్యూనికేషన్స్ శాఖ | రూ. 875 కోట్లు |
| సాగునీటి శాఖ | రూ. 22,615 కోట్లు |
| కార్మిక, ఉపాధి శాఖ | రూ. 998 కోట్లు |
| న్యాయ శాఖ | రూ. 2,367 కోట్లు |
| శాసనసభ కార్యాలయం | రూ. 259 కోట్లు |
| మైనారిటీల సంక్షేమ శాఖ | రూ. 3,769 కోట్లు |
| మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ | రూ. 17,907 కోట్లు |
| పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ | రూ. 33,688 కోట్లు |
| ప్రణాళిక శాఖ | రూ. 7,971 కోట్లు |
| రెవెన్యూ శాఖ | రూ. 4,020 కోట్లు |
| షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ | రూ. 11,784 కోట్లు |
| సెకండరీ విద్య (సెక్రటేరియట్) శాఖ | రూ. 21,231 కోట్లు |
| రవాణా శాఖ | రూ. 4,491 కోట్లు |
| రోడ్లు, భవనాల శాఖ | రూ. 8,298 కోట్లు |
| గిరిజన సంక్షేమ శాఖ | రూ. 7,937 కోట్లు |
| మహిళలు, పిల్లలు, వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ | రూ. 3,143 కోట్లు |
| యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ | రూ. 2,127 కోట్లు |
| **మొత్తం** | **రూ. 3,24,234 కోట్లు** |

## రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగులు 5.20 లక్షలు పెన్షనర్‌లు 2.94 లక్షలు

### జీతాలు, పెన్షన్‌ల ఖర్చు రూ.62,571 కోట్లు

రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర విభాగాల్లో 5,20,368 మంది ఉద్యోగస్తులు ఉన్నారు. అలాగే పెన్షనర్‌లు 2,94,944 మంది ఉన్నారు. వీరి జీతాలకు రూ.49,461 కోట్లు ఖర్చువుతున్నాయి. ఉద్యోగులు, పెన్షనర్‌ల కలిపి మొత్తం 8,15,312 మంది ఉన్నారు. వీరి పెన్షన్‌లకు అయ్యే వ్యయం రూ.13,110 కోట్లు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్‌లకు కలిపి జీతభత్యాలు, పెన్షన్‌ల వ్యయం రూ. 62,571 కోట్లు. అయితే, వాటికి కరువు భత్యం, ఇతరాలు కలుపుకొని ఉద్యోగుల వేతనాలకు రూ.60 వేల కోట్లు, పెన్షనర్‌లకు సుమారు రూ.26వేల కోట్లు వెరసి మొత్తం 2025– 26 బడ్జెట్‌లో రూ.86 వేల కోట్లకు చేరనుంది.

**మార్చి 1 నాటికి ఉద్యోగుల వివరాలు.**

| | | |
|---|---|---|
| రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు | – | 2,38,311 |
| జ్యుడీషియరీ | – | 9,479 |
| ఎయిడెడ్ విద్యా సంస్థలు | – | 2,312 |
| జెడ్‌పి/మండల పరిషత్ | – | 99,858 |
| మున్సిపల కార్పొరేషన్/మున్సిపాలిటీలు | – | 5,215 |
| పట్టణాభివృద్ధి సంస్థలు | – | 373 |
| జిల్లా గ్రంథాలయ సంస్థలు | – | 291 |
| రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలు | – | 1,13,006 |
| యూనివర్సిటీలు | – | 4,448 |
| సహకారసంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలు | – | 33,691 |
| దేవాలయాలు | – | 2,477 |
| పెన్షనర్‌లు | – | 2,94,944 |
| **మొత్తం** | – | **8,15,312** |

## గృహ నిర్మాణ రంగానికి భారీ ఊతం

### రూ. 7,430 కోట్లు కేటాయింపు

ప్రభుత్వం 2026–27 వార్షిక బడ్జెట్‌లో గృహ నిర్మాణ శాఖకు పెద్దపీట వేసింది. రాష్ట్రంలోని బలహీన వర్గాల గృహ నిర్మాణ పథకాలే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఏడాది భారీగా నిధులను ప్రతిపాదించింది. ముఖ్యంగా పేదల సొంతింటి కలను నిజం చేసే దిశగా అడుగులు వేస్తూ, గృహ నిర్మాణ సంస్థకు అవసరమైన నిధులను కేటాయించింది. రాష్ట్ర బడ్జెట్ అంచనాల ప్రకారం, గృహ నిర్మాణ శాఖకు సంబంధించి నిర్వహణ పద్దు, పథకాల పద్దు కింద ఈ క్రింది విధంగా నిధులు కేటాయింపులు జరిపింది. గృహ నిర్మాణ శాఖ కోసం ప్రభుత్వం మొత్తం రూ.7,430 కోట్లను ప్రతిపాదించింది. ఇందులో నిర్వహణ పద్దు కింద రూ. 1,929.60 కోట్లు కేటాయించారు. పథకాల పద్దు బలహీన వర్గాల గృహ నిర్మాణ కార్యక్రమాల అమలు కోసం రూ. 5,290.02 కోట్లను కేటాయించింది. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిచ్చే బలహీన వర్గాల గృహ నిర్మాణానికి బడ్జెట్‌లో స్పష్టమైన ప్రాధాన్యత లభించింది. గృహ నిర్మాణ కార్యక్రమాల నిర్వహణ, ఇతర ఖర్చుల కోసం రూ. 893.02 కోట్లు కేటాయించారు. కొత్త గృహాల నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం పెట్టుబడి పద్దు కింద రూ. 4,397.00 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. గృహ నిర్మాణ కార్యక్రమాల కోసం ఆర్థిక సంస్థల ద్వారా అందించే రుణాల నిమిత్తం రూ. 1,909.59 కోట్లు ప్రతిపాదించింది. 2025–26 సవరించిన అంచనాలతో పోలిస్తే, ఈసారి గృహ నిర్మాణ పథకాల పద్దులో గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. గత ఏడాది పథకాల కోసం రూ. 5,290.02 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది కూడా అదే స్థాయిని కొనసాగిస్తూనే, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు బడ్జెట్ అంకెలు స్పష్టం చేస్తున్నాయి. పేదలందరికీ గృహ వసతి కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ భారీ కేటాయింపులు చేసినట్లు తెలుస్తోంది. ఈ నిధుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న గృహ నిర్మాణ పనులు పూర్తి కావడమే కాకుండా, కొత్త గృహాల నిర్మాణానికి ఊతం లభించనుంది.

## పర్యాటకానికి 'మహర్దశ' బడ్జెట్‌లో భారీ కేటాయింపులు!

### గత ఏడాదితో పోలిస్తే ఈసారి అదనంగా 58 శాతం నిధులు

తెలంగాణ రాష్ట్ర పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయి పటంలో నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌లో పర్యాటక శాఖకు ఊహించని రీతిలో నిధుల వర్షం కురిసింది. గత ఏడాది కేవలం రూ.775 కోట్లు కేటాయించగా, ఈసారి ఆ మొత్తాన్ని ఏకంగా రూ.1,224 కోట్లకు పెంచుతూ ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క నిర్ణయం తీసుకున్నారు.2027లో రానున్న గోదావరి పుష్కరాల కోసం ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయించారు. కుంభమేళా తరహాలో ఈ ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కొత్త పర్యాటక విధానం ద్వారా వచ్చే ఐదేళ్లలో రూ.25,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాలని, తద్వారా లక్షలాది మందికి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి, చారిత్రక కట్టడాల పునరుద్ధరణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఎకో టూరిజం ప్రాజెక్టులకు ఈ నిధులను వెచ్చించనున్నారు. రాష్ట్రంలో కొత్తగా 9 పవిత్ర యాత్రా సర్క్యూట్లను అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తన ప్రసంగంలో పేర్కొన్నారు.మొత్తానికి, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్ర సంస్కృతిని, పర్యాటక సంపదను కాపాడుకునేందుకు ప్రభు త్వం పెద్ద పీట వేయడంపై పర్యాటక రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**తెలంగాణ రైజింగ్ 2047 దిశగా అడుగులు: మంత్రి జూపల్లి ..**

తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించిన ఈ బడ్జెట్ అన్ని వర్గాల కలలను సాకారం చేస్తుందని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈ బడ్జెట్‌లో ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణ కనిపిస్తోందని, రాష్ట్ర ముఖచిత్రాన్ని మార్చేదిగా ఉందని ఒక ప్రకటనలోపేర్కొన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తుకు భరోసాని ఇచ్చేలా, అభివృద్ధికి బాటలు వేసేదిగా ఉందన్నారు. రైతులకు ఎంతో మేలు చేస్తుందని, సాగు, విద్య, వైద్యంతో పాటు 9 నూతన పథకాల అమలుకు బడ్జెట్ లో కేటాయింపుల చేయడం విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు ఎంతో మేలు చేసేలా ఉందన్నారు.

## రూ.17,907 కోట్లతో మున్సిపల్ శాఖకు భారీ ఊతం




రాష్ట్రంలో వేగంగా జరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రాధాన్యతను ఇచ్చింది. మూసీ, మెట్రోరైల్, హైడ్రా, జిహెచ్‌ఎంసి లాంటి సంస్థలకు గతంలో మాదిరిగానే బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదించింది. ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికిగాను మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖకు రూ.17,907 కోట్లతో పురపాలక శాఖకు నిధుల కేటాయింపు ప్రతిపాదించింది. గత సంవత్సరం రూ.17,677 కోట్లు ప్రతిపాదించగా, గతంలో కంటే ఈ దఫా రూ.230 కోట్లు అదనంగా ప్రతిపాదించింది. మొత్తం మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించి వివిధ ప్రాజెక్టులు, విభాగాలకు కేటాయించిన నిధులు ఇలా ఉన్నాయి. మెట్రో వాటర్ వర్క్స్ (హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బి) రూ.3,385 కోట్లు (తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణ కోసం). జిహెచ్‌ఎంసి రూ.3,065 కోట్లు (నగర మౌలిక సదుపాయాల కల్పన కోసం). రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిబుల్ ఆర్): రూ.1,525 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి: రూ.1,500 కోట్లు (మూసీ పునరుజ్జీవనం, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు), హైదరాబాద్ మెట్రో రైల్: రూ.1,000 కోట్లు (పాతబస్తీ మెట్రో ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ సహా), హైడ్రా : రూ.200 కోట్లు (చెరువుల సంరక్షణ, విపత్తు నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విభాగం), ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్): రూ.200 కోట్లు, మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటిఎస్): రూ.50 కోట్లు ఈ బడ్జెట్ కేటాయింపులు హైదరాబాద్‌ను కేవలం ఐటీ హబ్‌గానే కాకుండా, జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉన్న గ్లోబల్ సిటీగా మార్చడానికి ఉద్దేశించినవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**భారత్ ఫ్యూచర్ సిటీ..**

భారత్ ఫ్యూచర్ సిటీ 30 వేల ఎకరాల్లో నిర్మించతలపెట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కనెక్టివిటీ కోసం ప్రత్యేక నిధులు ప్రతిపాదించింది. ఎస్‌ఎన్‌డిపి (నాలా అభివృద్ధి) కింద రూ.550కోట్లు కేటాయింపులకు ప్రతిపాదించింది. హిల్ట్ పాలసీ ద్వారా కాలుష్య కారక పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించడం, పాత ఆటోలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడం వంటి కార్యక్రమాలను ప్రోత్సహించనున్నారు.

## 2026-27వార్షిక బడ్జెట్‌లో 9 కొత్త పథకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రజల సంక్షేమ, అభ్యున్నతి కోసం ప్రభుత్వం బడ్జెట్‌లో కొత్తగా 9 పథకాలను ప్రకటించింది. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, చేయూత, తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళు, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన, నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం, ఉద్యోగుల ప్రమాద బీమా పథకం, సిఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం, ఎటిసి ట్రైనీలకు స్కాలర్ షిప్ పథకాలను బడ్జెట్‌లో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రకటించారు. ఈ పథకాలకు అవసరమైన నిదులను కూడా బడ్జెట్‌లో ప్రతిపాదించారు.

**ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం**



తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలందరి సంక్షేమం కోసంసామాజిక అంతరాలతో సంబంధం లేకుండా పేద, మధ్య తరగతి, ధనిక అని తేడా చూడకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించే విధంగా 2026 జూన్ 2వ తేదీ 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం'ను ప్రారంభించనున్నారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.4,000 కోట్లు ప్రతిపాదించారు.

**చేయూత:** 'చేయూత' పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేయనున్నారు. ఈ పథకం మొత్తానికి బడ్జెట్‌లో రూ.14,861 కోట్లు ప్రతిపాదించారు.

**తెలంగాణ పబ్లిక్ స్కూళ్ళు**



ఎంపిక చేసిన ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక మౌలిక సదుపాయాలు, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలు, ప్రత్యేక రవాణా వ్యవస్థలతో అన్ని వనరులతో కూడిన 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు'గా మార్పు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ స్కూళ్ళలో ప్రీప్రైమరీ నుండి 12వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు విద్య అందించనుంది. ఈ పథకం మొత్తానికి బడ్జెట్‌లో రూ.500 కోట్లు ప్రతిపాదించారు.

**విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం**



2026–27 విద్యా సంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభిస్తున్నారు. ఈ బ్రేక్‌ఫాస్ట్‌లో ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులు పాలు, మిగతా మూడు రోజులు రాగి జావ అందిస్తారు. ఈ పథకం మొత్తానికి బడ్జెట్‌లో రూ.800 కోట్లు ప్రతిపాదించారు.

**ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం**



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అభ్యసిస్తున్న విద్యార్థులకు కూడా ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించనున్నారు. ఈ పథకం మొత్తానికి బడ్జెట్‌లో రూ.100 కోట్లు ప్రతిపాదించారు.

**నగదు రహిత ఆరోగ్య భద్రత పథకం**

ఉద్యోగస్తులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ దాదాపు 23.51 లక్షల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా అమలు చేయనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు 421 ఎంపానెల్ ప్రైవేట్ ఆసుపత్రులలో 1,998 వ్యాధులకు ఈ పథకం ద్వారా చికిత్సను పొందవచ్చు. ప్రతి ఉద్యోగికి డిజిటల్ హెల్త్ కార్డు అందిస్తారు.

**ఉద్యోగుల ప్రమాద బీమా పథకం**



ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తిస్తుంది. 60 ఏండ్ల వరకు రూ.10 లక్షల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్, విమాన ప్రమాదంలో మరణిస్తే రూ.2 కోట్ల అదనపు కవరేజి లభించే విధంగా ఈ పథకాన్ని రూపకల్పన చేశారు. ఈ పథకం 7.57 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు వర్తిస్తుంది. ఈ రెండు పథకాల మొత్తానికి బడ్జెట్‌లో రూ.1,056 కోట్లు ప్రతిపాదించారు.

**సిఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం**



రాష్ట్ర యువతకు వివిధ రంగాలలో తగిన నైపుణ్య శిక్షణను, వారికి ఉపాధి లభించిన వివిధ దేశాలకు సంబంధించిన భాషా జ్ఞానంలో శిక్షణ ఇప్పించడం, వారికి వీసా మార్గదర్శకత, విదేశీ ప్రయాణానికి కావలసిన రక్షణను ఇచ్చి విదేశాలలో ఆరోగ్య సేవలు, హస్పిటాలిటీ, నిర్మాణపు పనులు, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం కోసం సిఎంఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించనున్నారు. ఈ బడ్జెట్‌లో సిఎం ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్ పథకానికి రూ.1,056 కోట్లు ప్రతిపాదించారు.

**ఎటిసి ట్రైనీలకు స్కాలర్ షిప్**



ఎటిసిలో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతినెల రూ.2 వేల స్కాలర్ షిప్ రూపంలో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ బడ్జెట్‌లో ఎటిసి ట్రైనీలకు స్కాలర్‌షిప్ పథకానికి రూ.80 కోట్లు ప్రతిపాదించారు.

## ఐటి శాఖకు 13 శాతం పెరుగుదల

తెలంగాణ 2026–27 బడ్జెట్‌లో ఐటి, కమ్యూనికేషన్స్ శాఖలకు రూ.875 కోట్లు కేటాయించారు. గత సంవత్సరం 2025–26లో రూ.774 కోట్ల కేటాయింపు నుంచి రూ.101 కోట్లు (13శాతం) పెరిగింది.ప్రభుత్వం ఈ పెరుగుదల ద్వారా హైదరాబాద్‌ను గ్లోబల్ ఐటీ హబ్‌గా మార్చాలని, ఎఐ సిటీ, స్టార్టప్‌లు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై దృష్టి పెడుతోంది. మొత్తం రాష్ట్ర బడ్జెట్ రూ.3.24 లక్షల కోట్లతో పెరిగినా, ఐటి రంగ ప్రాధాన్యత స్పష్టంగా కనిపిస్తోంది.విపక్షాలు కమ్యూనికేషన్స్‌కు ప్రత్యేక బడ్జెట్ లేకపోవటంపై ప్రశ్నించాయి. భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఐటి విద్యార్థులకు రూ.2,000 సహాయం, హైటెక్ సెంటర్ల అభివృద్ధితో రంగాన్ని బలోపేతం చేస్తోంది.

## హోంశాఖకు 17శాతం అదనపు నిధులు

రాష్ట్రంలో శాంతిభద్రతలను మరింత పటిష్టం చేసేందుకు, ఆధునిక సాంకేతికతను పోలీసు వ్యవస్థలోకి తీసుకువచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం భారీగా నిధులను కేటాయించింది. శాసనసభలో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌లో హోం శాఖకు రూ. 11,907 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గత ఏడాది కేటాయించిన రూ. 10,188 కోట్లతో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిసే మావోయిస్టుల పునరావాసం, వారికి ఉపాధి కల్పన కోసం ఈ బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత నిచ్చారు. సామాజిక మార్పు ద్వారానే నక్సలిజానికి ముగింపు పలకవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిరోధానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' బలోపేతం కోసం, కొత్త ఫోరెన్సిక్ ల్యాబ్‌ల ఏర్పాటు కోసం నిధులను కేటాయించారు. సైబర్ నేరాల నియంత్రణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కొనుగోలు, సిసి కెమెరాల నెట్‌వర్క్ విస్తరణకు ఈ నిధులు వెచ్చించనున్నారు.**యంగ్ ఇండియా పోలీస్ స్కూల్:** పోలీస్ కుటుంబాల పిల్లల కోసం అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్' పనులను వేగవంతం చేయనున్నారు.

**హోం గార్డులకు ఊరట:** గత ఏడాది పెంచిన వేతనాలతో పాటు, వారికి సామాజిక భద్రత కల్పించే పథకాలకు నిధుల కొనసాగింపు ఉంటుంది. శాంతిభద్రతలు బాగుంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయని, అందుకే పోలీస్ శాఖకు నిధుల విషయంలో వెనకాడటం లేదని మంత్రి తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

## ఆరు గ్యారెంటీలకు ఓకె




### ఇందిరమ్మ ఇళ్ళ నిధులలో రూ.5371 కోట్ల నిధులు తగ్గింపు

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీలకు నిధులలో యధావిధంగా కొనసాగించింది. గత 2025–26 బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు రూ.56,084 కోట్లను కేటాయించగా శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్‌లో రూ.50,713 కోట్లను ప్రభుత్వం ప్రతిపాదించింది. తద్వారా ఈ ఆరు గ్యారెంటీలలోని తొమ్మిది పథకాలకు రూ.5371 కోట్ల నిధులను కోత విధించింది. 'ఇందిరమ్మ' పథకానికి గత బడ్జెట్‌లో రూ.12,571 కోట్లను కేటాయించగా ఈసారి బడ్జెట్‌లో సగానికి కోత విధిస్తూ రూ.5,500 కోట్లను కేటాయించింది. వ్యవసాయ రంగంలో అత్యంత కీలకమైన రైతులకు ప్రభుత్వం భరోసాను ఇస్తూ 'రైతు భరోసా' పథకానికి అత్యధికంగా రూ.18 వేల కోట్లను, వృద్ధులు, వికలాంగులు, వితంతు మహిళల పెన్షన్ పథకమైన 'చేయుత' పథకానికి రూ.14,861 కోట్లను, ఆర్‌టిసి బస్సులలో మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన 'మహాలక్ష్మి' పథకానికి రూ. 4305 కోట్లను, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాకు 'గృహజ్యోతి' పథకానికి రూ.2,080 కోట్లను, రైతులు పండిస్తున్న సన్న రకం ధాన్యానికి ఎకరాకు రూ.500 బోనస్ కోసం రూ.1,800 కోట్లను, పేదలకు ఉచిత వైద్యం అందించే 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకానికి రూ.1,143 కోట్లు, 'మహాలక్ష్మి పథకం' కింద ఎల్‌పిజి గ్యాస్ సబ్సిడీ చెల్లింపు కోసం రూ.723 కోట్లను, భూమిలేని వ్యవసాయ కార్మికులకు ఉద్దేశించిన 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకానికి రూ.600 కోట్లను ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో యధావిధిగా ప్రతిపాదించింది.

**ఆరు గ్యారెంటీలకు 2025–26, 2026–27 వార్షిక బడ్జెట్‌లలో కేటాయించిన నిధుల వివరాలు**

| క్ర.సం. పథకం పేరు | 2025–26 | 2026–27 |
|---|---|---|
| 1. రైతు భరోసా | రూ. 18,000 కోట్లు | రూ. 18,000 కోటు |
| 2. చేయూత | రూ. 14,861 కోట్లు | రూ. 14,861 కోట్లు |
| 3. ఇందిరమ్మ ఇళ్లు | రూ. 12,571 కోట్లు | రూ. 5,500 కోట్లు |
| 4. మహాలక్ష్మి (ఆర్‌టిసి) | రూ. 4,305 కోట్లు | రూ. 4,305 కోట్లు |
| 5. వ్యవసాయ ఉత్పత్తులకు బోనస్ | రూ. 3,500 కోట్లు | రూ. 3,500 కోట్లు |
| 6. గృహ జ్యోతి (200 యూనిట్ల ఉచిత విద్యుత్) | రూ. 2,080 కోట్లు | రూ. 2,080 కోట్లు |
| 7. రాజీవ్ ఆరోగ్యశ్రీ | రూ. 1,143 కోట్లు | రూ. 1,143 కోట్లు |
| 8. మహాలక్ష్మి పథకం కింద ఎల్‌పిజి సబ్సిడీ | రూ. 723 కోట్లు | రూ. 723 కోట్లు |
| 9. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా | రూ. 600 కోట్లు | రూ. 600 కోట్లు |
| **మొత్తం** | **రూ. 50,713 కోట్లు** | **రూ. 56,084 కోట్లు** |

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం.**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం. 08743-232428
ఆర్.సి నం. డి6/73/2025 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేదీ: 16.03.2026
ది.01.05.2026 నుండి ది.30.04.2027 వరకు ఒక సం.ర కాలమునకు దేవస్థానమునకు నిత్యాన్నదాన సత్రము మరియు పడితరమునకు అవసరమైన కాయగూరలు, ఆకుకూరలు సరఫరాచేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. **ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేదీ:** 21.03.2026 ఉదయం గం.11.00ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేదీ:** 04.04.2026 ఉదయం గం.11.00 వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేదీ:** 04.04.2026 ఉదయం గం.11.30లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేదీ:** 04.04.2026 మధ్యాహ్నం గం.12.00లకు. ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.
సం/- కె. దామోదర్ రావు, కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 17336-PP/CL/ADVT/1/2025-26, Date: 20-03-2026

**పురపాలక సంఘ కార్యాలయము - హుజూరాబాద్, జిల్లా: కరీంనగర్**
లేఖ నెం. E1/75/2025-26 టెండర్ ప్రకటన తేదీ: 20.03.2026
హుజూరాబాద్ పురపాలక సంఘ వివిధ గ్రాంట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టుటకు గాను అర్హత/ ఆసక్తి కలిగిన రిజిష్టర్డు సివిల్ కాంట్రాక్టర్ల అధీకృత డీలర్ల నుండి e-procurement ద్వారా ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. **01. పనుల సంఖ్య:** ( 04 ) పనులు, **02. టెండర్ల విలువ:** 31.25 లక్షలు, **03. బిడ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ:** 23.03.2026 ఉదయం 11.00 నుండి, **04. బిడ్ డౌన్‌లోడ్ చివరి తేదీ మరియు సమయము :** 26.03.2026 సాయంత్రం 4.00 గం. వరకు, **05. బిడ్లు తెరుచు తేదీ మరియు సమయము:** 26.03.2026 సాయంత్రం 4.05 నుండి. ఇతర వివరముల కొరకు www.Tender.Telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు. సంబంధిత వివరముల కొరకు మునిసిపల్ ఇంజినీర్ గారిని సంప్రదించగలరు. N.సుధాకర్‌రెడ్డి, మునిసిపల్ ఇంజనీర్-8501845507
సం/- కమిషనర్, పురపాలక సంఘము, హుజూరాబాద్.
DIPR R.O. No. : 17415-PP/CL/ADVT/1/2025-26, Date: 20-03-2026

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్.
కొటేషన్లను ఆహ్వానిస్తూ ప్రకటన
NIQ No. 14/EE-II/KHAIRATABAD ZONE/GHMC/2025-26 తేదీ: 18.03.2026

| NIQ No. | పని పేరు: |
|---|---|
| 14 | ఈ క్రింది పనుల కోసం కొటేషన్లు ఆహ్వానించబడినవి: 10mm మందం గల టఫ్నెడ్ గ్లాస్‌తో తయారు చేయబడిన KLIO సింగిల్ గ్లేజ్ పార్టిషన్ల సరఫరా మరియు అమరిక. ఈ ప్యానెళ్లకు 45x25mm (H) గల సహజ యానోడైజ్డ్ అల్యూమినియం గ్రౌండ్ ప్రొఫైల్ ఆధారంగా ఉంటుంది. ఇది సస్పెండెడ్ ఫాల్స్ సీలింగ్‌కు జోడించబడిన 45x25mm (H) సీలింగ్ ప్రొఫైల్‌కు అనుసంధానంగా ఉంటుంది. గ్రౌండ్ మరియు సీలింగ్‌లో వంపుల కోసం, గ్రౌండ్ & సీలింగ్ ప్రొఫైల్‌కు దిగువన ఫోమ్ టేప్ KL 009 ఆధారంగా ఉంటుంది. నిలువు అంచుల వద్ద గాజు పలకలను 45x25mm పరిమాణంలో ఉన్న KL 002 వర్టికల్ ప్రొఫైల్‌తో చుట్టారు. గాజును గాజుతో కలపడానికి 1 mm x 7mm క్లియర్ సిలికాన్ టేప్‌ను ఉపయోగిస్తారు (KL 007 'I' ప్రొఫైల్‌తో గాజును గాజుతో కలపడం కూడా అందుబాటులో ఉంది). మూలలోని గాజును గాజుతో కలిపే చోట KL 005 90డిగ్రీ కార్నర్ ప్రొఫైల్ మరియు KL 006 135డిగ్రీ కార్నర్ ప్రొఫైల్ ఉంటాయి. 'I' జంక్షన్‌లోని గాజును గాజుతో కలిపే చోట KLIO 004 'I' ప్రొఫైల్ ఉంటుంది. మెరుగైన ధ్వనిశాస్త్రం కోసం KL 005 మరియు KLIO 004 ప్రొఫైల్లకు ఇంటర్నల్ టేప్ KL 011 మద్దతు ఇస్తుంది. 50x25x2mm అల్యూమినియం ఫ్రేమ్ 12mm మందపాటి ప్లైవుడ్ మరియు 1 mm మందపాటి డెకరేటివ్ మెలమైన్ లామినేట్ (మ్యాట్ ఫినిష్) ఉపయోగించి వాల్ ప్యానెలింగ్‌ను, అన్నిరకాల మెటీరియల్స్, అడెసివ్స్, ఫిట్టింగ్స్ మరియు లేబర్ ఛార్జీలతో సహా పూర్తిగా అందించడం మరియు బిగించడం. |
| | ఇంజనీర్-ఇన్-ఛార్జ్ ఆదేశాల మేరకు, 25 HP, 1440 RPM, 3 ఫేజ్ IE2 TEFC ఇండక్షన్ మోటార్, సెంట్రిఫ్యూగల్ బ్లోవర్ వీల్, V-బెల్ట్ డ్రైవ్ సిస్టమ్, పుల్లీలు, బెల్టులు, షాఫ్ట్, పెడెస్టల్ బేరింగ్స్ మరియు MS బేస్ ఫ్రేమ్‌తో కూడిన 25 HP కోల్ ఎయిర్ బ్లోవర్ డ్రైవ్ అసెంబ్లీని, ఇన్‌స్టాలేషన్, అలైన్‌మెంట్, టెస్టింగ్ మరియు కమిషనింగ్‌తో సహా పూర్తిగా అందించడం మరియు సరఫరా చేయడం. |
| | ఆస్ట్‌బర్గ్ కంపెనీ ఇన్‌లైన్ ఫ్యాన్ AFV-19 DP, సెంట్రిఫ్యూగల్ ఎగ్జాస్ట్ ఫ్యాన్ ADD-200, డిస్క్ డిఫ్యూజర్లు AS506-125-MM(ADD125), 5' ఫ్లెక్సిబుల్ ఫ్యాబ్రిక్ డక్ట్‌లు, 5' SS హోస్ క్లాంప్‌లు, 200mm నుండి 100mm వరకు ABS రెడ్యూసర్లు, ఔటర్ స్టీల్ ఎగ్జాస్ట్ కౌల్ ASF 150Q మరియు 72mm డక్ట్ సీలింగ్ టేప్‌తో కూడిన పూర్తి వాష్‌రూమ్ మరియు ప్యాంట్రీ వెంటిలేషన్ సిస్టమ్‌ను, అన్ని ఫిట్టింగ్లు, ఫిక్సింగ్, టెస్టింగ్ మరియు కమిషనింగ్‌తో సహా పూర్తిగా అందించడం మరియు ఇన్‌స్టాల్ చేయడం. |
| | మెరినో కంపెనీ కాంపాక్ట్ లామినేట్ టాయిలెట్ క్యూబికల్ పార్టిషన్లను (12 mm మందం గల HPL బోర్డులతో తయారు చేయబడినవి), డోర్లు, పిలాస్టర్లు మరియు పార్టిషన్లతో సహా, ఆమోదించబడిన డిజైన్ మరియు ఇంజనీర్-ఇన్-ఛార్జ్ ఆదేశాల ప్రకారం, హింజ్లు, ఇండికేటర్ లాక్, కోట్ హుక్, సర్దుబాటు చేయగల SS legs, అల్యూమినియం టాప్ రెయిల్, బ్రాకెట్లు మరియు ఫాస్టెనర్ల వంటి SS 304 గ్రేడ్ హార్డ్‌వేర్‌తో పూర్తిగా అందించడం మరియు ఫిక్స్ చేయడం. |

| | |
|---|---|
| టెండర్ ప్రకటన / బిడ్ ఆహ్వాన తేదీ / స్పెసిఫికేషన్లు పొందడం | 20-03-2026 ఉదయం 10.30 గంటలకు |
| బిడ్ సమర్పణకు చివరి తేదీ మరియు సమయం /(లేదా) సీల్డ్ కొటేషన్లు స్వీకరించడం | 23-03-2026 మధ్యాహ్నం 12.15 గంటలకు |
| ప్రీక్వాలిఫికేషన్ & టెక్నికల్ బిడ్ల ప్రారంభం | 23-03-2026 మధ్యాహ్నం 12.30 గంటలకు |

**గమనిక:-** స్పెసిఫికేషన్లను ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్ వారి కార్యాలయం నుండి పొందవచ్చు మరియు సీల్డ్ కొటేషన్లను అదే కార్యాలయంలో సమర్పించాలి.
కావున, అర్హత కలిగిన ఏజెన్సీలు పైన పేర్కొన్న కాల వ్యవధిలో, అవసరమైన అన్ని వివరాలతో తమతమ బిడ్లను సమర్పించవచ్చు.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 17392-PP/CL/ADVT/1/2025-26, Date: 20-03-2026

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
21-03-2026
www.prajapaksham.in





● అసెంబ్లీ మీడియా పాయింట్

## బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల ఊసే లేదు

మధుసూధనాచారి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల ఊసే లేదని, ఇది మిమ్మల్ని నమ్మి అధికారం కట్టబెట్టిన ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ సిరికొండ మధుసూధనాచారి పేర్కొన్నారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు 2 లక్షల ఉద్యోగాల నియామకాలపై, విద్యార్థులు ఫీజు రీయింబర్స్ మెంట్‌లపై గగ్గోలు పెడుతున్న, బడ్జెట్‌లో వాటి ప్రస్తావనే లేకపోవడం దారుణమన్నారు. గత బడ్జెట్‌లో పథకాలకు కేటాయించిన నిధుల ఖర్చు టెలిస్కోప్ పెట్టి చూసినా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. సమాజంలో సగభాగం ఉన్న బిసిల బతుకులతో ఈ ప్రభుత్వం చెలగాటమాడి అపహాస్యం చేస్తున్నదని, బిసిలకిచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని మాట తప్పారని విమర్శించారు. ముఖ్యమంత్రి రెండున్నర గంటల ప్రసంగంలో కెసిఆర్ మీద ఏడవటం, ఇచ్చిన హామీలు ఎగవేయడం, అడిగితే ఎదురుదాడి చేయడం, అబద్ధాలు చెప్పడం తప్ప మరేం చేశారని మధుసూధనాచారి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### రిక్వెస్ట్ చేస్తే కాదు.. పోరాడి హక్కులు సాధించాలి

దేశపతి శ్రీనివాస్

ప్రజలు, నిరుద్యోగులు, ఉద్యోగులు ప్రభుత్వాన్ని రిక్వెస్ట్ చేస్తే హక్కులు రావని, పోరాడి వాటిని సాధించుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ బడ్జెట్ సకలజనులను గంగలో ముంచిన బడ్జెట్ అని పేర్కొన్నారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, ఫించన్ల పెంపు, మహిళలకు రూ.2.500, బిసి సబ్ ప్లాన్, విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్, విశ్రాంత ఉద్యోగుల బకాయిల చెల్లింపు వంటి అంశాలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం, కాంగ్రెస్ పతనానికి నాంది అని పేర్కొన్నారు.

### బోగస్ బడ్జెట్ : దాసోజు శ్రవణ్

చెల్లని రూపాయికి గీతలెక్కువ, చెల్లని నాయకుడికి గొప్పలెక్కువ అనే చందంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని, ఇదోక బోగస్ బడ్జెట్ అని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన ఇచ్చిన హామీలపై మాట ముచ్చట లేదన్నారు. ప్రజలపై సోయి లేకుండా, కేవలం జేబులు నింపుకోవడానికే బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయని ఆరోపించారు. గత బడ్జెట్‌లో రెవెన్యూ శాఖ ద్వారా వచ్చే ఆదాయ ప్రతిపాదనలు రూ. 2,29 లక్షల కోట్లు చూపిస్తే, అందులో రూ.2.03 కోట్లు వచ్చాయని కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలు చెబుతుందని, కాగ్ రిపోర్టు మాత్రం రెవెన్యూ ఆదాయం రూ. 1.38 లక్షల కోట్లు మాత్రమే వచ్చిందని స్పష్టం చేశాయన్నారు. ఇలా ప్రతి దాంట్లో తప్పుడు లెక్కలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు.

### బిసిల ముఖంపై చిల్లర వేశారు : తీన్మార్ మల్లన్న

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బిసిలకు రూ.12 వేల కోట్లు మాత్రమే కేటాయించి, బిసిల ముఖంపై చిల్లర వేశారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ చింతపండు నవీన్(తీన్మార్ మల్లన్న) ఆరోపించారు. శాసన మండలి మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మూడవ సం వత్సరం కూడా బిసిలను మోసం చేసిందని, బిసి సబ్‌ప్లాన్ అంశం బడ్జెట్‌లో లేకపోవడం అన్యాయమన్నారు. కేటాయించిన బడ్జెట్‌ను కూడా ఖర్చు చేస్తాలేరని, గత రెండు సంవత్సరాలకు బిసిలకు రూ.3 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మండిపడ్డారు. బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు అతి తక్కువ నిధులు కేటాయించిందని, కాంట్రాక్టు, కార్మికుల కోసమే బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నట్లు కనిపిస్తున్నాయని ఆరోపించారు.

### హాట్రిక్ చీటింగ్ బడ్జెట్ : ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



అసెంబ్లీలో ప్రభుత్వం మూడవ సారి ముచ్చటగా ప్రవేశపెట్టిన బడ్జెట్ హాట్రిక్ చీటింగ్ బడ్జెట్ అని బిజెపి శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన బడ్జెట్‌పై స్పందిస్తూ బడ్జెట్ ఆర్థిక విధ్వంసానికి బాటలు వేసిందన్నారు. బడ్జెట్, ఊహాజనితంగా, అప్పుల మీదనే ప్రభుత్వం ఆధారపడ్డట్లు ఈ బడ్జెట్‌తో స్పష్టమవుతుందన్నారు. ముస్లింలతో పోలిస్తే బిసిలకు అన్యాయం చేశారన్నారు. నిరుద్యోగులను, మహిళలనును సైతం మోసం చేశారన్నారు. విద్యాశాఖకు 15 శాతం నిధులు ఇస్తానని గత మూడు బడ్జెట్‌లలో కేటాయించలేదని విమర్శించారు. బిజెపి ఎంఎల్ఎ పాయల్ శంకర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలను మోసం చేసిన బడ్జెట్ లోపాలు బడ్జెట్ చర్చలో ఎత్తి చూపుతామన్నారు.

### అన్ని వర్గాలకు న్యాయం చేసే ప్రజారంజక బడ్జెట్

ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య



అసెంబ్లీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేవిధంగా, సంక్షేమ పథకాలకు సముచిత న్యాయం చేసే విధంగా ఉందని, ఇది విజన్ ఉన్న బడ్జెట్ అని కాంగ్రెస్ శాసన సభ పక్షం అభిప్రాయపడింది. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం బడ్జెట్‌పై ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య, విప్ ఆది శ్రీనివాస్, ఎంఎల్ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, రామచంద్ర నాయక్, భూపతిరెడ్డి, ఎంఎల్‌సిలు అద్దంకి దయాకర్, డాక్టర్ బల్మూర్ వెంకట్ స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే సంక్షేమ పథకాలు బిఆర్ఎస్ జీర్ణించుకోలేకపోతుందని బీర్ల ఐలయ్య అన్నారు. ఈ బడ్జెట్‌లో నీటి ప్రాజెక్టులకు, రైతాంగానికి, విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, రైతులకు పెద్దపీట వేశామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు కోటి రూపాయల బీమా పథకం, ఇంటర్మీడియట్ పేద విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం చూస్తుంటే బిఆర్ఎస్ ఓర్వలేకపోతుందని విమర్శించారు. అసెంబ్లీలో బడ్జెట్ వినని బిఆర్ఎస్ నేతలు తెలంగాణ ద్రోహులని అన్నారు. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బడ్జెట్ జనరంజకంగా ఉందని, ఫోర్త్ సిటీ, మూసీ నది ప్రక్షాళన అంశం ప్రస్తావన రాగానే బిఆర్ఎస్ వాకౌట్ చేసిందని, ఎందుకు వాకౌట్ చేశారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# ప్రసంగాలకే పరిమితం కావొద్దు

నిధులు పూర్తిస్థాయి ఖర్చు చేసేలా బాధ్యతలు తీసుకోవాలి

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ మిశ్రమ బడ్జెట్‌లా కనిపిస్తుందని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన వార్షిక బడ్జెట్‌పై స్పందిస్తూ రాష్ట్ర ప్రజలు బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ముఖ్యంగా పెన్షన్ల రెట్టింపు, కల్యాణలక్ష్మి, రైతులకు సంబంధించిన వాగ్దానాల అమలు కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. బడ్జెట్ కేవలం అసెంబ్లీ ప్రసంగాలకు పరిమితం కాకుండా బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి తోడ్పడేలా ఉండాలని, కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ కోరుతుందని నెల్లికంటి సత్యం అన్నారు. బడ్జెట్‌లో ఉన్న పథకాలకే నిధులు కేటాయించడం మిన హా కొత్త పథకాల ప్రస్తావనే లేకపోవడం దారుణమన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్ధానాలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ఇరిగేషన్‌కు గతంలో రూ. 23,373 కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో రూ. 22,615 కోట్లు మాత్రమే కేటాయించారని, అంటే సుమారు రూ.2 వేల కోట్లు తక్కువ చేశారని వెల్లడించారు. కార్మికవర్గాల సంక్షేమానికి సంబంధించి ఆర్‌టిసి కార్మికులు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల ప్రస్తావన బడ్జెట్‌లో లేకపోవడం అన్యాయమన్నారు. ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీ నేతలు, విద్యావేత్తలు రాష్ట్ర బడ్జెట్‌లో విద్యరంగానికి 20శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే, ప్రభుత్వం కేవలం 8 శాతం మాత్రమే కేటాయించించడం అన్యాయమన్నారు. వైద్య రంగానికి 10శాతం నిధులు కేటాయించాలని కోరితే, కేవలం 4 శాతం మాత్రమే కేటాయించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగాలకు ఎక్కువ నిధులు కేటాయించాలని డి మాండ్ చేస్తుంటే, ఆ రంగాలకే తక్కువ నిధులు కేటాయించడం దారుణమని విమర్శించారు. బిసిలకు గత బడ్జెట్ కంటే ఒక వెయ్యి కోట్లు మాత్రమే పెంచారని, కానీ బడ్జెట్‌లో సబ్ ప్లాన్ ప్రస్తావన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, చేయూత రెండు పథకాలు మాత్రమే కొత్తవి తీసుకువచ్చారని, ప్రజలకు ఉత్సాహపూరితంగా ఈ బడ్జెట్ కనబడట్లేదన్నారు. ముఖ్యంగా ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలైన నల్గొండ ప్రాంతంలో చేపట్టిన ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు, డిండి ఎత్తి పోతల పథకం వంటివి పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదని, వీటికి ఎక్కువ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రేషన్ కార్డులు మంజూరు వంటివి సంతోషం కలిగించే అంశాలే అయినప్పటికీ గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియా బకాయిలు, యాదవులు, ముదిరాజులు, చేనేత కార్మికులు వంటి వృత్తి సంఘాలకు నిధుల గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదని విచారం వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో, నైపుణ్యాభివృద్ధిలో ఈ బడ్జెట్ దిశా నిర్దేశం చేయలేకపోయిందని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల భర్తీపై స్పష్టత లోపించిందని పేర్కొన్నారు.

### చివరి పది నిమిషాల ముందే వాకౌట్ చేసిన బిఆర్ఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర శాసనసభలో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగాన్ని చదువుతున్న సమయంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు చేస్తూ బడ్జెట్ ప్రతులను చింపి సభలో విసిరేశారు. బడ్జెట్ 'బోగస్' అని, ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. ప్రసంగం ముగియడానికి పది నిమిషాల ముందే బిఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు.

### ఇది 'ఫేక్, రివిజన్' బడ్జెట్ : కల్వకుంట్ల కవిత

బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ బడ్జెట్ పూర్తిగా ఫేక్, రివిజన్, ఫ్యాబ్రికేటెడ్ అని కవిత విమర్శించారు. పాత అంకెల్నే అటు ఇటు మార్చి కొత్త బడ్జెట్‌గా చూపిస్తున్నారని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వం ఒక్కో కుటుంబంపై రూ.9 లక్షల అప్పు భారం మోపిందని, రాష్ట్ర అప్పులను రూ.8.64 లక్షల కోట్లకు చేర్చిందని దుయ్యబట్టారు. రాష్ట్ర జనాభాలో 56 శాతంగా ఉన్న బిసిలకు కేవలం 4 శాతం నిధులు కేటాయించడం దారుణమని, రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలరన్ని నీటి మూటలని విమర్శించారు. హైదరాబాదీ సలీం ఫేక్ తన మాటలతో నవ్విస్తే, రాహుల్ గాంధీ తన అబద్ధపు హామీలతో ప్రజలను ఏడిపిస్తున్నారని ఆయనకు రాహుల్ ఫేక్ అని నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. మహిళలకు నెలకు రూ. 2,500 పథకం, నిరుద్యోగ భృతి, రైతు భరోసా వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రజలను వంచించిందని కవిత విమర్శించారు.

### సమగ్ర సంక్షేమ బడ్జెట్

మంత్రి సీతక్క ప్రశంసలు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అద్భుతమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హర్షం వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం ఆమె డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కలిసి అభినందనలు తెలిపారు. పంచాయతీరాజ్ శాఖకు అత్యధిక కేటాయింపులు చేయడం ద్వారా గ్రామీణ మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె అన్నారు. కొత్తగా 2 లక్షల పెన్షన్లు మంజూరు చేయడం వృద్ధులు, వికలాంగులకు కొండంత అండ అని తెలిపారు. 1.15 కోట్ల కుటుంబాలకు భద్రత కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, విద్యార్థుల కోసం అల్పాహారం పథకం అమలు చేయడం గొప్ప విషయాలన్నారు. ఇది కేవలం అంకెల గారడీ కాదని, సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా రూపొందించిన ప్రజా బడ్జెట్ అని సీతక్క హర్షం వ్యక్తం చేశారు.

### అంకెలు ఘనం- అమలు శూన్యం : సిపిఐ(ఎంఎల్ ) మాస్ లైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెలు మాత్రం ఘనంగా, అమలు శూన్యంగా ఉంటుందని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పేర్కొంది. ప్రవేశపెట్టిన ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌లో అసలు పథకాల కేటాయింపుల ఊసే లేదని రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. రూ.6 లక్షల కోట్ల అప్పు భారంతో కునారిల్లుతున్న రాష్ట్ర ప్రభుత్వం మాటలతో అరచేతిలో వైకుంఠం చుపిస్తోందని ఆయన పేర్కొన్నారు.

### విద్యారంగానికి కనీసం 15శాతం నిధులు కేటాయించాలి: ఎఐఎస్ఎఫ్

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ.3,24,234లక్షల కోట్లలో విద్యారంగానికి కేవలంరూ. 26,674 కోట్లు (8.22శాతం) మాత్రమే కేటాయించడం అన్యాయమని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్‌లు అన్నారు. గత బడ్జెట్‌తో పోల్చితే ఈ బడ్జెట్ లో అదనంగా రూ. 3566కోట్లు కేవలం (1.18శాతం) మాత్రమే పెంచిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో విద్యకు (15 శాతం ) నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడవ సారి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో కూడ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈబడ్జెట్ లో విద్యారంగానికి కేటాయించిన నిధులను సవరించి అధిక శాతం నిధులు కేటాయించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

### బిసిలకు మరోసారి అన్యాయం : బిసి హక్కుల సాధన సమితి

బిసిలకు కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు మరోసారి అన్యాయం చేసిందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి బడ్జెట్లో బిసిలకు రూ. 20 వేల కోట్లు కేటాయిస్తామని, బిసిలకు అభివృద్ధికి 5 ఏళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేయడంతో పాటు జ్యోతిరావు పూలే సబ్ ప్లాన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఈసారి కూడ మొండి చెయ్యి చూపిందన్నారు. బిసి జనాభా నిష్పత్తి ప్రకారం బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

**మహిళా అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కడా ? మహిళా సమాఖ్య**


మహిళా అభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు పెంచాల్సిన ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని తెలంగాణ మహిళా సమాఖ్య రాష్ట కమిటి విమర్శించింది. శుక్రవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణ ప్రభుత్వం మహిళలకు మొండిచెయ్యి చూపిందని రాష్ట్ర అధ్యక్షురాలు సృజన, కార్యనిర్వహక అధక్షురాఉల సదా లక్ష్మి ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు మహిళలకు ఇస్తామన్న రూ.2500 లు, పేదింటి ఆడబిడ్డలకుపెళ్లిళ్లకు తులం బంగారం ఎక్కడా ప్రకటన చేయకపోవడం విచారకరమని పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమానికి కేవలం 3143 కోట్లు కేటాయించిందని, అదేవిధంగా కళ్యాణ లక్ష్మి కి రూ.3600 కోట్లు ఏ మూలకు సరిపోవు అన్నారు. విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తామని వాగ్దానం చేసిన ముఖ్య మంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఇందుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, మొత్తానికి బడ్జెట్ కాకి లెక్కలుగానే కనిపించాయని వారు విమర్శించారు.

### అంకెల గారడీ బడ్జెట్ : సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అంకెల గారడీ బడ్జెట్‌తో తెలంగాణ అభివృద్ధి అసాధ్యమని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పేర్కొంది. శుక్రవారం ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026–27 ఆర్థికబడ్జెట్ భారీ అంకెలతో కూడుకున్నప్పటికీ, వాస్తవంగా రాష్ట్రంలోని రైతాంగం, యువతరం, ప్రత్యేకించి విద్యార్థులు, మహిళలకు చేసిన కేటాయింపులు ఏమాత్రమూ సరిపోని రీతిలో రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి తీసుకెళ్లే లాగానే ఉందని రాష్ట్ర కార్యదర్శి పి.సూర్యం పేర్కొన్నారు.అన్ని వర్గాల ప్రజానీకాన్ని నిరాశపరిచి, రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టే ఈ బడ్జెట్ నిండా అంకెల గారడీ, మాటల గారడీతో నిండి వున్నదని సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ భావిస్తోందని ఆయన వెల్లడించారు.

# కీలక నీటి ప్రాజెక్టులకు కేటాయింపులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బడ్జెట్‌లో నీటి పారుదల శాఖకు కేటాయింపులు గతంతో పోల్చితే పెద్దగా తేడా లేదు. గత ఏడాది ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.12,652 కోట్లు కేటాయించగా, 2026–27 ఆర్థిక సంవత్సరంలో రూ.12,836 కోట్లు కేటాయించారు. అత్యధికంగా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.1,800 కోట్లు కేటాయించగా, ఎస్ఎల్‌బిసికి రూ.800 కోట్లు, డిండికి రూ.600 కోట్లు కేటాయించారు. ముఖ్యమంత్రి నియోజకవర్గానికి సంబంధించిన నారాయణపేట్– కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన యాక్సిలరేటెడ్ ఇరిగేషన్ బెనిఫిట్ ప్రాజెక్ట్ (ఎఐబిపి) కింద రూ.1,101.92 కోట్లు కేటాయించబడింది. ముఖ్యమైన ప్రాజెక్టులకు బడ్జెట్‌లో మూలధన పెట్టుబడి కేటాయింపు వివరాలు ఇలా ఉన్నాయి.



| ప్రాజెక్టు | నిధులు |
|---|---|
| పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం | రూ. 1800 కోట్లు |
| ఎల్ఎల్‌బిసి కెనాల్ | రూ. 800 కోట్లు |
| డిండి ఎత్తిపోతల పథకం | రూ. 600 కోట్లు |
| శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ | రూ. 449.66 కోట్లు |
| కాళేశ్వరం ప్రాజెక్టు | రూ. 230.43 కోట్లు |
| ఎన్ఎస్‌పి ఎత్తిపోతల పథకం(ఎర్రుపాలెం) | రూ. 369.95 కోట్లు |
| సీతారామ ఎత్తిపోతల పథకం | రూ. 320.81 కోట్లు |
| ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్ – 2 | రూ. 249.85 కోట్లు |
| లోయర్ పెన్‌గంగ | రూ. 177.54 కోట్లు |
| శ్రీరాంసాగర్ ప్రాజెక్టు స్టేజ్ – 1 | రూ.119.89 కోట్లు |
| నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ (సిఇ) | రూ. 196.85 కోట్లు |
| నిజాంసాగర్ మరమ్మతు పనులు | రూ.71.31 కోట్లు |
| ఆర్‌డిఎస్ లింక్ కెనాల్ పనులు | రూ.18 కోట్లు |
| సింగూరు ప్రాజెక్టు | రూ. 45.39 కోట్లు |
| ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు | రూ. 90 కోట్లు |
| నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం | రూ. 250 కోట్లు |
| భీమా ఎత్తిపోతల పథకం | రూ. 87 కోట్లు |
| చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల | రూ. 445 కోట్లు |
| ప్రాణహిత చేవెళ్ళ సృజల స్రవంతి | రూ. 52.62 కోట్లు |
| పి.వి.నరసింహారావు కాంతానపల్లి ఎత్తిపోతల | రూ.11.55 కోట్లు |
| మంచిర్యాలలో బ్యాక్‌వాటర్ రక్షణ గోడ | రూ. 115.84 కోట్లు |
| ప్రపంచ బ్యాంక్ డ్యామ్ రిహాబిలిటేషన్ | రూ.75 కోట్లు |
| **మీడియం ఇరిగేషన్** | |
| కోయిల్‌సాగర్ ప్రాజెక్టు | రూ.71.16 కోట్లు |
| మూసీ ప్రాజెక్టు | రూ. 30.15 కోట్లు |
| వైరా ప్రాజెక్టు | రూ. 30 కోట్లు |
| పాలెం వాగు | రూ. 13.71 కోట్లు |
| ఎల్‌టి బయ్యారం (సిఇ రాజీవ్) | రూ.50 కోట్లు |
| సంగంబండ | రూ.25.53 కోట్లు |
| సత్నాలా | రూ. 10 కోట్లు |
| నీల్వాయి ప్రాజెక్టు | రూ. 54.74 కోట్లు |
| మోడికుంట వాగు | రూ. 90 కోట్లు |
| పెద్దవాగు (రాజీవ్ సాగర్) | రూ.50 కోట్లు |
| పెద్దవాగు (కుమ్రం భీమ్ – ఎస్ఆర్ఎస్‌పి) | రూ.15.32 కోట్లు |
| **మైనర్ ఇరిగేషన్** | |
| మిషన్ కాకతీయ | రూ.459 కోట్లు |
| చెరువుల పునరుద్ధరణ | రూ. 122.65 కోట్లు |
| **కేంద్రం ఎఐబిపి నిధులు** | |
| చొక్కారావు దేవాదులుఎత్తిపోతల | రూ.35 కోట్లు |
| ఎస్ఆర్ఎస్‌పి స్టేజ్–2 | రూ. 26.96 కోట్లు |
| రాజీవ్ భీమా ఎత్తిపోతల | రూ.19.42 కోట్లు |
| నారాయణపేట్– కొడంగల్ ఎత్తిపోతల | రూ. 1,101.92 కోట్లు |

### 2026–27 బడ్జెట్‌లో ప్రధాన పథకాలకు కేటాయింపులు

| పథకం పేరు | కేటాయింపులు (రూ.కోట్లలో |
|---|---|
| విద్యుత్ సబ్సిడీ | 14,000 |
| బియ్యం సబ్సిడీ | 3,000 |
| కళ్యాణ లక్ష్మి /షాదీ ముబారక్ | 3,683 |
| డైట్ | 2,170 |
| స్కాలర్షిప్స్ | 4,343 |
| కార్యాలయ ఖర్చులు | 2,323 |
| ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లు (రాష్ట్ర వాటా సహా) | 5,526 |
| ఎస్‌డిఎఫ్, సిడిఎఫ్ | 3,300 |
| హ్యామ్ రోడ్లు (అప్గ్రేడేషన్, మెయింటెనెన్స్) | 1,372 |
| గ్రామీణ రోడ్ల నిర్మాణం | 750 |
| గ్రామీణ రోడ్ల నిర్వహణ (ఎఫ్‌డిఆర్ సహా) | 500 |
| పంచాయతీ రాజ్ రోడ్లు | 2,622 |
| హ్యామ్ రోడ్లు (అప్గ్రేడేషన్, మెయింటెనెన్స్) | 3,053 |
| రీజినల్ రింగ్ రోడ్ | 1,525 |
| ఆర్‌బి రోడ్ల నిర్వహణ | 828 |
| కొత్త రోడ్ల నిర్మాణం | 450 |
| సిఆర్ఐఎఫ్ | 243 |
| ఆర్ఓబి, ఆర్‌యుబి | 216 |
| సచివాలయం భవనాల నిర్మాణం | 100 |
| రోడ్లు, భవనాలు మొత్తం | 6,416 |
| రాజీవ్ యువ వికాసం | 5,800 |
| రాజీవ్ యువ వికాసం (క్యూర్ పరిధిలో ఆటో రిక్షాలకు ఎలక్ట్రిక్ ఫిట్‌మెంట్) | 200 |
| యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ | 5,000 |
| ఇందిర కుటుంబ జీవన భీమా (అన్ని కుటుంబాలకు) | 4,000 |
| హైదరాబాద్ నగర అభివృద్ధికి క్యూర్ (హెచ్ సిటి) సహాయం | 2,654 |
| డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు | 2,500 |
| పంట బీమా | 1,886 |
| పరిశ్రమల ప్రోత్సాహకాలు | 1,835 |
| మూసీ నది తీర అభివృద్ధి | 1,500 |
| ఎస్సీ కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధి | 1,500 |
| హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డు అభివృద్ధి రుణాలు | 1,450 |
| ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్) | 1,056 |
| నగరాభివృద్ధి (మంచిర్యాల, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, పాల్వంచ) | 1,000 |
| ట్రాన్స్‌కోకు సహాయం | 1,000 |
| జెన్కోకు సహాయం | 1,000 |
| గ్రీన్ ఎనర్జీ (గ్రామాల సౌర విద్యుదీకరణ) | 1,000 |
| 100 శాతం గ్రామాల సౌర విద్యుదీకరణ | 1,000 |
| హైదరాబాద్ వాటర్ బోర్డుకు సుంకిశాల ప్రాజెక్ట్ రుణం | 1,000 |
| ఉస్మానియా విశ్వవిద్యాలయం | 1,000 |
| పర్యాటక మౌలిక వసతుల అభివృద్ధి | 875 |
| పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, పాలు | 720 |
| మున్సిపాలిటీల అభివృద్ధి పనులకు సహాయం | 651 |
| మెట్రో రైలు (దశ–2) | 600 |
| ఇందిర సౌర గిరి జల వికాసం | 600 |
| తెలంగాణ పబ్లిక్ స్కూల్ | 500 |
| తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ | 500 |
| గోదావరి పుష్కరాలు | 500 |
| దేవాలయాల అభివృద్ధికి సహాయం | 440 |
| ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలు (జీతాలు, డైట్ తప్ప) | 508 |
| హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ (హెచ్ఎంఆర్ఎల్)రుణాలు | 500 |
| మిషన్ భగీరథ అర్బన్ | 500 |
| అభివృద్ధి కార్యక్రమాల కోసం హెచ్ఎండిఎకు రుణాలు | 500 |
| వీరనారి చాకలి ఇలమ్మ మహిళా విశ్వవిద్యాలయం | 400 |
| మిషన్ భగీరథ ఆపరేషన్ మరియు నిర్వహణ | 400 |
| సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్ శాఖ | 461 |
| చేనత కార్మికులకు సహాయం | 450 |
| మోస్ట్ బ్యాక్వర్డ్ క్లాసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ | 400 |
| పావలవడ్డి పథకాన్ని అన్ని SSI ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు విస్తరణ | 350 |
| వ్యవసాయ యంత్రీకరణ | 344 |
| ఎస్‌సిఎస్‌డిఎఫ్ పథకం కోసం క్యూర్‌కు సహాయం | 315 |
| 20 కెఎల్ ఉచిత నీటి సరఫరా పథకానికి హెచ్ఎండబ్ల్యుఎస్‌బి రీయింబర్స్‌మెంట్ | 300 |

### ఉభయ సభలు సోమవారానికి వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ శాసనసభ, శాసనమండలి ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. శాసనసభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క 2026–27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సభను వాయిదా వేశారు. అదే విధంగా శాసనమండలిలో రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమకుమార్‌రెడ్డి బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సభను వాయిదా వేశారు. రంజాన్ పండుగ సందర్భంగా ఉభయ సభలకు రెండు రోజుల పాటు సెలవు ప్రకటిస్తూ ఉభయ సభల సమావేశాల ప్రారంభోత్సవం సదర్భంగా జరిగిన బిఎసి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాగా సోమవారం, మంగళవారాలలో వార్షిక బడ్జెట్‌పై సాధారణ చర్చ జరగనుంది. ఉభయ సభల సమావేశాలు ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్నాయి.

### బడ్జెట్ సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమం కలగలిపిన ప్రణాళిక

మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్ కేవలం లెక్కల పత్రం కాదని, ఇది సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, సంక్షేమం కలగలిపిన అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు నడిపించే కార్యాచరణ ప్రణాళిక అనిఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. దళిత, గిరిజన సమగ్రాభివృద్ధికి దిశా నిర్దేశమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రి మాట్లాడుతూ దళిత, గిరిజన, అట్టడుగు వర్గాల సాధికారతను కేంద్రబిందువుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దూరదృష్టితో ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క సమర్థ నాయకత్వంలో రూపొందించిన 2026–27 బడ్జెట్ సమగ్రాభివృద్ధికి మార్గదర్శిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ప్రతిపాదించిన సామాజిక న్యాయం, సమాన అవకాశాల లక్ష్యాలను ప్రతిబింబించే బడ్జెట్‌గా మంత్రి అభివర్ణించారు. షెడ్యూల్డ్ కులాలకు రూ.11,784 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు రూ.7,935 కోట్లు కలిపి మొత్తం రూ.19,721 కోట్ల భారీ కేటాయింపులు చేయడం ద్వారా అట్టడుగు వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు.

# పెట్టుబడి-స్నేహపూర్వక రాష్ట్రంగా కేరళ

**• ప్రభుత్వ కృషి ఫలితంగా అవినీతి స్థాయిలు తగ్గాయ్ • సిపిఐ(ఎం)లో కొందరు కార్యకర్తలలో పార్లమెంటరీ ఆకాంక్షలు పెరుగుతున్నాయ్ : కేరళ సిఎం పినరయ్ విజయన్**



**తిరువనంతపురం :** కేరళ ఒక పెట్టుబడి – స్నేహపూర్వక రాష్ట్రంగా రూపుదిద్దుకుందని, ప్రభుత్వ కృషి ఫలితంగా అవినీతి స్థాయిలు తగ్గాయని కూడా ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ పేర్కొన్నారు. జమాత్–ఎ–ఇస్లామీని ఒక మతతత్వ సంస్థగా సిపిఐ(ఎం) పరిగణిస్తుందని విజయన్ ఏషియా నెట్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పునరుద్ఘాటించారు. మతతత్వాన్ని ప్రోత్సహించే ఏ శక్తులనూ రాష్ట్రంలో పనిచేయడానికి అనుమతించబోమని అన్నారు. శబరిమల అంశంపై మాట్లాడుతూ, రుతుక్రమ వయసులో ఉన్న మహిళల ప్రవేశానికి సంబంధించిన నిర్ణయాన్ని మత పండితులు, సంఘ సంస్కర్తలతో సంప్రదించి తీసుకోవాలన్నదే తమ పార్టీ యొక్క నిలకడైన వైఖరి అని ఆయన తెలిపారు. 'ఇదే వైఖరిని న్యాయస్థానానికి కూడా తెలియజేశాము. 2018లో, సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ప్రవేశం అనుమతించబడింది' అని ఆయన అన్నారు. కేరళ హైకోర్టు పర్యవేక్షణలో జరుగుతున్న శబరిమల బంగారు నష్టం కేసు దర్యాప్తులో ప్రభుత్వం ఎటువంటి జోక్యం చేసుకోలేదని కూడా ఆయన అన్నారు. పార్టీలోని కొందరు కార్యకర్తలలో పార్లమెంటరీ ఆకాంక్షలు పెంచుకుంటున్న ధోరణి బయటపడిందని పినరయ్ విజయన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ మద్దతుతో ముగ్గురు సిపిఐ(ఎం) నాయకులు స్వతంత్రులుగా పోటీ చేయాలని నిర్ణయించుకోవడంపై విజయన్ స్పందించారు. కొందరు నాయకులలో ఒక అసాధారణ ధోరణి బయటపడుతున్న మాట నిజమేనని, గతంలో తమ పార్టీలో ఇలాంటి ధోరణులు సర్వసాధారణం కాదన్నారు. కాలక్రమేణా వచ్చిన మార్పుల వల్లే ఇది జరిగి ఉండవచ్చని విజయన్ పేర్కొన్నారు. అంబలప్పుజ, పయ్యనూరు, తాలిపరంబ నియోజకవర్గాల నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న జి. సుధాకరన్, వి. కుంజికృష్ణన్, టి.కె. గోవిందన్ వంటి నాయకులను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. సుధాకరన్, గోవిందన్ ఇద్దరూ సీనియర్ నాయకులని, ఇలాంటి పరిణామాలు జరగకూడదని ఆయన అన్నారు. వారు తమ సుదీర్ఘ రాజకీయ వారసత్వాన్ని నాశనం చేసుకున్నారని, తమ దృష్టిలో ఇది పార్టీని బలహీనపరిచేందుకు ప్రత్యర్థులతో చేతులు కలపడమేనని, అంటే ద్రోహం చేయడమేనన్నారు. సుధాకరన్‌ను ఎన్నడూ పక్కన పెట్టలేదని, వాస్తవానికి ఆయన పార్టీలో అత్యంత ఆమోదం పొందిన నాయకులలో ఒకరని విజయన్ అన్నారు. 75 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న నాయకులను పక్కన పెట్టాలని పార్టీ కాంగ్రెస్‌లో నిర్ణయం తీసుకుందని ఆయన గుర్తు చేశారు. ఆలప్పుజలో పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించినప్పటికీ, సుధాకరన్ ఈ నిబంధనను అంగీకరించడానికి ఇష్టపడలేదని విజయన్ అన్నారు. 'ఈ విషయం తలెత్తిన తర్వాత, నేను ఆయనను చాలాసార్లు సంప్రదించడానికి ప్రయత్నించాను, కానీ ఆయన స్పందించలేదు' అని తెలిపారు. బహుశా తాను మునుపటిలా పనిచేయలేనని సుధాకరన్ భావించి ఉండవచ్చని ఆయన అన్నారు. తనకు టికెట్ నిరాకరించారన్న టి.కె. గోవిందన్ ఆరోపణపై స్పందిస్తూ, అభ్యర్థుల ఎంపికలో పార్టీ ఒక నిర్దిష్టమైన ప్రక్రియను అనుసరిస్తుందని విజయన్ అన్నారు. తాలిపరంబ నుంచి సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి. గోవిందన్ భార్య పి.కె. శ్యామలను బరిలోకి దించడంపై తలెత్తిన వివాదంపై స్పందిస్తూ, ఆమె కూడా తనకంటూ ఒక ప్రత్యేక స్థానం ఉన్న సీనియర్ నాయకురాలని విజయన్ అన్నారు. 'తాలిపరంబ నియోజకవర్గానికి ఒక మహిళా అభ్యర్థిని పరిగణనలోకి తీసుకున్నప్పుడు, ఆమె పేరే మొదట వచ్చింది. అది ఆమె ఎం.వి. గోవిందన్ భార్య అయినందువల్ల కాదు. ఆమెకు తనకంటూ ఒక గుర్తింపు ఉంది' అని ఆయన అన్నారు. సంభావ్య వివాదాలు అర్హులైన అభ్యర్థులకు అవకాశాలను దూరం చేయకూడదని విజయన్ అన్నారు. మాజీ ఆరోగ్య శాఖ మంత్రి కె.కె. శైలజను మట్టనూర్ నుండి పెరవూర్‌కు మార్చడంపై విజయన్ మాట్లాడుతూ మట్టనూర్‌ను నిలబెట్టుకుంటామనే నమ్మకంతో పార్టీ ఉందని, అందుకే ఆమెను మరో నియోజకవర్గంలో నియమించామని అన్నారు. ఆమెకున్న ప్రజాదరణ, కాబోయే ముఖ్యమంత్రిగా ఆమెకున్న ప్రచారం పార్టీపై ప్రభావం చూపుతాయా అని అడగ్గా, అలాంటి నిర్ణయాలు ఎన్నికల తర్వాతే తీసుకుంటామని విజయన్ అన్నారు. 'ఫలితాలు వచ్చిన తర్వాతే సిపిఐ(ఎం) ముఖ్యమంత్రిని నిర్ణయిస్తుంది. ఇప్పుడు అలాంటి ప్రశ్నలు తలెత్తవు అన్నారు. ఎల్‌డిఎఫ్ ఓడిపోతే ప్రతిపక్ష నాయకుడి పాత్ర చేపడతారా అని అడగ్గా, అలాంటి నిర్ణయాలన్నీ సరైన సమయంలో తీసుకుంటామని విజయన్ అన్నారు. జాతీయ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమానికి తాను హాజరు కాకపోవడంపై తలెత్తిన వివాదంపై విజయన్ స్పందిస్తూ, రహదారి అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని అన్నారు. ఈ కార్యక్రమాన్ని మొదట జనవరిలో నిర్వహించాలని ప్రణాళిక వేసినప్పటికీ, ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో దానిని వాయిదా వేశారని, అయితే తనకు ముందుగా ఉన్న ఇతర కార్యక్రమాల వల్ల హాజరు కాలేనని ఆయన తెలియజేశారని చెప్పారు. 'ఆ తర్వాతే పిడబ్ల్యుడి మంత్రిని ఆహ్వానించకపోవడంపై వివాదం తలెత్తింది. దీని చుట్టూ ఉన్న రాజకీయ ఆరోపణలపై నేను ఇప్పుడు స్పందించదలచుకోలేదని ఆయన అన్నారు. తన కుమార్తె వీణా విజయన్ సంస్థకు సంబంధించిన అవినీతి ఆరోపణలపై విజయన్ మాట్లాడుతూ అటువంటి ఆరోపణలు రాజకీయ ప్రేరేపితమైనవని అన్నారు. 'ఇవి నన్ను లక్ష్యంగా చేసుకునే ప్రయత్నాలు. గత ఎన్నికల్లో కూడా ఇలాంటి ఆరోపణలే వచ్చాయి. నేను వాటిని తీవ్రంగా పరిగణించను,' అని ఆయన అన్నారు. కేరళలో బిజెపి ఎదుగుదలపై విజయన్ మాట్లాడుతూ తిరువనంతపురం కార్పొరేషన్‌లో పార్టీ విజయాన్ని ఒక వాస్తవంగా అంగీకరించారు. తాము దీనిని ఊహించలేదని, కానీ ఇది మమ్మల్ని అప్రమత్తం చేసింది, దానికి అనుగుణంగానే ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

# అధికార మార్పునకు కేరళ ప్రజలు సిద్ధం

**ఎన్నికల వేళ రాహుల్ గాంధీ**




**న్యూఢిల్లీ :** మరికొద్ది రోజుల్లో కేరళలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. కేరళ ప్రజలు అధికార మార్పునకు సిద్ధంగా ఉన్నారన్నారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో యుడిఎఫ్ (కాంగ్రెస్ కూటమి) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. 'యుడిఎఫ్ కూటమి తరఫున ఎన్నికల్లో పోటీ చేసే ప్రతి అభ్యర్థి కేరళం ప్రజల గొంతుకను, ఆకాంక్షలను, నమ్మకాన్ని ప్రతిబింబిస్తున్నారు. ఈ కూటమి అనుభవజ్ఞులైన నాయకులు, మార్పు తేవాలనే యువకుల కలయిక. నాకు కేరళ ఇల్లు. కేరళ ప్రజలు కుటుంబ సభ్యులు. కేరళ ప్రజలు నాపై చూపిన ప్రేమ, ఆప్యాయతలకు వారికి నేను ఎంతో రుణపడి ఉంటాను. నేను ఎల్లప్పుడూ ప్రజల భాగస్వామిగా ఉంటాను. కేరళ నుంచి వస్తున్న సందేశం స్పష్టం. రాబోయే శాసనసభ ఎన్నికల్లో ప్రజలు మార్పునకు సిద్ధంగా ఉన్నారు. ప్రజల మాట వినే, వారిని అర్థం చేసుకునే, నిజాయితీతో పనిచేసే ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు. రాబోయే యుడిఎఫ్ ప్రభుత్వంతో కలిసి ఈ అందమైన రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తును నిర్మించడానికి నేను చేయగలిగినదంతా చేస్తాను. కేరళం గెలుస్తుంది అందుకు యుడిఎఫ్ నాయకత్వం వహిస్తుంది' అని రాహుల్ పేర్కొన్నారు.

# గ్యాస్ సంక్షోభంపై కేంద్రమంత్రికి సిద్ధరామయ్య లేఖ

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్‌లో తీవ్రంగా గ్యాస్ సంక్షోభం నెలకొంది. గ్యాస్ కొరత వల్ల బెంగళూరులో వ్యాపారాలు మూతపడ్డాయి. దీంతో వాణిజ్య గ్యాస్ కొరత తీర్చాలని కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య శుక్రవారం కేంద్ర పెట్రోలియం శాఖామంత్రికి లేఖ రాశారు. బెంగళూరులో నెలకొన్న గ్యాస్ కొరత ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని, గ్యాస్ కొరతను తీర్చడానికి హర్దీప్ సింగ్ పూరి తక్షణమే జోక్యం చేసుకోవాలని సిద్ధరామయ్య తన లేఖలో పేర్కొన్నారు. ప్రాధాన్యత, నిత్యావసర రంగాలకు సరఫరాను నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. రోజుకు 50 వేల సిలిండర్ల డిమాండ్ ఉండగా... సరఫరా కేవలం వెయ్యి సిలిండర్లకే పరిమితం కావడంతో పరిస్థితి చాలా దారుణంగా ఉంది. దీనివల్ల వ్యాపారాలు, హోటళ్లు మూతపడుతున్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా గ్యాస్‌ను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సిద్ధరామయ్య కేంద్ర మంత్రిని కోరారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

# పెట్రోలు ధర రూ.2.35 పెంపు



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా యుద్ధం వేళ మోదీ సర్కారు పెట్రోలు ధరలు పెంచేసింది. ప్రీమియం పెట్రోలు ధర లీటర్‌కు రూ.2.35 పెరిగింది. దేశవ్యాప్తంగా పెట్రోలు ధర పెంచినట్లు హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ప్రకటించింది. సాధారణ పెట్రోల్ ధరలు యథాతథంగా ఉన్నాయి. బీపీసీఎల్ స్పీడ్, ఐవోసీఎల్ ఎక్స్‌పీ95 ప్రీమియం పెట్రోల్ ధరలకు కూడా ఈ పెంపు వర్తిస్తుంది. ప్రాంతాన్ని బట్టి లీటరుకు రూ.2.09 నుంచి రూ.2.35 వరకూ పెట్రోలియం సంస్థలు ప్రీమియం పెట్రోల్ ధర పెంచాయి. సవరించిన ధరలు శుక్రవారం నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఇంధన మార్కెట్లపై ప్రభావం పడుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చమురు కంపెనీలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలో మూడు రకాలుగా పెట్రోల్ లభిస్తోంది. ఒకటి సాధారణ పెట్రోల్, మరొకటి ప్రీమియం. ఇది కాకుండా హై ఆక్టేన్ ప్రీమియం అనే మూడో రకం పెట్రోల్ కూడా ఉంది. మెరుగైన ఇంజిన్ పనితీరు, మైలేజ్ కోసం వాహనాల్లో ప్రీమియం పెట్రోల్ ఉపయోగిస్తారు. ప్రస్తుత ధరల పెంపు హైఆక్టేన్, ప్రీమియం పెట్రోల్ వాడే వినియోగదారులను ప్రభావితం చేస్తుంది. బీపీసీఎల్ స్పీడ్, హెచ్‌పీసీఎల్ పవర్, ఐఓసీఎల్ ఎక్స్‌పీ95 పేర్లతో ఈ ప్రీమియం పెట్రోల్ విక్రయిస్తాయి. పెట్రోల్ గ్రేడ్‌ను దాని ఆక్టేన్ విలువ ఆధారంగా వర్గీకరిస్తారు. భారత్‌లో సాధారణ పెట్రోల్ ఆక్టేన్ విలువ 87 కాగా, అదే ప్రీమియం పెట్రోల్ ఆక్టేన్ విలువ 91గా ఉంది. హై ఆక్టేన్ కలిగిన ఇంధనం ఎక్కువ కంప్రెషన్ రేషియో కలిగి ఉంటుంది. దీని ఫలితంగా వాహనం ఇంజిన్‌ను స్టార్ట్ చేసే సమయంలో ఎక్కువ ఇంధనం తీసుకోదు. కార్బన్‌పై తక్కువ ప్రభావం చూపుతుంది. శక్తిమంతమైన ఇంజిన్లు కలిగిన స్పోర్ట్స్ కార్లు, బైక్‌లు, సూపర్ కార్లు మొదలైన వాటికి ప్రీమియం పెట్రోల్ వినియోగిస్తారు.

# గల్ఫ్ దేశాల గగనతలంలోకి వెళ్లొద్దు

**విమానయాన సంస్థలకు డిజిసిఎ ఆదేశం**




**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా యుద్ధం తీవ్రమవుతున్న నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్ సహా 11 దేశాల గగనతలంలోకి వెళ్లొద్దని భారత విమానయాన సంస్థలకు విమానయాన నియంత్రణ సంస్థడిజిసిఎకఠినమైన సూచనలు జారీ చేసింది. ఇరాన్ సైనిక, ఇంధన కేంద్రాలపై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు చేస్తుండటంతో ఆ ప్రాంతంలోని గగనతలం తీవ్ర ప్రమాదకర స్థితిలో ఉందని వచ్చిన నివేదికల తర్వాత ఈ చర్య తీసుకున్నారు. ఇరాన్, ఇజ్రాయిల్, లెబనాన్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్, ఒమన్, ఇరాక్, జోర్డాన్, కువైట్, ఖతార్ దేశాల గగనతలాలను అధిక ప్రమాదంగా ఉన్న జాబితాలో చేర్చారు. ఈ దేశాల మీదుగా అన్ని ఎత్తులలోనూ విమాన ప్రయాణాలు నివారించాలని ఆదేశించింది. ఒకవేళ ఒమన్, సౌదీ అరేబియా మీదుగా విమానాలు నడపాల్సి వస్తే... 32 వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో మాత్రమే ప్రయాణించాలనిడిజిసిఎ స్పష్టం చేసింది. అత్యాధునిక క్షిపణులు, డ్రోన్‌ల ఉనికి పౌర విమానాలకు ముప్పు కలిగిస్తుందని డిజిసిఎహెచ్చరించింది. విమానాలను తప్పుగా గుర్తించే లేదా అవి సైనిక కార్యకలాపాలలో పాలుపంచుకునే ప్రమాదం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఎయిరిండియా, ఇండిగో, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ వంటి విమానయాన సంస్థలు పశ్చిమాసియా దేశాలకు తమ సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశాయి. యూరప్, అమెరికా వెళ్లే విమానాలను ఎక్కువ దూరాలున్న సురక్షిత మార్గాలకు మళ్లిస్తారు. దీనివల్ల ప్రయాణ సమయాలు పెరుగుతాయి. ప్రస్తుత మార్గదర్శకాలు మార్చి 28 వరకు అమలులో ఉంటాయని, పరిస్థితిని అంచనా వేసిన తర్వాత వాటిని సవరిస్తామనిడిజిసిఎతెలిపింది. సిరియా, యెమెన్ గగనతలాన్ని నివారించాలన్న మునుపటి ఆదేశం ఇప్పటికీ అమలులో ఉంది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశం పరిస్థితిని సమీక్షించింది. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, టికెట్ల ధరలను అధికంగా పెంచకుండా చూసుకోవాలని విమానయాన సంస్థలకు సూచించింది. పశ్చిమాసియాలో ఉన్న భారతీయుల భద్రతను నిర్ధారించడానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో కలిసి కేంద్ర ప్రభుత్వం కషి చేస్తోందని తెలిపింది.

# 32 మందితో బెంగాల్‌లో లెఫ్ట్ ఫ్రంట్ రెండో జాబితా



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం లెఫ్ట్ ఫ్రంట్ 32 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. ఈ జాబితాలో సిపిఐ నుంచి ముగ్గురు, సిపిఎం నుంచి ఆఫ్రీన్ బేగం (బల్లీగంజ్), మణిరుల్ ఇస్లాం (మెటియాబ్రూజ్), హిమంశు గిరి (ఖేజురి), సమరేంద్ర నాథ్ నైయా (నంది గ్రామ్) సహా 28 మంది, ఆర్ఎస్‌పీ నుంచి ఒకరు ఉన్నారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం మాట్లాడుతూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై న్యాయ విచారణ చేపట్టడం ప్రజల తొలి విజయంగా పేర్కొన్నారు. పోలింగ్ ముందుగానే అర్హులైన ప్రతీ ఓటరు పేరు జాబితాలో నమోదయ్యే వరకూ వామపక్ష నాయకులు విశ్రమించబోరని తెలిపారు. 294 అసెంబ్లీ స్థానాలు ఉన్న బెంగాల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే 192 మంది అభ్యర్థులతో లెఫ్ట్ ఫ్రంట్ తొలి జాబితా విడుదల చేసింది.

# జ్యోతిష్యుడి ముసుగులో అత్యాచారాలు, కిడ్నాప్‌లు



**ముంబయి:** మహారాష్ట్రలో ఓ జ్యోతిష్యుడి బాగోతం బట్టబయలైంది. రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ప్రముఖుల భవిష్యత్తు చెబుతానని నమ్మిస్తూ నాసిక్‌కు చెందిన జ్యోతిష్యుడు చేసిన దుశ్చర్యలు వెలుగులోకి వచ్చాయి. తనను తాను కెప్టెన్ అని పిలుచుకునే అశోక్ ఖరత్‌ను నిన్న పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల దర్యాప్తులో ఒక్కొక్కటిగా ఆధారాలు బయటపడుతున్నాయి. అత్యాచారం, బ్లాక్‌మెయిలింగ్ ఆరోపణలపై అరెస్టు అయిన ఖరత్ వద్ద ఏకంగా 58 వీడియో క్లిప్‌లు, 150 కోట్ల రూపాయలకు పైగా విలువైన ఆస్తులు లభ్యమయ్యాయి. వాస్తవానికి... నాసిక్ క్రైమ్ బ్రాంచ్ యూనిట్1 18వ తేదీ తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో అశోక్ ఖరత్‌ను అరెస్టు చేసింది. సర్కార్వాడ పోలీస్ స్టేషన్‌లో 35 ఏళ్ల మహిళపై అత్యాచారం కేసు నమోదైంది. కేసు తీవ్రత దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బందానికి అప్పగించింది. ఈ బందానికి మహిళా ఐపిఎస్ అధికారి తేజస్విని సత్పూటే నేతత్వం వహిస్తున్నారు. సిట్ బందం నిందితుడిని సుమారు రెండు గంటల పాటు విచారించింది. దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, వాస్తవాలు వెలుగులోకి వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని సిట్ వెల్లడించింది. ఈ కేసులో అత్యంత దిగ్భ్రాంతికరమైన సాక్ష్యం 58 వీడియో క్లిప్పులు అని చెబుతున్నారు. దాడుల సమయంలో వివిధ డిజిటల్ పరికరాల నుంచి ఈ వీడియోలను సిట్ స్వాధీనం చేసుకుంది. ఈ వీడియోలలో కొన్నింటిలో మహిళలు, ప్రముఖ వ్యక్తులు ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పోలీసులు మాత్రం దీనిని ధవీకరించలేదు. ఈ వీడియోలపై ఫోరెన్సిక్ దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఆరోపణలు నిజమని రుజువైతే, ఈ కేసు కేవలం లైంగిక దోపిడీకే పరిమితం కాకుండా... బ్లాక్‌మెయిలింగ్ దందాపై కూడా చర్యలు తీసుకుంటామని సిట్ చెబుతోంది. తాజాగా మరో కేసు వెలుగులోకి వచ్చింది. తన అభ్యంతరకరమైన ఫొటోలు అతడి వద్ద ఉన్నాయని, వాటిని వైరల్ చేస్తామని బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు షిర్డీకి చెందిన ఒక మహిళ ఫిర్యాదు చేసింది. ఈ కేసులో నిందితుడి కార్యాలయంలో పనిచేసే నీరజ్ జాదవ్ పేరు బయటపడింది. కొన్ని సంవత్సరాల క్రితం తాను ఖరత్ కార్యాలయానికి వెళ్లినప్పుడు అక్కడే ఆ ఫొటోలు తీశారని ఆ మహిళ ఆరోపిస్తోంది. పోలీసుల దాడిలో ఖరత్ ఇంటి నుంచి పిస్టల్, కాట్రిడ్జ్‌లు, సుమారు రూ.6.5 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు.

# నాలుగు రోజుల్లో సీట్ల సర్దుబాటు: పళనిస్వామి



**చెన్నై :** ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం బిజెపి, ఇతర ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలతో సీట్ల పంపకాన్నిఎఐఎడిఎంకె ఖరారు చేస్తుందని, వారికి కేటాయించిన నియోజకవర్గాల వివరాలను నాలుగు రోజుల్లో అధికారికంగా ప్రకటిస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి శుక్రవారం తెలిపారు. చర్చల్లో అడ్డంకులు ఉన్నాయన్న వార్తలను ఖండించిన పళనిస్వామి... గురువారం రాత్రి కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆయన నివాసంలో కలిశారు. ఈ చర్చలు సాఫీగా సాగాయని, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. బిజెపి, ఎఎంఎంకె, పిఎంకె వంటి పార్టీలను భాగస్వాములుగా కలిగిన బహుళపార్టీ కూటమి అయిన 'జాతీయ ప్రజాస్వామ్య కూటమి'కిఎఐఎడిఎంకె నాయకత్వం వహిస్తోంది. 'నాలుగు రోజుల్లో మీకు అంతా తెలిసిపోతుంది. మేము కేటాయించిన నియోజకవర్గాలను ఖరారు చేసి ప్రకటిస్తాము. ఇక్కడ (మా కూటమిలో) చర్చలు డిఎంకెకూటమిలో ఉన్నట్లుగా ఉండవు. ఇక్కడ చర్చలు సాఫీగా, పరిపూర్ణంగా సాగుతాయి. మా మిత్రపక్షాలకు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్న సీట్లనే కేటాయించడమే మా లక్ష్యం' అని ముఖ్యమంత్రి చెన్నైకి బయలుదేరే ముందు జాతీయ రాజధానిలో విలేకరులతో మాట్లాడుతూ అన్నారు. చర్చలను ముందుకు తీసుకెళ్లడానికి బిజెపి తమిళనాడు వ్యవహారాల ఇంఛార్జ్ పీయూశ్ గోయల్ శనివారం రాష్ట్రానికి వస్తారని ఆయన తెలిపారు. గురువారం రాత్రి షాతో జరిగిన తన సమావేశం అత్యంత స్నేహపూర్వకంగా సాగిందని, తమిళనాడులోని రాజకీయ పరిస్థితులపై తాము చర్చించుకున్నామని ఎఐఎడి ఎంకె నేత అన్నారు. విజయ్ నేతత్వంలోని టీవీకే పార్టీతో పొత్తు చర్చలు జరుగుతున్నాయన్న వార్తలను పళనిస్వామి కేవలం మీడియా ఊహాగానాలుగా కొట్టిపారేశారు.ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శిగా, నేను టివితో ఎటువంటి చర్చలు జరపలేదని అనేక సార్లు చెబుతూనే ఉన్నాను. అయినా మీరు ఆ విషయాన్ని తరచూ ఎందుకు లేవనెత్తుతున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. ఎన్‌డిఎ కూటమిలో మరే ఇతర పార్టీ అయినా చేరే అవకాశం ఉందా అని అడగగా, కూటమి ఇప్పటికే ఖరారైపోయిందని, అందువల్ల అలాంటి అవకాశం ఏదీ లేదని పళనిస్వామి బదులిచ్చారు. మరో ప్రశ్నకు సమాధానమిస్తూ, తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఒక వారంలో విడుదలవుతుందని పేర్కొన్నారు.

# కేంద్ర మంత్రికి బెదిరింపులు

**న్యూఢిల్లీ :** కేంద్ర మంత్రి, రాష్ట్రీయ లోక్‌దళ్ అధినేత జయంత్ చౌదరికి శుక్రవారం గుర్తుతెలియని నెంబర్ నుంచి బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాలర్‌ను పశ్చిమబెంగాల్‌లోని ముర్షిదాబాద్‌కు చెందిన ఇస్మాయిల్‌గా గుర్తించారు. మంత్రి అధికారిక పర్యటన షెడ్యూల్ తెలుసుకున్న ఇస్మాయిల్... చంపుతానని బెదిరించినట్టు పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి...దర్యాప్తు చేపట్టారు. ఈ వ్యవహారంపై పశ్చిమబెంగాల్ పోలీసులు కూడా విచారణ ప్రారంభించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ సహాయ మంత్రి (ఇండిపెండెంట్ చార్జ్)గా జయంత్ చౌదరి ఉన్నారు. ప్రాంతీయ పార్టీ అయిన ఆర్ఎల్‌డీ పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో బలంగా ఉంది. 2024 వరకూ అఖిలేశ్ యాదవ్ సమాజ్‌వాదీ పార్టీతో ఆర్ఎల్‌డీ పొత్తు పెట్టుకుంది. చౌదరి తాత, మాజీ ప్రధానమంత్రి చరణ్ సింగ్‌కు భారత రత్న ఇవ్వాలని మోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గత లోక్‌సభ ఎన్నికలకు ముందు బిజెపితో ఆర్ఎల్‌డీ చేతులు కలిపింది. పార్లమెంటు ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధించడంతో చౌదరి కేంద్ర మంత్రి అయ్యారు. ప్రస్తుతం ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు.

# నేను రాజీ పడ్డానంటారేమో!

**ఇసిల నియామకాల కేసు నుంచి తప్పుకొన్న సిజెఐ**



**న్యూఢిల్లీ :** వ్యక్తిగత ప్రయోజనాల కోసం వృత్తిపరమైన బాధ్యతలతో రాజీ పడినట్లు తనను కొందరు నిందిస్తారని సిజెఐ సూర్యకాంత్ అనుమానం వ్యక్తంచేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్లు (ఇసిల) నియామకాల కేసు విచారణ నుంచి తప్పుకున్నారు. ఈ వ్యవహారం సిజెఐ నేతృత్వ జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీతో కూడిన త్రిసభ్య ధర్మాసనం వద్ద శుక్రవారం విచారణకు వచ్చింది. ఓ పిటిషనర్ తరఫున న్యాయవాది ప్రశాంత్ భూషణ్ హాజరయ్యారు. ఇది నేను విచారించాలా అని సిజెఐ ప్రశ్నించగా నేను అదే ఆలోచిస్తున్నానంటూ ప్రశాంత్ భూషణ్ బదులిచ్చారు. 'స్వప్రయోజనాల కోసమే వృత్తి బాధ్యతలతో రాజీ పడ్డానని నన్ను నిందిస్తారు' అని సిజెఐ చెప్పగా... మిమ్మల్ని అనేది ఎవరంటూ ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యానించారు. దీనికి సిజెఐ స్పందిస్తూ 'ఏమో నాకు అలా అనిపిస్తోంద'ని వ్యాఖ్యానించారు. 'నన్ను అడిగితే ఈ వ్యవహారాన్ని మీరు విచారించకపోవడమే మంచిది. దీనిని మీ ప్రమేయం లేని ధర్మాసనం విచారిస్తేనే సబబుగా ఉంటుంది' అని ప్రశాంత్ భూషణ్ ఆయనతో అన్నారు. దీనికి... సిజెఐగా బాధ్యతలు చేపట్టే జాబితాలో లేని జడ్జికి ఈ కేసు అప్పగిస్తే... ఎవరూ ఏమీ అనలేరని సిజెఐ బదులిచ్చారు. ఈ వ్యవహారాన్ని అత్యవసరంగా విచారించాల్సిందేనని ప్రశాంత్ భూషణ్ చెప్పగా, ఏప్రిల్ 6 లేక 7వ తేదీకి లిస్ట్ చేద్దామని సిజెఐ అన్నారు. ప్రశాంత్ భూషణ్ అభ్యంతరం వ్యక్తంచేస్తూ... అనేక తీర్పులతో కూడుకున్న అంశం కాబట్టి విచారణకు సమయం పడుతుందని, సాధ్యమైనంత త్వరగా విచారణకు అనుమతివ్వాలని కోరారు. వాదనల అనంతరం సిజెఐ ఈ వ్యవహారాన్ని ఏప్రిల్ 7వ తేదీన విచారించాలని ఆదేశించారు.

# తమిళ్‌నాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**ఏడుగురి దుర్మరణం**

**చెన్నై:** తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డుపై వెళుతున్న ఇతర వాహనాలను ఢీకొట్టడంతో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కొంతమంది తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సేలం జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఓ ఆర్టీసీ బస్సు కోయంబత్తూరు నుంచి సేలం బయలు దేరింది. బస్సు ఉత్తమ శోలపురం దగ్గర జాతీయ రహదారిపై వెళుతుండగా అదుపుతప్పింది. డివైడర్‌ను దాటుకుని అవతలి వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ రోడ్డుపై వెళుతున్న ఓ బైక్‌తో పాటు టెంపోను ఢీకొట్టింది. బైక్, టెంపో నుజ్జునుజ్జయ్యాయి. బైకుపై ప్రయాణిస్తున్న ఓ మహిళతో పాటు ఆమె కూతురు అక్కడికక్కడే మరణించారు. టెంపోలో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో 11 నెలల చిన్నారి కూడా ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీమ్ సభ్యులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డవారిని చికిత్స కోసం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ ఘటనపై సీనియర్ పోలీసు అధికారి ఒకరు మాట్లాడుతూ 'ప్రమాదానికి సంబంధించి పూర్తి దర్యాప్తు జరుగుతోంది. దర్యాప్తు ఆధారంగా చర్యలు తీసుకుంటాం' అని అన్నారు.

# డిఎంకెలోకి నటి రంజనా నాచ్చియార్

**చెన్నై:** తమిళగ వెట్రి కళగం నాయకుడు విజయ్ వ్యక్తిగత జీవితంపై విమర్శలు చేసి... ఆ పార్టీ నుండి వైదొలగిన ప్రముఖ నటి రంజనా నాచ్చియార్ డిఎంకెలో చేరారు. అన్నా అరివాలయంలో డిఎం కెఅధ్యక్షుడు ఎంకె స్టాలిన్ సమక్షంలో ఆ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. రంజనా నాచ్చియార్ టీవీ సీరియల్స్‌లో, సినిమాల్లో నటిస్తూనే సామాజిక సేవకురాలిగా గుర్తింపు పొందారు. 2023లో పోరూరు గెరుగంబాక్కంలో బస్సులో వేలాడుతూ వెళుతున్న విద్యార్థుల చెంపచెళ్లుమనిపించి కిందకు దింపారు. అదే సమయంలో బస్ డ్రైవర్, కండక్టర్లను దూషించి అరెస్టయ్యారు. జైలు నుండి విడుదలైన తర్వాత రంజనా నాచ్చియార్ ప్రజలకు బాగా పరిచయమయ్యారు. ఆ తర్వాత బిజెపిలో చేరి ఆ పార్టీ కళా సాంస్కతిక విభాగం కార్యదర్శిగా కొంత కాలం పనిచేశారు. ఆ తర్వాత త్రిభాషా విధానాన్ని వ్యతిరేకిస్తూ బిజెపికి గుడ్‌బై చెప్పారు. విజయ్ నాయకత్వంలోని టివికెలో చేరారు. ఇటీవల విజయ్ భార్య సంగీత విడాకులు కోరుతూ కోర్టును ఆశ్రయించిన సందర్భంగా ఆయన పార్టీ నిర్వాహకుల సమావేశంలో చేసిన విమర్శలపై రంజన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, కేఎన్ పాల్గొన్నారు.

# నిపుణుల కమిటీలో జస్టిస్ ఇందు మల్హోత్రా, వేణుగోపాల్




**న్యూఢిల్లీ:** ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య ప్రణాళికలో లీగల్ అధ్యయనంపై మార్గనిర్దేశం చేసే కమిటీలో మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందు మల్హోత్రా, సీనియర్ న్యాయవాది వేణుగోపాల్ చేరినట్లు కేంద్రం తెలిపింది. 8 నుండి ఉన్నత తరగతులకు లీగల్ స్టడీస్ కోసం నిపుణుల కమిటీలో చేరేందుకు వారిరువురు సుముఖత వ్యక్తం చేశారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. ఈ తరగతుల పాఠ్య ప్రణాళికలను ఖరారు చేయడానికి ఉద్దేశించిన నిపుణుల కమిటీ, జాతీయ న్యాయ అకాడమీ డైరెక్టర్ హోదాలో ఉన్న సుప్రీంకోర్టు మాజీ జడ్జి అనిరుద్ధ బోస్‌తో కలిసి పనిచేస్తుందని తుషార్ మెహతా మౌఖికంగా తెలిపారు. 8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో ఎన్‌సిఇఆర్‌టి 'న్యాయ వ్యవస్థలో అవినీతి' అనే అధ్యయనాన్ని ప్రచురించడాన్ని సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు మార్చి 11న జారీ చేసిన ఉత్తర్వుల నేపథ్యంలో ఈ పరిణామం జరిగింది.

# దురుద్దేశాలతో యుద్ధం ట్రంప్‌కు ఎదురుదెబ్బలు

ఇజ్రాయెల్ నెతన్యాహు, అమెరికా డొనాల్డ్ ట్రంప్ దుష్ట బుద్ధితో, చట్టవిరుద్ధంగా ఫిబ్రవరి 28న ఇరాన్‌పై యుద్ధం ప్రారంభించి ఆసియాలో వినాశం, విధ్వంసం, మరణాలు కలుగజేస్తున్నారు. అంతేకాదు యావత్ ప్రపంచాన్ని ఆర్థిక కల్లోలంలో ముంచెత్తారు. 21 రోజులు గడచిపోయినా విధ్వంసం పెరుగుతున్నదే గానీ ఉద్రిక్తోపశమనం కనుచూపు మేరలో కనిపించటం లేదు. అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు, అమెరికాలోని యూదు లాబీ ఒత్తిడికి తలొగ్గి ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై యుద్ధానికి దిగారని, అంతేతప్ప సరైన హేతువు లేదని అమెరికా అడ్మినిస్ట్రేషన్‌లో అసంతృప్తి మొదలైంది. జాతీయ కౌంటర్ టెర్రరిజం సెంటర్ డైరెక్టర్ జోయి కెంట్ మంగళవారం రాజీనామా చేశారు. ఇదిలా ఉండగా, ట్రంప్ స్నేహితురాలు, నేషనల్ ఇంటెలిజెన్స్, డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ ఇరాన్‌తో యుద్ధానికి ట్రంప్ సమర్ధనలతో విభేదించారు. సెనేట్ ఇంటెలిజెన్స్ కమిటీ ముందు బుధవారం వాంజ్మూలమిస్తూ, ఇరాన్ నుండి అమెరికాకు ముప్పు ముంచుకొస్తుందన్న వాదనకు అర్థం లేదన్నారు. ట్రంప్ ఆదేశంపై అమెరికా వైమానిక దళం 2025 జూన్‌లో ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్ అణు వసతులపై దాడి చేశా యి. ఇరాన్ అణు కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు ట్రంప్ చెప్పారు. ఇప్పుడేమో ఇరాన్‌పై దాడికి సాకుగా, ఇరాన్ అణు బాంబు తయారు చేయటానికి వారాల దూరంలో ఉందని చెబుతున్నారు. ఆమె రాజీనామా అనావార్యం కావచ్చు. ఇరాన్ అణు కార్యక్రమంపై ఒప్పందం సంతకాల దశకు చేరుకోగా అమెరికా, ఇజ్రాయెల్ ఆకస్మిక యుద్ధానికి పాల్పడటంలోనే వాటి దురుద్దేశం స్పష్టం. సమర్థించుకోలేక కుంటిసాకులు చెబుతున్నారు..

ట్రంప్ అమెరికా యుద్ధాలను వ్యతిరేకిస్తూ రెండు పర్యాయాలూ అధ్యక్షుడిగా ఎన్నికైనారు. రెండవసారి అధ్యక్షునిగా బాధ్యతలు చేబట్టాక తాను 7 యుద్ధాలు నివారించానని, అందువల్ల ప్రపంచ శాంతి నోబెల్ తనకు రావాలని లజ్జారహితంగా బహిరంగంగా ప్రకటించారు. ఆ బహుమతి రానందుకు నోబెల్ కమిటీని దూషించారు కూడా. అటువంటి వ్యక్తి స్వయంగా ఇరాన్‌పై ఎందుకు యుద్ధానికి దిగినట్లు? నెతన్యాహు పెడదారి పట్టిస్తే అనుసరించే బలహీనుడా ట్రంప్. అమెరికా వ్యతిరేక ప్రభుత్వాలను మార్చడం ట్రంప్ 'మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్' ప్రాజెక్టులో భాగం. ఎన్నికల్లో పలు లాటిన్ అమెరికా వామపక్ష ప్రభుత్వాలను కూల్చారు. వెనిజులా అధ్యక్షుడు మదురోను బందీగా అమెరికా పట్టుకెళ్లాడు. క్యూబాకు ఆయిల్ సరఫరాను దిగ్బంధం చేసి తాను క్యూబాను ఏమనుకుంటే అది చేయగలనని దురహంకారం ప్రదర్శిస్తున్నాడు. కొలంబియా, కెనడా, మెక్సికోలను, ఆర్కిటిక్‌లోని గ్రీన్‌ల్యాండ్ దీవిని అమెరికాలో కలిపివేసుకుంటానంటున్నాడు. ఈ సామ్రాజ్యవాద విస్తరణకాంక్షతో సహకరించేందుకు యూరప్ ముందుకు రాకపోవడం గమనించదగ్గ పరిణామం.

హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన కారణంగా ముడిచమురు, ఇతర సరుకుల రవాణా నిలిచిపోయి ముఖ్యంగా ఆసియాదేశాల ఆర్థికవ్యవస్థలు సంకటంలో ఉన్నందున, ఆ జలసంధి దిగ్బంధాన్ని తొలగించేందుకు పర్షియన్ గల్ఫ్‌కు యుద్ధనౌకలను పంపాలని ట్రంప్ చేసిన విజ్ఞప్తిని నాటో మిత్ర రాజ్యాలు నిరాకరించాయి; జపాన్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా ముందుకు రాలేదు. ప్రత్యేకించి చైనా సహాయ నిరాకరణ చేసింది. దాంతో తన భంగపాటును కప్పిపుచ్చుకునేందుకై ట్రంప్, "మాకు ఎవరి సహాయం అవసరం లేదు" అన్నారు. యుద్ధంలో కలిసి రాకుండా నాటో రాజ్యాలు తప్పు చేశాయన్నారు. వైమానిక దళాలనుంచి బాంబుదాడులతో ఇరాన్ నాయకత్వాన్ని దాదాపుగా నిర్మూలించామని, దాని మిలిటరీ వసతులు, ఆయుధాల తయారీ సామర్థ్యాన్ని ధ్వంసం చేశామని ట్రంప్ గర్వంతో ప్రకటించారు. అది పాక్షిక సత్యం. అమెరికా స్టీల్త్ ఫైటర్ ఎఫ్.35ను ఇరాన్ గురువారం దెబ్బతీసింది. అది కువైట్‌లో అత్యవసరంగా నేలకు దిగింది. భారీగా నష్టం వాటిల్లింది. అమెరికా మొత్తం 16 విమానాలు కోల్పోయింది. గాలిలో ఇంధనం నింపే విమానాలు కూడా వాటిలో ఉన్నాయి. గురువారం నాటికి అమెరికా ఈ యుద్ధంలో 12 బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలు, యుద్ధ సామాగ్రి కోల్పోయింది. 18 బిలియన్ డాలర్ల కేటాయింపుకై ట్రంప్ కాంగ్రెస్ అనుమతి కోరారు.

ఇదిలా ఉండగా, ఇరాన్ ఖర్గ్ దీవిలోని ఆయిల్ నిక్షేపాలపై అమెరికా విమానాలు బాంబులు వేయగా, ఇరాన్‌లోని అతిపెద్ద ఎల్ఎన్‌జి నిక్షేపమున్న వసతి దక్షిణ పార్స్‌పై ఇజ్రాయెల్ దాడి పెద్ద కల్లోలం సృష్టించింది. ప్రపంచం మాంద్యంలో పడే ప్రమాదం గూర్చి హెచ్చరికలు వచ్చాయి. దీంతో దిమ్మతిరిగిన ట్రంప్ ఇజ్రాయెల్ తమకు తెలియకుండా దక్షిణ పార్స్‌పై దాడి చేసిందని, మరోమారు ఆ పని చేయబోదని ఒకరకంగా క్షమాపణలాంటి ప్రకటన చేశారు. మరోవైపున, అమెరికాలో ధరలు పెరిగిపోయి కల్లోలంగా ఉంది. అయినా రిపబ్లికన్‌లలో 85 శాతం ట్రంప్‌తోనే ఉన్నారు. మధ్యంతర ఎన్నికల భయం రిపబ్లికన్‌లను పీడిస్తోంది. ట్రంప్ అర్థరహితమైన యుద్ధోన్మాదాన్ని విడనాడి ఇరాన్‌తో చర్చలకు రాకపోతే ప్రపంచం ముందు దోషిగా నిలబడాల్సి వస్తుంది. ఈలోపు అమెరికా సైనిక స్థావరాలతో సురక్షితంగా ఉన్నామని భావించి అమెరికాకు అణిగిమణిగి ఉంటున్న గల్ఫ్‌లోని అమెరికా అనుకూల దేశాలు ఇరాన్ క్షిపణి దాడులతో అపారమైన నష్టం పొందక తప్పదు. యుద్ధం ముగిసినా ధ్వంసమైన ఆయిల్ వసతుల పునరుద్ధరణకు కనీసం 2 సంవత్సరాలు పడుతుందని అంచనా.

ఇదిలా ఉండగా, ఇరాన్ నాయకులను దొంగదెబ్బతో హతమార్చడం ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవాలనుకునే ఇజ్రాయెల్ వ్యూహం నెరవేరదు. రెండవతరం నాయకత్వం, సైనిక సన్నద్ధత తమ దేశంపై దురాక్రమణ యుద్ధాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రపంచాభిప్రాయం కూడా అమెరికాకు వ్యతిరేకంగా ఉంది. ట్రంప్ తలొగ్గక తప్పదు! ఆ పని ఎంత త్వరగా చేస్తే ప్రపంచదేశాలకు అంతమంచిది.



## యుద్ధంతో తీవ్ర పరిణామాలు

**ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ కూటమి మధ్య యుద్ధం త్వరగా ముగియాలని, ఎందుకంటే ఇది ప్రపంచ ఆర్థిక వ్యవ-స్థపై తీవ్ర పరిణామాలను కలిగిస్తుందని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా శుక్రవారం అన్నారు. ఇక్కడ హజ్రత్‌బల్ మసీదులో శుక్రవారం ప్రార్థనలు చేసిన అనంతరం అబ్దుల్లా విలేకరులతో మాట్లాడుతూ 'ఈ యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థపైనే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర పరిణామాలను కలిగి-స్తుంది' అని తెలిపారు. అమాయక ప్రాణనష్టం కారణంగా యుద్ధాన్ని ముగించాల్సిన ప్రాముఖ్యతను మాజీ ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు.**

– నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా



# శారీరక మానసిక క్షీణతకు చెందిన వ్యాధి 'డౌన్ సిండ్రోమ్'

(మార్చి 21 ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినం సందర్భంగా)

క్రోమోజోమ్స్‌లో లోపం వల్ల కలిగే శారీరక మానసిక క్షీణతకు చెందిన వ్యాధిగా డౌన్ సిండ్రోమ్‌ను పిలుస్తున్నాం. బ్రిటీష్ వైద్యుడు జాన్ లాంగ్డన్ డౌన్ కృషి ఫలితంగా వివరించబడిన ఈ ప్రత్యేక వ్యాధికి డౌన్ జ్ఞాపకార్థం డౌన్ సిండ్రోమ్‌గా నామకరణం చేశారు. డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో క్రోమోజోమ్స్ 21లో రెండేసి పోగులు ఉండడానికి బదులు అసాధారణంగా మూడు ఉండడం వల్ల దీనిని 'ట్రైసోమీ'గా పిలుస్తారు. ఇలాంటి వారిలో సాధారణంగా ఐక్యూ 100కి బదులుగా వీరిలో 50 వరకు మాత్రమే ఉంటూ శారీరక మానసిక అభివృద్ధి కుంటుపడుతుంది. ఈ వ్యాధిని తల్లి గర్భంలోనే గుర్తించే టెక్నాలజీ ఉండడంతో నేటి వైద్యులు అబార్షన్‌ను కూడా సూచించడం చూస్తున్నాం. డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న వయోజనులు కూడా 10 ఏండ్ల లోపు పిల్లల వలె ప్రవర్తించడం గమనించవచ్చు. జీవితాంతం శాపంగా మారగల ఈ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కలిగించడానికి ప్రతి ఏట 21 మార్చిన ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినంగా పాటించడం 2012 నుంచి కొనసాగుతున్నది. ప్రపంచ డౌన్ సిండ్రోమ్ 2026 ఇతివృత్తంగా ఒంటరితనానికి వ్యతిరేకంగా ఐక్య పోరాటం అనే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో 33 శాతం వరకు న్యూరోలాజికల్ సమస్యలు, 50 శాతం రోగుల్లో వినికిడితో పాటు దృష్టి దోషాలు నమోదు అవుతున్నాయి. డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో మానసిక క్షీణత, శారీరక పెరుగుదల తగ్గడం, చిన్న చేతులు/గడ్డం/మెడ/చెవులు, మాట తడబడడం, పెద్ద నాలుగ, అసాధారణ చెవులు, మెడ వెనుక చర్మం పెరుగుదల, కండరాల బలహీనత, పుట్టుకతో గుండె జబ్బులు లాంటి లక్షణాలు కనిపుస్తాయి. కొంత మందిలో గుండె జబ్బులు, క్యాన్సర్, ఎండోక్రైన్, దంత లోపాలు కనిపిస్తూ, సంతానోత్పత్తి కూడా మందగిస్తుంది. ఈ వ్యాధి నిర్థారణకు క్రోమోజోమ్స్ విశ్లేషణ, ఎక్స్ రే, రక్త పరీక్షలు, క్వాడ్ స్క్రీన్, అల్ట్రా సౌండ్, డిఎన్ఎ పరీక్షలు చేస్తారు. బాల్యం నుంచి సక్రమ కుటుంబ వాతావరణం, వైద్య చికిత్సలు, ఆరోగ్య పరీక్షలు, కొన్ని పనుల్లో శిక్షణలు ఇవ్వడం వల్ల వ్యాధిగ్రస్తుల్లో కొంత శారీరక మానసిక అభివృద్ధి మెరుగుపడవచ్చు. పిల్లలకు విద్యను అందించడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో రోగుల్లో సమస్యలు కొంత వరకు తగ్గుతాయని తెలుసుకోవాలి. జన్మతః సంక్రమించే ఈ వ్యాధిగ్రస్తులను తల్లి గర్భంలోనే గుర్తిస్తూ సరైన వైద్యం లేదా అబార్షన్ పరిష్కారం చూపవచ్చు. డౌన్ సిండ్రోమ్ ఉచ్చులో చిక్కిన అన్ని వర్గాల అభాగ్య రోగులకు సమాన హక్కులు, వైద్య ఆరోగ్య సహాయాలు, విద్య, గౌరవ మర్యాదలు కల్పించే విధంగా పౌర సమాజం మేల్కొనాలి. ప్రతి వెయ్యి మంది శిశువుల్లో ఒకరు ఇలాంటి సమస్యలతో జన్మిస్తున్న కారణంగా పుట్టక ముందే గుర్తించే ప్రయత్నాలు చేస్తే చక్కటి పరిష్కారాలు చూపవచ్చని తెలుసుకుందాం, ఈ రోగుల పట్ల గౌరవ మర్యాదలు ప్రదర్శిద్దాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# కేరళ ఎన్నికల క్షేత్రంలో ముందున్న ఎల్‌డిఎఫ్

పి.శ్రీకుమారన్

ఏప్రిల్ 9న కేరళ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల కమిషన్ షెడ్యూలు ప్రకటించటంతో అరమరికలు లేని రాజకీయ పోరాటానికి రంగం సిద్ధమైంది. పోలింగ్‌కు ఇక 20రోజులలోపే వ్యవధి ఉన్నందున రాజకీయ పార్టీలు ఏకబిగిన ప్రచార క్షేత్రంలోకి లంఘించాల్సి ఉంది. సమయం తక్కువ కాబట్టి పరుగులు తీయకతప్పదు. నామినేషన్‌ల దాఖలు పర్వం మొదలైంది – మార్చి 23 ఆఖరు తేదీ... ఓట్ల లెక్కింపు మే 4. ఫలితాల కోసం 25రోజులు ఎదురుచూస్తూ కూర్చోవాలి. కేరళ, అస్సోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు కూడా తమిళనాడు, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో పోలింగ్‌తోపాటు ఏప్రిల్ చివరి వారంలో నిర్వహించి ఉంటే కేరళ, అసోం, పుదుచ్చేరి (యుటి) రాజకీయ పార్టీలకు ప్రచారానికి తగిన వ్యవధి లభించేది. దేశమంతటా జమిలి (పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి) ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమంటున్న ఎన్నికల కమిషన్ నాలుగు రాష్ట్రాల ఎన్నికల మధ్య దాదాపు 20రోజుల విరామం పాటించటం చిత్రంగా లేదూ! నిర్వహణ సమర్థత కన్నా ఈ విరామానికి ఇతరేతర కారణాలు ఉండవచ్చు.

కేరళలో 'సర్' తర్వాత ఓటర్లు మొత్తం 2కోట్ల 70లక్షలు. వారిలో శతాధిక వృద్ధులు 1571, మహిళలు 1.38 కోట్లు, పురుషులు 1.31కోట్లు, 277 ట్రాన్స్‌జెండర్ ఓటర్లు. పోలింగ్ కేంద్రాలు 30471, పట్టణాల్లో 6,130, గ్రామీణం 24,341. ఒకొక్క బూత్‌కు ఓటర్లు గరిష్టంగా 1200. పాలక వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్)లో ప్రధాన భాగస్వాములైన సిపిఐ(ఎం), సిపిఐ వెనువెంటనే అభ్యర్థుల జాబితాలు ప్రకటించాయంటే అవి ఎన్నికల ప్రచారానికి సంసిద్ధంగా ఉన్నాయి. ముందుగా అభ్యర్థుల్ని ప్రకటించిన ఘనత సిపిఐకి దక్కుతుంది. సిపిఐ(ఎం) కూడా ఇసిఐ ఎన్నికల తేదీలు ప్రకటించగానే తమ అభ్యర్థుల జాబితా విడుదల చేసింది. దాని ప్రధాన ప్రత్యర్థులు కాంగ్రెస్ నాయకత్వంలోని యుడిఎఫ్, బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ. కాగా, ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల మధ్య సాంప్రదాయకంగా అధికారం మారుతూ ఉంటుంది. బిజెపి ఉనికి కోసం పాటు పడుతోంది. దాని ఓటింగ్ శాతం నెమ్మదిగా పెరుగుతున్నది. గత ఎన్నికల్లో ఎల్.డి.ఎఫ్ వరుసగా రెండవసారి అధికారంలోకి వచ్చి కొత్త చరిత్ర లిఖించింది. ఈ ఎన్నికల్లో గెలిచి హాట్రిక్ నమోదు చేయాలని చూస్తోంది.

మొత్తం 140 సీట్లు కలిగిన కేరళ అసెంబ్లీ నియమ సభ సభ్యుల్లో 14 ఎస్‌సిలకు, 2 ఎస్‌టిలకు రిజర్వు చేయబడినాయి. అయితే గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్‌కు అధికారం అప్పగించిన కేరళ ఓటర్లు లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి పట్టం కటట్టం విశేషం. 2026 ఎన్నికలకు సిపిఐ(ఎం) 56 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను, మంత్రులు దాదాపు అందర్నీ రీనామినేట్ చేసింది. పదేళ్ళు అధికారంలో ఉన్న కారణంగా ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమించటానికి ఈ నిర్ణయం తోడ్పడుతుందని భావన. తిరువనంతపురం జిల్లాలో సిట్టింగ్ ఎమ్మెల్యేలందరూ తిరిగి పోటీ చేస్తున్నారు. సిపిఐ(ఎం) పోటీచేస్తున్న 86 సీట్లలో 75 మంది పార్టీ అభ్యర్థులు, మిగతా 11సీట్లలో ఇండిపెండెంట్లు పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజ



యన్ కన్నూర్ జిల్లాలోని ధర్మదం నియోజకవర్గం నుంచి తిరిగి పోటీ చేస్తున్నారు. స్పీకర్ ఎ.ఎన్.షంషేర్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎం.వి.గోవిందన్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.స్వరాజ్, మాజీ మంత్రి ఎం.ఎం. మణి ఈసారి పోటీ చేయడంలేదు. సిపిఐ(ఎం) అభ్యర్థుల్లో 10 మంది మహిళలు.

సిపిఐ తన మంత్రులు నలుగురినీ తిరిగి పోటీ చేయిస్తున్నది. వారు కె.రాజన్ (ఒల్లూరు), పి.ప్రసాద్(చేర్తాల), జె.చించురాణి (చదయ మంగ ళం), జి.ఆర్.అనిల్ (నెదుమంగడ్).రాష్ట్ర పార్టీ కార్యదర్శి బినోయ్ విశ్వంపార్టీ తరపున పోటీ చేసే 25మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. అభ్యర్థుల్లో ఐదుగురు మహిళలు, ఒక ఇండిపెండెంట్ ఉన్నారు. ప్రతిపక్ష నాయకుడు వి.డి. సతీశన్(కాంగ్రెస్) పోటీచేస్తాడని భావిస్తున్న పరవూర్ నియోజకవర్గం నుంచి కైపమంగళం ఎమ్మెల్యే ఇ.టి. టైసన్‌ను సిపిఐ నిలబెట్టింది. యుడిఎఫ్, బిజెపి అపవిత్ర కలయికను కేరళ ఓటర్లు తిరస్కరిస్తారని విశ్వం ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరెండు పార్టీలు వేర్వేరుగా కనిపిస్తాయి, కానీ ఎల్‌డిఎఫ్‌ను ఎదుర్కొనే విషయంలో ఒక్కటవుతాయని ఆయన అన్నారు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమం, అభివృద్ధి చొరవలకు ప్రతిఫలంగా ఓటర్లు ఎల్‌డిఎఫ్‌కు మూడవసారి అధికారం ఇచ్చి చరిత్ర సృష్టిస్తారని రాష్ట్ర సిపిఐ(ఎం) కార్యదర్శి ఎం.వి. గోవిందన్ ఆశాభావం ప్రకటించారు. జాతీయ హైవే అభివృద్ధి, గెయిల్ పైప్‌లైన్ ప్రాజెక్టు వంటి ప్రధాన ప్రాజెక్టులను వాస్తవం చేసిన ఘనత ఎల్‌డిఎఫ్‌దేనన్నారు. యుడిఎఫ్‌లో అభ్యర్థుల ఎంపిక ఎప్పటివలె సమస్యలు సృష్టిస్తోంది. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కెపిసిసి మాజీ అధ్యక్షుడు కె.సుధాకరన్ తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ఈ కన్నూర్ ఎంపి అసెంబ్లీకి పోటీచేయాలని కోరుకుంటున్నాడు. అయితే ఎంపిలెవ్వరూ అసెంబ్లీకి పోటీ చేయరాదని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. ఆయన్ను ఢిల్లీ పిలిపించి అధినాయకులు నచ్చజెబుతున్నారు. సుధాకర్ కన్నూర్ జిల్లాలో బలమైన నాయకుడు. ఐయుఎంఎల్ ఎక్కువ సీట్లు డిమాండ్ చేస్తోంది. మరో మిత్రపక్షం కేరళ కాంగ్రెస్ (జోసెఫ్)కూడా అదనపు సీట్లు కోరుతోంది. సమయం తరుముకొస్తోంది కాబట్టి త్వరగా సర్దుబాటుచేసుకోక తప్పదు. ఈసారి తన బలం మెరుగుపడుతుందని బిజెపి ఆశిస్తోంది. కనీసం 15సీట్లు లక్ష్యంగా పెట్టుకుంది. కింగ్ మేకర్ కావాలన్న ఆశవుంది. 2024లో ఒక లోక్‌సభ సీటు (త్రిస్సూర్)ను, ఇటీవల తిరువనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌ను గెలుచుకోవటం బిజెపి విశ్వాసానికి ఆధారం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 11అసెంబ్లీ విభాగాల్లో మొదటి స్థానం, 9స్థానాల్లో రెండవ స్థానం పొందింది. ఈ పర్యాయం 31సీట్లపై అది కేంద్రీకరిస్తున్నది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో మొత్తంగా చూస్తే అది అంచనాలను అందుకోలేదు. దృఢ సంకల్పంతో ప్రచారం సాగిస్తే బిజెపి 8–10 సీట్లలో విజయం పొందగలదని ఆర్‌ఎస్ఎస్ భావిస్తున్నది.

**2021 ఎన్నికల్లో ఫ్రంట్‌ల విజయాలు**

| ఎల్‌డిఎఫ్ | | యుడిఎఫ్ | |
|---|---|---|---|
| సిపిఐ(ఎం) | – 62 | కాంగ్రెస్ | – 22 |
| సిపిఐ | – 17 | ఐయుఎంఎల్ | – 15 |
| కేరళ కాంగ్రెస్ – మణి | – 05 | కేరళ కాంగ్రెస్ | – 02 |
| జెడిఎస్ | – 2 | కేరళ కాంగ్రెస్ (జాకబ్) | – 01 |
| ఎన్‌సిపి | – 1 | ఆర్‌ఎంపిఐ | – 01 |
| ఐఎన్ఎల్ | – 1 | ఇండిపెండెంట్ | – 01 |
| ఎల్‌జెడి | – 1 | | 42 |
| ఎన్ఎస్‌సి | –1 | | |
| కె.సి (బి) | – 1 | | |
| సి(ఎస్) | –1 | | |
| జెకెసి | –1 | | |
| ఇండిపెండెంట్లు | – 5 | | |
| | 98 | | |

# తెలంగాణ ఉద్యమకారులకు హామీలు.. అమలులో ఆగుతున్న అడుగులు!

లేఖ

తెలంగాణ రాష్ట్రం ఒక భావోద్వేగాల పునాది. నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో వేలాది మంది యువత తమ ప్రాణాలను, భవిష్యత్తును పణంగా పెట్టారు. పదేళ్ల నిరీక్షణ తర్వాత రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగింది. 'ఇది గద్దెనెక్కిన ప్రభుత్వం కాదు.. ప్రజల ఆకాంక్షల ప్రభుత్వం' అని ప్రకటించుకున్న కాంగ్రెస్ సర్కార్, ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ఏ మేరకు సఫలీకృతమవుతోంది? తెలంగాణ ఉద్యమ సమయంలో జైలు పాలై, పోలీసు లాఠీలకు ఎదురొడ్డి నిలిచిన ఎందరో ఉద్యమకారులు నేడు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించకుండా వారిని విస్మరించినప్పటికి, కాంగ్రెస్ పార్టీ తన 'అభయ హస్తం' మేనిఫెస్టోలో ప్రతి ఉద్యమకారుడికి న్యాయం చేస్తామని ప్రకటించింది. ముఖ్యంగా అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు రూ.25,000 గౌరవ భృతి, 250 గజాల స్థలం వంటి వాగ్దానాలతో పాటు, ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, ఉచిత వైద్యం వంటి అంశాలు ఉద్యమకారుల్లో కొత్త ఆశలు చిగురింపజేశాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించడం, కేబినెట్ తొలి సమావేశాల్లోనే ఉద్యమకారుల సంక్షేమంపై చర్చించడం సానుకూల సంకేతం.

తెలంగాణ ఉద్యమ సమయంలో నమోదైన కేసులను ఎత్తివేయడంలో ప్రభుత్వం వేగం పెంచిం ది. ఇది వేలాది మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాల వైపు మార్గం సుగమం చేసింది. ఉద్యమ నేపథ్యం ఉన్న కొందరికి కార్పొరేషన్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా 'ఉద్యమంలో పని చేసిన వారికి గుర్తింపు' అనే సందేశాన్ని ఇచ్చారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలులో ప్రధాన అడ్డంకి 'అర్హులైన ఉద్యమకారుల గుర్తింపు'. 2001 నుంచి 2014 వరకు జరిగిన వివిధ దశల పోరాటాల్లో పాల్గొన్న వారి డేటాబేస్ ప్రభుత్వ వద్ద సంపూర్ణంగా లేదు. కేవలం ఎఫ్ఐఆర్ (FIR) ఉన్న వారినే ఉద్యమకారులుగా పరిగణించాలా? లేక జైలుకు వెళ్లిన వారిని మాత్రమేనా? అనే విషయంలో ప్రభుత్వానికి ఇంకా స్పష్టత లేదు. ఈ జాప్యం వల్ల పల్లెల్లో ఉండి, ఏ రికార్డులూ లేని నిజమైన త్యాగధనులు పథకాలకు దూరమయ్యే ప్రమాదం కూడా లేకపోలేదు. తెలంగాణ ఉద్యమకారులకు కేవలం ఆర్థిక సాయం చేయడమే కాకుండా, ఉద్యమకారుల ఆత్మగౌరవాన్ని కాపాడటం కూడా ముఖ్యం. జిల్లా కేంద్రాల్లో ఉద్యమకారుల కోసం ప్రత్యేక భవనాలు నిర్మించాలి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉద్యమకారులకు ఉచిత వైద్య సౌకర్యాలు కల్పించాలి. తెలంగాణ సమాజం ప్రభుత్వాల నుంచి ఆశించేది కేవలం సంక్షేమ పథకాలు మాత్రమే కాదు.. ఉద్యమకారుల త్యాగాలకు దక్కే 'గౌరవం'. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 'పవిత్ర గ్రంథం'గా భావించి, నిర్దేశిత గడువులోగా అమలు చేయాలి. అప్పుడే తెలంగాణ తల్లి రుణం తీర్చుకున్నట్లవుతుంది. ఆశయాలు నీరుగారితే, చరిత్ర మరో పోరాటానికి నాంది పలుకుతుందని పాలకులు విస్మరించకూడదు.

– నమిండ్ల ప్రమోద్
6305638569

# సింగరేణి వితంతువుల పెన్షన్ చెల్లింపులో జాప్యం

లేఖ

సింగరేణి వంటి ప్రభుత్వరంగ సంస్థల్లో దశాబ్దాల పాటు సేవలందించిన ఉద్యోగులు రిటైర్‌మెంట్ అనంతరం తమ జీవన భద్రత కోసం పెన్షన్‌పై ఆధారపడటం సహజం. అయితే ఉద్యోగి మరణించిన తర్వాత అతని జీవిత భాగస్వామికి అందాల్సిన ఫ్యామిలీ పెన్షన్ ఆలస్యమవడం ఒక తీవ్రమైన సామాజిక సమస్యగా మారుతోంది. విధివిధానాలు స్పష్టంగా ఉన్నప్పటికీ అమలు లోపం కారణంగా వితంతువులు ఆర్థిక, మానసిక కష్టాలను ఎదుర్కొంటున్నారు. కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ రూపొందించిన నిబంధనల ప్రకారం, పెన్షన్ ఖాతాను ఫార్మర్–సర్వైవర్ మోడ్‌లో మార్చడం, అవసరమైన పత్రాలు సమర్పించడం వంటి చర్యలు ముందుగానే పూర్తి చేస్తే, ఉద్యోగి మరణించిన తరువాత ఒక నెలలోపు ఫ్యామిలీ పెన్షన్ మంజూరు కావాలి. అంతేకాకుండా, రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్‌లో కుటుంబ పెన్షన్‌గా లభించే 60 శాతం మొత్తం కూడా స్పష్టంగా పేర్కొనబడుతుంది. ఈ విధానం వితంతువులకు తక్షణ ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రూపొందించబడింది. కానీ వాస్తవ పరిస్థితి ఈ లక్ష్యాలకు విరుద్ధంగా ఉంది. పత్రాలు సమర్పించిన తర్వాత కూడా నెలలు గడిచినా పెన్షన్ మంజూరు కాకపోవడం సాధారణమైపోయింది. ఒకవైపు భర్తను కోల్పోయిన దుఃఖం, మరోవైపు ఆదాయ వనరు లేకపోవడం – ఈ రెండు భారాలు వితంతువులను మరింత అసహాయ స్థితిలోకి నెట్టుతున్నాయి. బ్యాంకులు, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ నోడల్ కార్యాలయాల మధ్య సమన్వయం లోపం ఈ సమస్యకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ మూడు నెలలు గడిచినా ఫ్యామిలీ పెన్షన్ మంజూరు కాకపోవడం పాలనలో ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం. నియమాలు ఉన్నప్పుడు అమలు ఎందుకు జరగడం లేదు? బాధ్యత ఎవరిది? ఒక నెలలోపు పరిష్కారం ఇవ్వాల్సిన వ్యవస్థ ఎందుకు నెలల తరబడి ఆలస్యం చేస్తోంది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

**ఈ సమస్యకు పరిష్కారం కోసం కొన్ని కీలక చర్యలు:**

– ఫ్యామిలీ పెన్షన్ మంజూరుకు గరిష్ట గడువు (30 రోజులు)ను కచ్చితంగా అమలు చేయాలి. ప్రతి దరఖాస్తుకు ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసి, లబ్ధిదారులకు స్థితి సమాచారం అందించాలి.
– బ్యాంకులు, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ నోడల్ కార్యాలయాల మధ్య డిజిటల్ సమన్వయం పెంచాలి.
– సామాజిక న్యాయం అంటే కేవలం విధానాలు రూపొందించడం కాదు, అవి సమర్థవంతంగా అమలు కావడం. పెన్షన్ అనేది ఉద్యోగి సంపాదించిన హక్కు; అతని కుటుంబానికి అది గౌరవప్రదమైన జీవనానికి ఆధారం. ఆ హక్కు ఆలస్యం అవ్వడం అనేది కేవలం పరిపాలనా లోపం కాదు – అది మానవత్వానికి విరుద్ధం.
– ఇప్పుడు, కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సంస్థ, బ్యాంకులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాలి. వితంతువులు తమ హక్కు కోసం వేడుకోవాల్సిన పరిస్థితి మారా లి. పెన్షన్ హక్కు – ఆలస్యం కాదు అనే సూత్రం కేవలం నినాదంగా కాక, ఆచరణలో కనిపించాల్సిన సమయం ఆసన్నమైంది.

– ఆళవందార్ వేణు మాధవ్
8686051752

## భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం, భద్రాచలయం పట్టణ సమగ్ర అభివృద్ధిపై శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపి బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోత్ రామ్ చంద్ర నాయక్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. భద్రాచలం పునర్‌నిర్మాణం, పునరుజ్జీవనం ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు.

### ఫారం-సి
### నోటిఫికేషన్
(చట్టంలోని సెక్షన్ 11 క్రింద, సెక్షన్ 10A మినహాయింపు ననుసరించి)
(రూల్ 6/12 చూడుము)

**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ శాఖ**

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఫైల్ నంబర్: జి/254/2026 తేది:16.03.2026
రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఫైల్ నెంబర్. బి/2426/2026 తేది:13.03.2026
గజెట్ నంబర్: వికెబి-32/2026 తేది:16.03.2026

ప్రజా ప్రయోజనము నిమిత్తం **తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC) లిమిటెడ్** ద్వారా **ఇండస్ట్రియల్ పార్కు** స్థాపించుటకు వికారాబాద్ జిల్లాలో పరిగి మండలం **రాపోలు** గ్రామంలో **(Ac 101.08 Gts)** ఎకరాల భూమి అవసరమై ఉన్నదని తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్ వికారాబాద్ వారు భావించుచున్నారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, టీజీఐఐసీ లిమిటెడ్, హైదరాబాద్ వారి వైస్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ చేసిన అభ్యర్థనను జాగ్రత్తగా పరిశీలించి, G.O.Rt.No.15, పరిశ్రమలు & వాణిజ్య శాఖ (IP & INF), తేదీ 27.01.2026 ను జారీ చేసి, భూముల స్వాధీనము, పునరావాసం మరియు పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత కల్పించే హక్కు చట్టం, 2013 లోని అధ్యాయం- III-A లోని సెక్షన్ 10A ప్రకారం, భూముల స్వాధీనము, పునరావాసం మరియు పునర్నిర్మాణంలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత కల్పించే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం, 2016 (చట్టం నం. 21/2017) ప్రకారం సవరించబడిన విధంగా, పై పరిశ్రమల ప్రాజెక్టు నిమిత్తం టీజీఐఐసీ లిమిటెడ్‌కు అనుకూలంగా భూముల స్వాధీనానికి మినహాయింపును మంజూరు చేసింది. దీని ఫలితంగా, ఆ చట్టంలోని అధ్యాయాలు II మరియు III నిబంధనలు ఈ స్వాధీనానికి వర్తించవు.

జిల్లా కలెక్టర్, వికారబాద్ జిల్లా ప్రొసీడింగ్ నం. జి/254/2026, తేదీ: 13.03.2026 ద్వారా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ), వికారాబాద్ జిల్లా గారిని ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ నియామకం చేయబడినది. అందుచేత, పై ప్రజాప్రయోజనార్థం, ఆ చట్టంలోని సెక్షన్ 11 (1) ద్వారా కల్పించబడిన అధికారాలను వినియోగించి, వికారాబాద్ జిల్లా, పరిగి మండలం రాపోలు గ్రామంలో సుమారు ఎకరాలు 101.08 గుంటలు (మరియు/లేదా తక్కువ) విస్తీర్ణంలో, క్రింద షెడ్యూల్‌లో వివరించిన భూమిని స్వాధీనం చేయుటకు ప్రతిపాదించబడినదని ఈ ద్వారా తెలియజేయడమైనది.

| గ్రామము: రాపోలు | | | | | మండలం: పరిగి | జిల్లా: వికారాబాద్ | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | సరిహద్దులు | | | | చెట్లు | | నిర్మాణాలు | |
| క్ర. సం. | సర్వే నంబర్ | భూ స్వభావం | భూమి రకం | భూ సేకరణ క్రింద ఉన్న విస్తీర్ణం (ఎ. గుంటలు) | పట్టాదారుని పేరు | ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | రకం | సంఖ్య | కట్టడము | స్వభావం |
| 1 | 257 | పట్టా | మెట్ట/డ్రై | 5.15 | బి. యాదమ్మ | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | రసాల ఈశ్వర్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | అరికథల గోపికృష్ణ | | | | | - | - | - | - |
| 2 | 228 | పట్టా | మెట్ట/డ్రై | 3.30 | సబేర బేగం | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మహ్మద్ జావేద్ ఖురేషి | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | చాంద్ పాషా | | | | | - | - | - | - |
| 3 | 234 | పట్టా | మెట్ట/డ్రై | 13.32 | నర్సింహులు చాకలి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | వెంకటయ్య చాకలి | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | హనుమయ్య చాకలి | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | చాకలి కిష్టమ్మ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | చాకలి యాదమ్మ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | అవుసులు మచ్చందర్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | చాకలి కిష్టయ్య | | | | | - | - | - | - |
| 4 | 235 | పట్టా | మెట్ట/డ్రై | 13.19 | నర్సింహులు చాకలి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | వెంకటయ్య చాకలి | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | హనుమయ్య చాకలి | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | చాకలి కిష్టమ్మ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | అవుసుల మచ్చందర్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మహ్మద్ సాలేహా | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | కారుమూరి చంద్రయ్య | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | బండారు దయాకర్ రావు | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ముప్పిడి భవాని | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | చాకలి కిష్టయ్య | | | | | - | - | - | - |
| 5 | 236 | పట్టా | మెట్ట/డ్రై | 14.39 | మహ్మద్ ఇస్మాయిల్ | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఎం. నూర్జహాన్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | తమన్నా రామస్వామి | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | టి. అజయ్ కుమార్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | కంచి బుచ్చయ్య | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | కంచి హన్మంతు | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | కంచి బాబయ్య | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | కంచి దశరథ్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ట్రూజ్ అల్లం ఖాన్ | | | | | - | - | - | - |
| 6 | 251 | పట్టా | మెట్ట/డ్రై | 4.08 | బాలకిష్టయ్య సాలె | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | భారతమ్మ | | | | | - | - | - | - |
| 7 | 252 | పట్టా | మెట్ట/డ్రై | 12.24 | ఎం.డి అజీముద్దీన్ | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ముథలీఫ్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఇబ్రహీం ఎం.డి | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | నజియా బేగం | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | నజియా బేగం | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మహ్మద్ కజిన్ ఖాన్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | రామానుజం సతీష్ కుమార్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | బి. హేమంత కుమార్ | | | | | - | - | - | - |
| 8 | 253 | పట్టా | మెట్ట/డ్రై | 1.39 | బి. హేమంత కుమార్ | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | పగుడాల రవి | | | | | - | - | - | - |
| 9 | 263 | పట్టా | మెట్ట/డ్రై | 4.12 | అమీరుద్దీన్ మొల్ల | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఖాదర్ మొల్ల | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మొహ్మద్ జమాలుద్దీన్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఎండి ఖబూలే హుస్సేన్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఎండి ఇస్మాయిల్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఎండి వొలియుద్దీన్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఎండి చాంద్‌పాషా | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | చాంద్‌పాషా | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | తాజుద్దీన్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మొల్ల హాజీముద్దీన్ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మొల్ల జహంగీర్ బీ | | | | | - | - | - | - |
| 10 | 266 | పట్టా | మెట్ట/డ్రై | 3.08 | యాదయ్య బండ్ల | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | అనంతయ్య బండ్ల | | | | | - | - | - | - |
| 11 | 267 | పట్టా | మెట్ట/డ్రై | 5.27 | మోడె వెంకటయ్య | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | రామయ్య మోడె | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మోడె యాదయ్య | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | రాంచంద్రయ్య | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | సత్తయ్య | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మోడె నర్సమ్మ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | ఎం. నర్సమ్మ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మోడె సత్యమ్మ | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | మోడె పార్వతమ్మ | | | | | - | - | - | - |
| 12 | 268 | పట్టా | మెట్ట/డ్రై | 2.29 | లాలయ్య శ్రీరంగాపురం | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | తిరుమలయ్య శ్రీరంగాపురం | | | | | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | శ్రీరంగాపురం లక్ష్మి | | | | | - | - | - | - |
| 13 | 440 | పట్టా | మెట్ట/డ్రై | 3.29 | బసిలింగప్ప పగుడాల | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| 14 | 441 | పట్టా | మెట్ట/డ్రై | 2.07 | పగుడాల రవి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| 15 | 442 | పట్టా | మెట్ట/డ్రై | 0.30 | శ్రీనివాసరావు దేవన్నగారి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | శేషగిరి రావు దేవన్నగారి | | | | | | | | |
| | | పట్టా | మెట్ట/డ్రై | | అర్థశేఖర్ రెడ్డి | | | | | | | | |
| 16 | 443 | పట్టా | మెట్ట/డ్రై | 5.09 | శేషగిరిరావు దేవన్నగారి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | అర్థశేఖర్ రెడ్డి | | | | | | | | |
| 17 | 446 | పట్టా | మెట్ట/డ్రై | 1.09 | శ్రీనివాసరావు దేవన్నగారి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| | | పట్టా | మెట్ట/డ్రై | | శేషగిరిరావు దేవన్నగారి | | | | | | | | |
| | | పట్టా | మెట్ట/డ్రై | | అర్థశేఖర్ రెడ్డి | | | | | | | | |
| 18 | 447 | పట్టా | మెట్ట/డ్రై | 2.02 | ఉప్పరి లక్ష్మమ్మ ఉప్పరి జానెమ్మ | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | ఇతరుల భూమి | - | - | - | - |
| మొత్తం - ఎకరాలు 101.08 గుంటలు | | | | | | | | | | | | | |

ఈ ప్రకటన భూ సేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు నష్టపరిహారం పొందే హక్కు (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం నెం 21 ఆఫ్ 2017) ద్వారా సవరించబడిన విధంగా భూసేకరణ, పునరుపాధి మరియు పునరావాస కల్పనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహారం పొందే హక్కు చట్టం, 2013 (చట్టము నెం.30/2013) లోని సెక్షన్ 11 (1) లోని నిబంధనల క్రింద సంబంధిత వ్యక్తులందరికీ తెలియజేయుటకు జారీ చేయబడినది.

ఈ భూమికి సంబంధించిన ప్లాన్‌ను వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏ పని దినములలోనైనా పని వేళల్లో తనిఖీ చేయవచ్చు.

చట్టంలోని సెక్షన్ 12 ప్రకారం భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఉప-నేల పరీక్షలు చేయడానికి వికారాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారికి మరియు సిబ్బందికి అధికారం ఇవ్వబడింది.

సెక్షన్ 11 (4) ప్రకారం, ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఈ భూములకు సంబంధించి ఎటువంటి విక్రయాలు, కొనుగోళ్లు లేదా ఇతర లావాదేవీలు చేయకూడదు.

భూసేకరణకు అభ్యంతరాలు ఏవైనా వుంటే చట్టంలోని సెక్షన్ 15 (1) నిబంధనల ప్రకారం ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల లోపు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్ / అధికృత అధికారికి దాఖలు చేయవచ్చును.

భూమి పరిహారం సంబంధించి చర్చల ద్వారా తమ క్లెయిమ్‌లను పరిష్కరించుకోవడానికి ఆసక్తి గల వ్యక్తులు తమ క్లెయిమ్‌లు మరియు అభిప్రాయాలను దాఖలు చేయవచ్చునని తెలియజేయడమైనది

| సం/- | సం/- | సం/- | సం/- |
|---|---|---|---|
| తహశీల్దార్, పరిగి మండలం | రెవెన్యూ డివిజనల్ అధికారి, వికారాబాద్ డివిజన్ | అదనపు కలెక్టర్, వికారాబాద్ జిల్లా | కలెక్టర్, వికారాబాద్ జిల్లా |

DIPR RO.NO:1314/LA-PP/ADVT/AGENCY/2025-26


## నగరం పెరిగినా..
# బడ్జెట్‌లో పెరగని నిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నగర విస్తరణ జరిగినప్పటికీ, 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ కేటాయింపులు మాత్రం గత ఏడాదితో పోలిస్తే పెద్దగా మార్పులు లేకుండా కొనసాగడం గమనార్హం. ప్రభుత్వం నగర పరిమితులను ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించి, జిహెచ్ఎంసిని విభజిస్తూ మూడు కార్పొరేషన్‌ల ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్‌గా పేరు మార్చినా, ఆ మేరకు నిధుల పెంపు కనిపించలేదు. మొత్తం క్యూర్ ప్రాంతానికి సుమారు రూ.9,740 కోట్ల బడ్జెట్ కేటాయించగా, ఇందులో ప్రధానంగా కొన్ని పెద్ద ప్రాజెక్టులకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ బడ్జెట్‌లో ముఖ్యంగా హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్ సిటీ) ప్రాజెక్టు రూ.2,654 కోట్లు కేటాయింపులు జరిపింది. రహదారుల విస్తరణ, ఫైవంతెనలు, అండర్ పాస్‌లు, స్టీల్ బ్రిడ్జీలు, వరద నాలాల అభివృద్ధి వంటి పనులకు ఈ నిధులు వినియోగించనున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఈ పనుల్లో గణనీయమైన పురోగతి సాధించి ట్రాఫిక్ సమస్యలను తగ్గించాలనే లక్ష్యంతో ముందుకెళుతోంది.

**మూసీకి రూ.1,500 కోట్లు..**
ఇక మూసీ నది పరివాహక ప్రాంత అభివృద్ధికి మరోసారి రూ.1,500 కోట్లు కేటాయించారు. గత ఏడాది కూడా ఇదే మొత్తాన్ని కేటాయించినప్పటికీ, విడుదల తక్కువగా జరిగిన నేపథ్యంలో ఈసారి పూర్తి స్థాయిలో నిధులు విడుదల అవుతాయని అధికారులు భావిస్తున్నారు. మొదటి దశలో సుమారు 21 కిలోమీటర్ల నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడానికి డిపిఆర్ సిద్ధమైందని, త్వరలో పనులు వేగం అందుకుంటాయని అంచనా. సామాజిక, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పథకాలకు కూడా కొంత ప్రాధాన్యం ఇచ్చారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఆటో రిక్షాలను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చేందుకు రూ.200 కోట్లు కేటాయించగా, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కోసం రూ.315 కోట్లు మంజూరు చేశారు. అయితే, కొన్ని కీలక సంస్థల నిధుల్లో కోతలు విధించడం కూడా ఈ బడ్జెట్ ప్రత్యేకతగా మారింది. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ(హైడ్రా)కి కేటాయింపులు రూ.120 కోట్ల నుంచి రూ.101.49 కోట్లకు తగ్గించారు. ముఖ్యంగా పథకాల అమలు కోసం ఇచ్చే నిధులను రూ.100 కోట్ల నుంచి రూ.50 కోట్లకు సగానికి తగ్గించడం గమనించదగ్గ విషయం. రవాణా రంగంలో కూడా మిశ్రమ పరిస్థితి కనిపించింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ పనుల కోసం మొత్తం రూ.1,100 కోట్లు కేటాయించగా, ఇందులో రూ.500 కోట్లు రుణాలు, రూ.600 కోట్లు గ్రాంట్ల రూపంలో ఉన్నాయి. అయితే మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్ (ఎంఎంటిఎస్)కు కేవలం రూ.5 కోట్లు మాత్రమే కేటాయించడం ఆశ్చర్యకరం కలిగిస్తోంది. గత ఏడాది రూ.50 కోట్లతో పోలిస్తే ఇది భారీ తగ్గుదలగా చెప్పుకోవచ్చు.

**జలమండలికి రూ.3,005 కోట్ల రుణాలకు అనుమతి..**
నీటి సరఫరా రంగంలో హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు(హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి) కోసం రూ.3,005 కోట్ల రుణాలకు అనుమతి ఇచ్చారు. అలాగే 20 కిలోలీటర్ల ఉచిత నీటి పథకానికి రూ.300 కోట్లు యథాతథంగా కేటాయించారు. హెచ్ఎండిఏ అభివృద్ధి పనుల కోసం కూడా రూ.500 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఇక ఖిలీ కుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ(కూడా)కి కేటాయింపులు భారీగా తగ్గించి రూ.25 కోట్లకే పరిమితం చేశారు. గత సంవత్సరం రూ.63.38 కోట్లు కేటాయించిన నేపథ్యంలో ఇది గణనీయమైన కోతగా చెప్పవచ్చు. మొత్తం మీద చూస్తే, నగర విస్తీర్ణం పెరిగినా, బడ్జెట్ కేటాయింపులు మాత్రం పాత జిహెచ్ఎంసి స్థాయిల్లోనే కొనసాగినట్లు కనిపిస్తోంది. ఒకవైపు మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్ద ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన ప్రభుత్వం, మరోవైపు కొన్ని కీలక సంస్థల నిధులను తగ్గించడం వల్ల ఈ బడ్జెట్ మిశ్రమ ధోరణిగా నిలిచింది. నగరాభివృద్ధి వేగం పెరగాలంటే భవిష్యత్తులో మరింత సమతుల్య కేటాయింపులు అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## భూదాన భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలి
### రెవెన్యూ శాఖ మంత్రికి సిపిఐ నేతల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా నిరుపయోగంగా ఉన్న భూదాన భూములను నిరుపేదలకు పంపిణీ చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఏ చాడ వెంకటరెడ్డి, తెలంగాణ సర్వోదయ మండలి రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు ఆర్. శంకర్ నాయక్ లు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి వారు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో నిరుపేదలకు చెందాల్సిన 1.59 లక్షల ఎకరాల భూదాన భూములు నిరుపయోగంగా ఉన్నాయని మంత్రికి వివరించారు. అప్పటి హైదరాబాద్ రాష్ట్రంలో భూమిలేని నిరుపేదలకు పంచేందుకు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు ఆచార్య వినోబా భావే భూస్వాముల నుండి సేకరించిన దాదాపు 1,79,000 ఎకరాల భూమిని కొద్దిమంది నిరుపేదలకు మాత్రమే పంపిణీ చేయగా అన్యాక్రాంతమైన ఈ భూములు చాలావరకు నేటికీ ఖాళీగానే ఉన్నాయని తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ భూములను పేదలకు పంపిణి చేసిందని, ఇప్పుడు కూడా ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ భూములను పేదలకు పంపిణి చేయాలనీ వారు కోరారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ లో సర్వే నెంబర్ 88, 89 లో ఉన్న 31 ఎకరాల భూదాన భూములను సామజిక ఆర్థిక సర్వే చేసి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలో ఉన్న దాదాపు 1500 మంది ఇళ్లులేని నిరుపేదలకు పట్టాలు పంపిణి చేయాలనీ వారు కోరారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ భూములలో కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ భూములను గూడులేని పేదలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూదాన భూములను ప్రభుత్వం అధీనంలో పెట్టుకోవాలని, అఖిల భారత సర్వ సేవా సంఘం చేసిన సిఫార్సుల మేరకు భూదాన యజ్ఞ బోర్డు ను ఏర్పాటు చేసి మొత్తం భూదాన భూములను పేదలకు పంపిణి చేయాలనీ వారు మంత్రిని కోరారు.

## సమగ్ర పంట బీమా పథకం అమలు చేయాలి
### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంటల బీమాకు ప్రభుత్వం నిధులను కేటాయించినంత మాత్రన సరిపోదని, విపత్తుల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహాం అందేవిధంగా మార్గదర్శకాలను రూపొందించి అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ డిమాండ్ చేశారు. ఇటీవల వాతావరణ సమతూల్యం దెబ్బతిన్న కారణంగా ఓ గ్రామంలో పడుతున్న అకాల వర్షాలు పక్క గ్రామల్లో కురవని పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో విపత్తులు సంభవించిన సమయంలో ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నష్ట పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అదేవిధంగా ఈ ఏడాది బడ్జెట్‌లో పంట బీమాకు రూ.1866 కోట్లను ప్రభుత్వం కేటాయించడం అభినందనీయమని, అయితే గత ఏడాదితో పోల్చితే ఈ బడ్జెట్ వ్యవసాయ -అనుబంధ రంగాలకు సుమారు రూ.1260 కోట్ల కోత విధించడం సరికాదన్నారు. అదేవిధంగా సాగు నీటి ప్రాజెక్టులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాల్సిన నేపథ్యంలో నీటిపారుదల శాఖకు మరింత పెద్ద ఎత్తున నిధులను కేటాయించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా ఈ ఏడాది రూ. 22 వేల 615 కోట్ల మాత్రమే కేటాయించారన్నారు. గత బడ్జెట్‌తో పోల్చితే ఈ సారి రూ.758 కోట్లు కోత పెట్టారని, ఇలా అయితే ప్రాజెక్టులు ఏలా పూర్తి అవుతాయని ప్రశ్నించారు. వ్యవసాయం, సాగునీటి రంగానికి సంబంధించి బడ్జెట్ ప్రతిపాదనలు సవరించి అవసరమైన నిధులను కేటాయించడంతో పాటు పూర్తి స్థాయి రుణ మఫీకి, సన్న ధాన్యానికి మాత్రమే కాకుండా అన్ని పంటలకు బోనస్ ఇవ్వడానికి అవసరమై నిధులను కేటాయించాలని బాగం హేమంతరావు, పశ్యపద్మ డిమాండ్ చేశారు.

## ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం పనులు
# మరింత వేగవంతం
### ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎస్ఎల్‌బిసి సొరంగ మార్గం పనులు మరింత వేగవంతంగా ముందుకు సాగుతున్నాయని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఎస్.ఎల్.బి.సి తో పాటు, డిండి ఎత్తిపోతల పథకం, అచ్చంపేట బ్రాంచ్ కెనాల్ పురోగతిపై మంత్రి ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ తదితరులు ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రెండు వైపులా తవ్వకాలు ప్రారంభం అయినందున ఇకపై నిరంతరాయంగా పనులు సాగుతున్నాయని ఆయన తెలిపారు.ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గాంగ నిలువనున్న ఈ ప్రాజెక్ట్ తవ్వకాలలో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు నిబంధనలు కటినంగా పాటించాలని ఆయన అధికారులను ఆదేశించారు. తవ్వకాల సమయంలో సొరంగ మార్గం చివరికంటూ గాలి వెలుతురు ప్రసారం అయ్యేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.యిన్లెట్ వైపు పనులు పునఃప్రారంభం కావడానికి ముందే 20 మీటర్ల దూరం ఓపెన్ కట్ చేయడంతో పాటు అదనపు భద్రతా చర్యలను పకడ్బందీగా చేపట్టినట్లు ఆయన వివరించారు.ఇప్పటికే తవ్వకాలు ప్రారంభించిన ఔట్ లెట్ తవ్వకాలలో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి 20 మీటర్ల దూరం పూర్తి చేశామని ఆయన తెలిపారు. ఇది పూర్తి అయితే ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగా నిలవనుందని తెలిపారు.

## మరో రెండు వారాల్లో ధాన్యం కోనుగోళ్లు ప్రారంభం
### స్టీఫెన్ రవీంద్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లు మరో రెండు వారాల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అదనపు గోదాములను వెంటనే సిద్ధం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర జిల్లా కలెక్టర్లకు సూచించారు . రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించడమే లక్ష్యంగా, పౌరసరఫరాల భవన్‌లో రాష్ట్ర రైస్ మిల్లర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ ధాన్యం సేకరణ, అన్‌లోడ్ చే ఎలాంటి ఆలస్యం జరగకుండా, అన్ని కొనుగోలు కేంద్రాల్లో తగినంత మంది హమాలీలను (కార్మికులను) ఏర్పాటు చేయాలని అధికారులను మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ఈ ప్రక్రియను వేగవంతం చేయడానికి ప్రభుత్వంతో కలిసి సమన్వయంతో పని చేస్తామని రైస్ మిల్లర్లు హామీ ఇచ్చారు. మిల్లర్ల వద్ద ఇంకా 35 కోట్ల పాత గోనె సంచులు పెండింగ్‌లో ఉన్నాయని గుర్తించిన కమిషనర్, రబీ కొనుగోళ్లకు ఇబ్బంది లేకుండా వెంటనే 10 కోట్ల సంచులను జిల్లా మేనేజర్లకు తిరిగి ఇవ్వాలని మిల్లర్లను ఆదేశించారు. అంతే కాకుండా, 202526 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లెక్కలను అధికారులు ఖరారు చేశారు. 10 శాతం నూకలు మినహాయింపుతో కలుపుకుని, 5.22 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నుండి 3.5 లక్షల మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) కేటాయింపుకు ఆమోదం తెలిపారు.

## ఆరు గ్యారంటీల అమలు మోసాన్ని అసెంబ్లీలో ఎండగడతాం : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, ఈ బాకీ కార్డుల మోసాన్ని అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు స్పష్టం చేశారు. బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో శుక్రవారం గన్ పార్క్ వద్ద ఉన్న అమరవీరుల స్తూపం వద్ద బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భారీ నిరసన చేపట్టారు. మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్ రావు నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ 1.58 కోట్ల మంది మహిళలకు ఇస్తామన్న రూ. 2,500 నెలవారీ భృతి ఏమైందన్నారు. వృద్ధులకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000 హామీ ఏమైంది? ఇప్పటివరకు ఒక్కొక్కరికి రూ. 54,000 బాకీ పడ్డారన్నారు. రూ. 15,000 రైతు భరోసా ఇవ్వకపోగా, పాత రైతుబంధును కూడా అమలు చేయడం లేదని తెలిపారు. 2 లక్షల ఉద్యోగాల హామీ ఇచ్చి, కేవలం 11,900 ఉద్యోగాలతో యువతను మభ్యపెడుతున్నారన్నారు. జేమ్స్ బాండ్‌ల మాదిరిగా బాండ్ పేపర్లు రాసిచ్చి, ఇప్పుడు ఆ హామీలను నీటి మూటలు చేశారని కెటిఆర్ విమర్శించారు. బడ్జెట్‌లో గ్యారంటీలకు నిధుల కేటాయింపు లేదని, అసెంబ్లీలో ప్రతి అడుగునా ప్రజల తరపున పోరాడతామని హెచ్చరించారు.

# భారతదేశం తటస్థ వైఖరి అవలంబిస్తుందా?

## ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ



ప్రజాపక్షం/చార్మినార్: భారతదేశం నిజంగా తటస్థ వైఖరిని అవలంబించి ఉంటే.. ప్రపంచవ్యాప్తంగా దాని వాణికి మరింత ప్రభావం ఉండేదని ఏఐఎంఐఎంఅధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న సమయంలోనే ప్రధానమంత్రి ఇజ్రాయెల్ పర్యటన జరిగిందని.. ప్రధాని పర్యటన సమయాన్ని ఆయన ప్రశ్నించారు. రంజాన్ చివరి శుక్రవారం సందర్భంగా చారిత్రాత్మక మక్కా మసీదులో జరిగిన జల్సాయొమ్-ఉల్‌ఖురాన్లో అసద్ ప్రసంగించారు. గల్ఫ్ దేశాలలో దాదాపు కోటి మంది భారతీయులు నివసిస్తూ పనిచేస్తున్నారని, దేశ విదేశీ మారక ద్రవ్య రాబడిలో సుమారు 50 శాతం వారే అందిస్తున్నారని వివరించారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో వారి సంక్షేమానికి తగినంత శ్రద్ధ చూపుతున్నారా? అని ఆయన ప్రశ్నించారు. భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు కేవలం 9 రోజులకు మాత్రమే సరిపోతాయని.. రవాణా సవాళ్ల కారణంగా పండ్లు, బాస్మతి బియ్యంతో సహా పలు ఎగుమతులకు అంతరాయం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థికపరమైన విభజన పిలుపులను ఆయన విమర్శించారు. ఇటీవలి ఘటనలపై స్పందిస్తూ, గంగానదిలో పడవలో నిరాహార దీక్ష విరమించినందుకు 11 మందిపై కేసులు నమోదు చేయడం అన్యాయమైన, వివక్షాపూరితమైన చర్యగా ఖండించారు. ఇటువంటి చర్యలు పక్షపాతంతో కూడుకున్నవని.. చట్టం ముందు అందరికీ సమాన అవకాశాలు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పరిపాలన, శాంతిభద్రతల విషయానికి వస్తే, విద్యావంతులైన యువతలో నిరుద్యోగంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పట్టభద్రులలో దాదాపు 67 శాతం మంది నిరుద్యోగులుగా ఉన్నారని.. పశువులు, గేదెల రవాణాను ప్రభావితం చేసే ఆంక్షలను ఆయన విమర్శిస్తూ జీవనోపాధిపై వాటి ప్రభావంపడుతుందన్నారు. న్యూఢిల్లీలోని ఉత్తమ్‌నగర్‌లో ముస్లింలు తమ ఈద్ పండుగను స్వేచ్ఛగా జరుపుకోవడానికి కోర్టులను ఆశ్రయించాల్సి వస్తోందని, ఇది ఆందోళనకరమైన పరిణామమని ఆయన వ్యాఖ్యానించారు. సామాజిక సూచికలను ప్రస్తావిస్తూ, గుజరాత్‌లో అక్షరాస్యత రేటు 69 శాతం కాగా, లక్షద్వీప్‌లో 75 శాతం అక్షరాస్యత నమోదైందని పేర్కొన్నారు. గుజరాత్‌లో గణనీయ సంఖ్యలో మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని.. గృహ వివక్షపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముస్లింలకు ఆస్తులు అమ్ముకోవడానికి అనుమతి ఉండగా, హిందువులు ముస్లింలకు ఆస్తులు అమ్మడంపై ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తూ, ఇలాంటి నేపథ్యంలో ఉమ్మడి పౌర స్మృతి కోసం చేస్తున్న ప్రయత్నాన్ని ఆయన ప్రశ్నించారు.

## రంజాన్ ఏర్పాట్లు

### చార్మినార్ జెడ్‌సీ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం

ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట : రంజాన్ పండుగ సందర్భంగా పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చార్మినార్ జెడ్‌సి సోలిపేట శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మక్కా మసీదులో నిర్వహించిన సామూహిక ప్రత్యేక ప్రార్థనలను పురస్కరించుకొని వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి చార్మినార్ పరిసరాల్లో పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, చెత్త తొలగింపు ఏర్పాట్లపై అధికారులతో ఆరా తీశారు. రంజాన్ సందర్భంగా చెత్త పేరుకుపోకుండా ఉండేలా పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. జెడ్‌సీ వెంట చార్మినార్ డీసీ సరిత, ఇంజినీరింగ్ విభాగం ఈఈ సన్నావుద్దీన్, శానిటేషన్ విభాగం డిఈ శ్రీరాములు, ఏఈలు, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.



## చురుగ్గా యాక్షన్ ప్లాన్ అమలు

ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన పట్టణ ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ జెడ్‌సీ మంద మకరంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కార్యక్రమంపై జోనల్ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా వాల్ టు వాల్ 9.30 గంటల వరకు స్వచ్ఛదనం, పరిశుభ్రత పూర్తి చేయాలని.. అన్ని వానిజ్యపరమైన దుకాణాలు ట్విన్‌బిన్ సిస్టంని ఉపయోగించేలా చూడాలని ఆదేశించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/కంటోన్మెంట్: సిఎం సహాయనిధి ద్వారా ఎంతో మంది ప్రాణాలను రక్షించడం జరుగుతోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఎమ్మెల్యే శ్రీగణేష్ పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నియోజకవర్గంలోని 62 కుటుంబాలకు వైద్య సహాయానికి సంబంధించి మంజూరు అయిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

## శ్రీరామనవమి శోభాయాత్ర రూట్‌మ్యాప్



ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట: ఈనెల 27వ తేదీన జరగబోయే శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం వేడుకల్లో భాగంగా శ్రీరామనవమి శోభాయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్, పూర్తి వివరాలను నిర్వాహకులు విడుదల చేశారు. ఉప్పుగూడ నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర ఛత్రినాక, లాల్‌ధర్వాజా సింహ వాహిని మహంకాళి దేవాలయం రోడ్డుగా ముందుకు సాగుతూ లాల్ ధర్వాజా క్రాస్ రోడ్డు మీదుగా షా అలీబండ పిస్తా హౌస్ ముందు నుంచి చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వరకు సాగుతుంది. ఈ యాత్ర భక్తి శ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకునేందుకు అందరు సహకరించాలని శోభాయాత్ర నిర్వాహకుడు తాడెం శ్రీనివాసరావు కోరారు. ఈ సందర్భంగా శోభాయాత్రకు సంబంధించిన రూట్ మ్యాప్ వివరాలను డీసీపీ ఖరే కిరణ్ ప్రభాకర్‌కు అందించడం జరిగింది.

## మ్యాన్‌హోల్ కవర్ల మాయాజాలం?



ప్రజాపక్షం/చార్మినార్: పాతబస్తీలోని పలుప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మ్యాన్‌హోల్ కవర్లు వారాల వ్యవధిలోనే శిథిలం అవుతున్నాయి. ఈ క్రమంలోనే గౌలిపురా డివిజన్ పరిధిలోకి వచ్చే హనుమాన్‌నగర్‌లోని వర్షం నీటి కాలువలకు కవర్స్ మూడు నెలలకు ఒకసారి కొత్తవి వేయాల్సి వస్తున్నది. నాణ్యత లేని కవర్ల కారణంగానే తరచుగా మార్చాల్సి వస్తుందని స్థానికులు మండిపడుతున్నారు. ఇంజినీరింగ్ వ్యవస్థపై సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించిన కారణంగానే ఇటువంటి వృథా ఖర్చు పెరుగుతోందని స్థానికులు వాపోతున్నారు. ఇకనైనా చార్మినార్ జెడ్‌సి స్పందించి ఇంజినీరింగ్ విభాగం పనితీరుపై సమీక్ష చేయాలని సిపిఐ సీనియర్ నాయకుడు చంద్రమోహన్ కోరారు.

## బోటానికల్ గార్డెన్స్‌లో ఘనంగా ప్రపంచ పిచ్చుకల దినోత్సవం



ప్రజాపక్షం/హైదరాబాద్. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బోటానికల్ గార్డెన్‌లో శుక్రవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డివిజనల్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం కె. శిరీష మాట్లాడుతూ 'పిచ్చుకలు చిన్నవి కానీ ముఖ్యమైన పక్షులు, ఇవి పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి అని అన్నారు. అవి వివిధ కీటకాలు, తెగుళ్ళను తినడం ద్వారా కీటకాల జనాభాను నియంత్రించడంలో సహాయపడతాయన్నారు. అదనంగా, పిచ్చుకలు పరాగసంపర్కం, విత్తనాల వ్యాప్తిలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. వాటి ఉనికి జీవవైవిధ్యాన్ని పెంచుతుంది, గ్రామీణ, పట్టణ పర్యావరణ వ్యవస్థల ఆరోగ్యానికి వాటిని కీలకమైనదిగా చేస్తుందని వివరించారు. వాకర్స్‌తో పాటు సందర్శకులులతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ పిచ్చుక గూడ్లు తయారు చేసి వాటితో సెల్ఫీ దిగి ఇంటికి తీసుకెళ్లారు. ఎండాకాలం మొదలవడం తో పక్షుల దాహం తీర్చడం కోసం మట్టి పాత్రలు అందరికి ఇచ్చి వాటిలో నీళ్లు నింపి బోటానికల్ గార్డెన్ లో వివిధ చెట్టు నీడ వున్న ప్రదేశాలలో ఉంచడం జరిగింది. ఇందులో పిల్లలు పెద్దలు అందరూ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ మేనేజర్,అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం కె. శిరీష, ప్లాంటేషన్ మానేజర్ లక్ష్మారెడ్డి, రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు, ప్రాజెక్ట్స్ మానేజర్ సుమన్, డి.ఆర్. ఒ. శ్రీనివాసు రెడ్డి, నేచురలిస్ట్ శాంసన్ రాజు, వాకర్స్ సెక్రటరీ బాలకృష్ణ, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.



## సమ్మోహనం స్వరం ఉషశ్రీ

### ద్రావిడ యూనివర్సిటీ మాజీ వీసీ కొలకనూరి ఇనాక్

ప్రజాపక్షం/త్యాగరాయగానసభ: సమ్మోహన స్వరం ఉషశ్రీ అని ద్రావిడ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. ఉషశ్రీ యాదిలో పేరిగ జరిగిన సాహితీ సభలో ఇనాక్ పాల్గొని ప్రసంగించారు. సామాన్యులకు కూడా ఆధ్యాత్మిక రహస్యాలను అందించిన వెలుగు ఉషశ్రీ అన్నారు. ఉషశ్రీ ప్రసంగాలు, రచనలు శాశ్వతంగా నిలిచిపోతాయని తెలిపారు. కార్యక్రమంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, జర్నలిస్ట్ ద్రోణంరాజు శ్రీరామ్, సమాజ సేవకుడు రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టికెట్ తనిఖీలో రికార్డు రూ. 223.60 కోట్ల ఆదాయం



ప్రజాపక్షం/హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే 2025–26 ఆర్థిక సంవత్సరంలో టికెట్ తనిఖీ ప్రక్రియలో రూ.223.60 కోట్ల రికార్డు ఆదాయాన్ని నమోదు చేసి ఒక ప్రధాన మైలురాయిని సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రైల్వే బోర్డు నిర్దేశించిన రూ.221.08 కోట్ల లక్ష్యాన్ని, సంవత్సరం ముగియడానికి 14 రోజుల ముందే ఈ జోన్ అధిగమించింది. ఏ ఆర్థిక సంవత్సరంలోనైనా టికెట్ తనిఖీ ద్వారా వచ్చిన అత్యధిక ఆదాయం ఇదే. ఇంతకు ముందు 2023–24 సంవత్సరంలో రూ.220.81 కోట్ల ఆదాయం అత్యుత్తమంగా నమోదైంది. టికెట్ లేని ప్రయాణం, ముందుగా బుక్ చేయని లగేజీ మొదలైన వాటిపై నమోదైన కేసుల ద్వారా ఈ ఆదాయం ఆర్జించబడింది. ఈ జోన్ ప్రస్తుత సంవత్సరంలో, 2025 అక్టోబర్ 18న ఒకే రోజులో టికెట్ తనిఖీ ద్వారా రూ.1.85 కోట్ల రికార్డు ఆదాయాన్ని కూడా ఆర్జించింది. రైల్వేలలో టిక్కెట్ల తనిఖీ అనేది, టిక్కెట్టు లేని, సరైన ఆధారాలు లేకుండా చేసే ప్రయాణాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇది అలవాటుగా ప్రతినిత్యం టిక్కెట్లు లేకుండా ప్రయాణం చేసేవారిని నిరోధిస్తూ, బుకింగ్ విండోల ద్వారా టిక్కెట్ల అమ్మకాలు పెరగడానికి దోహదపడుతుంది. రైలు ప్రయాణంలో అధీకృత టిక్కెట్ లేదా ప్రయాణ పత్రం కలిగి ఉండటం యొక్క ప్రాముఖ్యత గురించి సాధారణ ప్రజలలో అవగాహన కల్పించడానికి కూడా ఇది సహాయపడుతుంది. అంతేకాకుండా టిక్కెట్ల తనిఖీ చెల్లుబాటు అయ్యే టిక్కెట్లతో ప్రయాణించడంలో ఉండే సౌలభ్యం మరియు సౌకర్యం గురించి ప్రయాణికులకు మార్గనిర్దేశం చేయడానికి, అవగాహన కల్పించడానికి కూడా తోడ్పడుతుంది.

## గంటల వ్యవధిలోనే ప్రహరీ నిర్మాణం



ప్రజాపక్షం/చార్మినార్: చారిత్రక సిటీకాలేజ్ ప్రహరీకి మరమ్మత్తులు చేపట్టారు. ప్రజాపక్షం దినపత్రికలో 'ప్రహరీ కూలిన సిటీ కాలేజ్‌పై దృష్టి సారించరా' శీర్షికతో ప్రచురితమైన కథనంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ప్రహరీ పునరుద్ధరణ పనులు చేపట్టారు. ఈ మేరకు కూలిన ప్రహరీ విషయంలో కథనం ప్రచురించిన ప్రజాపక్షం పత్రికకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. అంతేకాకుండా మరమ్మత్తులు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఐఎన్‌టిఎసిహెచ్ గవర్నింగ్ మెంబర్‌గా వేదకుమార్

ప్రజాపక్షం/చిక్కడపల్లి: ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ సంస్థకు(న్యూఢిల్లీ) నాలుగో పర్యాయం గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికల్లో అత్యధిక ఓట్లతో కౌన్సిల్ సభ్యునిగా వేదకుమార్ ఎన్నికయ్యారు. మూడు సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. స్మారక చిహ్నాలు, చారిత్రక భవనాలు పరిరక్షణ, సాంస్కృతిక సహజ వారసత్వ ప్రదేశాలను గుర్తించడం, యూనెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాలను అధ్యయనం చేయడం, సదస్సులు నిర్వహిస్తూ నాలుగు దశాబ్దాలుగా వేద కుమార్ సేవలను అందిస్తున్నారు.

# క్రీడలకు రూ.500 బడ్జెట్ కేటాయింపు

### సిఎం చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాపక్షం/హైదరాబాద్: సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అత్యధిక ప్రాధాన్యత లభిస్తుందని దానికి నిదర్శనమే బడ్జెట్లో అత్యధిక కేటాయింపులు జరుగుతున్నాయని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి బడ్జెట్లో రూ.500 కోట్లు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఎల్‌బిస్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు క్రీడాకారులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ, సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు ఎనలేని ప్రాధాన్యత లభిస్తోందని, పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో క్రీడలకు మొత్తం కలిపి 150 కోట్లు కేటాయింపులు కూడా సరిగా జరగలేదని, కానీ సీఎం రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మొదటి సంవత్సరం 360 కోట్లు రెండవ సంవత్సరం 4 26 కోట్లు మూడవ బడ్జెట్లో 646 కోట్లు కేటాయింపులు జరగడం హర్షనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు సుజాత రవీందర్ స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు రవికుమార్, గోకుల్, మధు పిఆర్‌ఓ కాలేరు సురేష్ ఎల్‌బి స్టేడియం కోచ్లు సిబ్బంది క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పేద ముస్లింలకు రంజాన్ తోఫాలు

ప్రజాపక్షం/సికింద్రాబాద్: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని పేద ముస్లింలకు రంజాన్ తోఫాలను పంపిణీ చేయడం జరిగింది. మెట్టుగూడలో జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గం ఇంచార్జి ఆదం సంతోష్ కుమార్ సూచన మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ సామాజికవేత్త ర్యాల రాజేందర్‌యాదవ్ ఈద్ ఖా తోఫా కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాళ్లు జాహేదా బేగం, ఆషా, భరణి, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

# 23న ఢిల్లీలో బిసిల మహాధర్నా

### జాతి జనగణలో బిసి కుల గణన చేపట్టాలి: జాజుల శ్రీనివాస్ గౌడ్



ప్రజాపక్షం/హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఏప్రిల్ ఒకటో తేదీ నుండి మొదలుకానున్న జాతి జనగణనలో బిసి కులగనన చేపట్టాలనీ, తెలంగాణ రాష్ట్రంలో చేసిన బిసి రిజర్వేషన్ల చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 23న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాదర్నా చేపట్టనున్నట్లు బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌లోని హోటల్ అభినంద్ గ్రాండ్‌లో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ అధ్యక్షుతన శుక్రవారం బిసి కుల సంఘాల ముఖ్యమైన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిసిల ఛలో ఢిల్లీ మహాదర్నా కార్యక్రమం సంబందించిన వాల్ పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. అనంతరం జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా జాతీ జనగణన చేపడుతుందని, ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలు ఎన్ని అని అడిగిన కేంద్ర ప్రభుత్వం, బిసి కుటుంబాల సంఖ్యను విస్మరించడం చాలా బాధాకరమన్నారు. అలాగే బిసిలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్ల పెంపు బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి కుల సంఘాల నేతలు భారీగా పాల్గొన్నారు.

## దేశవ్యాప్త వాహనాల సమాచారం ఒకే చోట

### 23న 'వాహన్ పోర్టల్' ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు పారదర్శక, వేగవంతమైన, సులభమైన సేవలను అందించేందుకు 'వాహన్ పోర్టల్'ను ఈ నెల 23న ప్రారంభించనున్నట్లు రవాణా శాఖ ఒక ప్రకటన లో తెలిపింది. ఈ పోర్టల్‌ను రవాణా, బిసి సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభిస్తారని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహన్ పోర్టల్ ద్వారా దేశ వ్యాప్త వాహనాల సమాచారం ఒకే చోట లభ్యమౌతుందని, వాహన్‌తో అనుసంధానం వల్ల తెలంగాణకు చెందిన వాహనాలు జాతీయ డాటా బేస్‌లోకి వెళ్ళనున్నాయని పేర్కొన్నారు. అంతే కాకుండా రెండవ వాహనాలకు వర్తించే అదనపు 2 శాతం జీవితకాలపు పన్నును ప్రభుత్వం రద్దు చేసిందని, 23వ తేదీ నుండి అమల్లోకి వస్తుందని తెలిపారు.

# పొరపాట్లు సవరించాకే అవార్డు జారీ

### భూసేకరణలో సమంజసమైన పరిహారం : డిఆర్‌ఒ వెంకటాచారి





ప్రజాపక్షం/సిటీ బ్యూరో : ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణలో సమంజసమైన నష్టమైన పరిహారం అందేలా చూస్తామని హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారి ఈ.వెంకటాచారి తెలిపారు. జిల్లా కలక్టరేట్ సమావేశ మందిరంలో 44వ జాతీయ రహదారిపై పారడైజ్ జంక్షన్ నుంచి డైరీ పార్కు వరకు చేపట్టనున్న ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి అందించే భూసేకరణ పరిహారంపై సంబంధిత భూయజమానులతో ఆయన డిఎల్‌ఎన్‌సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థలాలు కోల్పోతున్న కుటుంబాల వారి పేరు,స్థలం వివరాలు వంటి విషయాలలో పొరపాట్లను సవరించాకే భూసేకరణకు అవార్డు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఈవిషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. భూయజమానులకు చెందిన ప్రతి గుంట, ప్రతి సెంటుకు ప్రభుత్వం నిర్ణయించిన మేర పరిహారం అందుతుందన్నారు. ఈ సమావేశంలో భూయజమానులు లేవనెత్తిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటి కలెక్టర్( ల్యాండ్ ప్రొటెక్షన్)టి.రవి, హెచ్‌ఎండిఎ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ వై.సుదర్శన్, భూయజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌ఎస్‌ఎల్ నియామక ఫలితాలు విడుదల

### టిఎస్‌ఎల్‌పిఆర్‌బి చైర్మన్ వివి శ్రీనివాసరావు



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ లో ఖాళీగా ఉన్న వివిధ విభాగాల పోస్టుల భర్తీ ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక బోర్డు చైర్మన్ వివి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 నవంబర్ 14న జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా మొత్తం 60 పోస్టులకు గాను 59 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థుల అకడమిక్ మార్కులు, పని అనుభవం, రాత పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయని, ఎంపికైన వారు ఈ నెల 23 నుండి 25వ తేదీ వరకు వెబ్‌సైట్‌లో అటెస్టేషన్ ఫారాలను పూర్తి చేసి, మార్చి 30న హైదరాబాద్‌లోని పెట్లబుర్జ్ సిటీ ఆర్మ్డ్ రిజర్వ్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

# భారత్‌లో వరల్డ్ ఇండోర్ అథ్లెటిక్స్




**న్యూఢిల్లీ:** భారత్ మరో ప్రతిష్ఠాత్మక క్రీడాటోర్నీకి ఆతిథ్యమివ్వబోతున్నది. ఇప్పటికే 2030 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులు దక్కించుకున్న భారత్ తాజాగా 2028 వరల్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్షిప్ టోర్నీకి వేదిక కాబోతున్నది. గురువారం టూరన్(పోలండ్) వేదికగా జరిగిన వరల్ అథ్లెటిక్స్ కౌన్సిల్ మీటింగ్లో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని వరల్ అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు అదిల్లె సుమరివాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే మెగాటోర్నీకి ఆతిథ్యమివ్వనున్న భువనేశ్వర్లో కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్టేడియం కాంప్లెక్సును ఇద్దరు సభ్యులతో కూడిన వరల్ అథ్లెటిక్స్ బృందం పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

రెండేండ్ల తర్వాత జరిగే టోర్నీలో మొత్తం 26 ఈవెంట్లలో అథ్లెట్లు పోటీపడనున్నారు. పురుషులకు 13, మహిళలకు 13 విభాగాల చొప్పున కేటాయించారు. ఇందులో 60మీ, 400మీ, 800మీ, 1500మీ, 3000మీ, 60మీ హార్డిల్స్, 4X 400 రిలే, హైజంప్, పోల్వాల్ట్, లాంగ్జంప్, ట్రిపుల్ జంప్, షాట్పుట్, హెప్టాథ్లాన్కు చోటు కల్పించారు. దేశంలో అథ్లెటిక్స్కు పెరుగుతున్న ఆదరణకు ఇది ఉదాహరణ అని జాతీయ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏఎఫ్ఐ) అధ్యక్షుడు బాహదూర్సింగ్ తెలిపారు. ఇదిలా ఉంటే 2028 ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ టోర్నీకి కూడా భారత్ వేదికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## సెలెక్టర్‌గా అగార్కర్ పదవీ కాలం పొడిగింపు!



భారత పురుషుల క్రికెట్ చీఫ్ సెలెక్టర్‌గా అజిత్ అగార్కర్ పదవీ కాలం త్వరలోనే ముగియనుంది. దాంతో, అతడు తనను మరికొన్ని రోజులు కొనసాగించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలిని కోరినట్టు వార్తలు వస్తున్నాయి. వచ్చే వన్డే ప్రపంచకప్ వరకూ తనకు పొడిగింపు ఇవ్వాలని అగార్కర్ విజ్ఞప్తి చేసినట్టున్న కథనాలు వస్తున్నాయి. ఇదే విషయంపై కొందరు బిసిసిఐని సంప్రదించగా.. అదేం లేదని కొట్టిపారేసింది. చీఫ్ సెలెక్టర్‌గా వస్తూనే తనదైన ముద్ర వేసిన అగార్కర్ అనతికాలంలోనే ఫలితాలను చూపించారు. నిర్మొహమాటంగా సీనియర్లకు చెక్ పెట్టి.. ప్రతిభావంతులైన కుర్రాళ్లకు అవకాశమిచ్చిన అతడు.. టీమిండియాను ఛాంపియన్‌గా నిలిపాడనడంలో సందేహం లేదు. అయితే.. ఈ క్రమంలో ఎన్నో విమర్శలకు అతడు బలయ్యాడు. అయినా సరే నేనింతే అన్నట్టుగా ముందుకు సాగుతున్న అగార్కర్ పదవీ కాలం మరో ఆరు నెలల్లో ముగియనుంది. 'బిసిసిఐతో అగార్కర్ మాట్లాడారు. అయితే.. తన పదవీ కాలం పొడిగించాలని మాత్రం అతడు అడుగలేదు. సెలెక్షన్ కమిటీ అనేది బిసిసిఐలో ఒక సబ్ కమిటీ. ఈ ఏడాది సెప్టెంబర్ వరకూ సెలెక్టర్ల కాంట్రాక్ట్ వర్తిస్తుంది. అజిత్ అగార్కర్ కాంట్రాక్ట్ సైతం సెప్టెంబర్‌లోనే ముగుస్తుంది. మాజీ పేసరైన అగార్కర్ 2014లో చీఫ్ సెలెక్టర్‌గా ఎంపికయ్యారు. అతడి బృందంలో ఎస్ఎస్ దాస్, ఆర్పీ సింగ్, అజయ్ రత్రా, ప్రజ్ఞాన్ ఓఝాలు ఉన్నారు. అగార్కర్ చీఫ్ సెలెక్టర్గా వచ్చినప్పటి నుంచి భారత జట్టు ఐసీసీ టోర్నీల్లో అదరగొట్టింది. టీ20 వరల్డ్‌కప్, ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్ కొల్లగొట్టిన టీమిండియా.. తాజాగా స్వదేశంలో టి–20 ప్రపంచకప్ గెలుపొందింది.

## ఓడిపోయానంటే నమ్మలేకపోతున్నా!



మహిళల టెన్నిస్‌లో మరో సంచలనం. ఒకప్పుడు వరల్ నంబర్ 1గా స్వియాటెక్ మియామి ఓపెన్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. శుక్రవారం జరిగిన ఓపెనింగ్ మ్యాచ్‌లో ఈ టాప్ సీడ్ అనూహ్యంగా ఓటమి పాలైంది. రెండు గంటల 10 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో పోలె మగ్ద లినెట్టే చేతిలో స్వియాటెక్ చిత్తైంది. ఫేవరెట్‌గా ఇంటర్ మియామి ఓపెన్‌లో బరిలోకి దిగిన ఇగా స్వియాటెక్కు భారీ షాక్ తగిలింది. తొలి రౌండ్లోనే ఘోర పరాజయం చవిచూసింది మూడో ర్యాంకర్. 50వ ర్యాంకర్ పోలె మగ్ద లినెట్టే తొలి సెట్ నుంచి జోరు చూపించి 6–1, 5–7, 6–3తో స్వియాటెక్కు చెక్ పెట్టింది. దాంతో, డబ్ల్యూటీఏ టూర్లో తొలి రౌండ్లో 7–3 విజయాల రికార్డుకు బ్రేకు వేసింది. ఊహించని పరాజయం అనంతరం మాట్లాడుతూ.. 'నేను ఓడిపోయానంటే నమ్మబుద్ధి కావడం లేదు. రాను రాను టెన్నిస్ ఆట కష్టంగా అనిపిస్తోంది . ఈ ఆట చాలా తేలిక అనుకున్నా. కానీ, కోర్టులో మానసికంగా మనం ఎలా ఉంటామనేది చాలా కీలకం. ఇది నాకొక చెత్త మ్యాచ్. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటా. మళ్లీ నా పనిలో మునిగిపోతా. ప్రాక్టీస్ చేస్తాను. పాజిటివ్గా ఆలోచిస్తూ.. నా ఆటను మెరుగుపరచుకుంటా' అని స్వియాటెక్ చెప్పింది.

## సైన్స్

### ఒకే ఫ్రేమ్‌లో భూమి..చంద్రుడు



మనుషులు ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం ప్రారంభించిన తర్వాత విశ్వాన్ని చూసే మన దృష్టి మారిపోయింది. భూమి మీద నిలబడి చూస్తే ఆకాశం ఒక విధంగా కనిపిస్తుంది. కానీ భూమికి వేల కిలోమీటర్ల ఎత్తులో ఉన్న ఉపగ్రహాల నుంచి చూస్తే అదే విశ్వం పూర్తిగా భిన్నంగా కనిపిస్తుంది. అలాంటి అరుదైన దృశ్యం ఇటీవల నమోదైంది. ఆరోజు భూమి మరియు చంద్రుడు ఒకే ఫ్రేమ్‌లో కనిపించిన అద్భుత చిత్రం నమోదైంది. ఈ ఉపగ్రహం భూమి ఉపరితలం నుంచి సుమారు 35,786 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న 'జియో స్టేషనరీ ఆర్బిట్'లో పరిభ్రమిస్తుంది. ఈ కక్ష్యలో ఉన్న ఉపగ్రహాలు భూమి భ్రమణ వేగంతోనే తిరుగుతాయి. అందువల్ల అవి భూమిపై ఒకేప్రాంతం మీద స్థిరంగా ఉన్నట్లు కనిపిస్తా యి. ఈ కారణంగా వాతావరణ పరిశీలనకు ఇవి అత్యంత ఉపయోగకరంగా ఉంటా యి. సాధారణంగా ఈ ఉపగ్రహాలు మేఘాల కదలికలు, తుఫానులు, వర్షపాతం వంటి వాతావరణ మార్పులను గమనిస్తాయి. కానీ ఈ సారి నమోదైన దృశ్యం వాతావరణ పరిశీలనతో సంబంధం లేనిది. ఉపగ్రహం కెమెరా ముందుగా భూమి కనిపిస్తూనే ఉండగా, అదే దిశలో చంద్రుడు కూడా ప్రవేశించి ఒకే ఫ్రేమ్‌లో కనిపించాడు.


చంద్రుడి కక్ష్య భూమి కక్ష్యకు పూర్తిగా సరిపోలదు. అదిసుమారు ఐదు డిగ్రీల వంపుతో ఉంటుంది. అందువల్ల చాలా సందర్భాల్లో ఉపగ్రహం నుంచి చూస్తే చంద్రుడు భూమి వెనుక భాగంలో లేదా పక్కకు వెళ్లిపోతాడు. కానీ కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం భూమి, చంద్రుడు, ఉపగ్రహం ఒకే రేఖలో ఉండేలా ఏర్పడతాయి. అప్పుడు ఇలాంటి అరుదైన దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ఈ చిత్రంలో భూమి అద్భుతంగా కనిపిస్తుంది. భూమి అంచు చుట్టూ ఒక పలుచని నీలి వలయం కనిపిస్తుంది. అదే మన వాతావరణం. ఆ పలుచని పొరలోనే జీవానికి అవసరమైన గాలి ఉంటుంది. భూమి ఉపరితలం పెద్ద భాగం నీలంగా కనిపించడం సముద్రాల వల్లే ఈ అద్భుతం సాధ్యమవుతుంది. ఈ దృశ్యంలో చంద్రుడిపై ఉన్న పెద్ద గుంతలు, మైదానాలు కూడా కొంతవరకు కనిపిస్తాయి. అంతరిక్షం నుంచి చూస్తే అది ఒక చిన్న నీలి గోళంలా కనిపిస్తుంది. ఆ గోళంలోనే సముద్రాలు, పర్వతాలు, నగరాలు, మనుషుల నాగరికత అన్నీ ఉన్నాయి.

### చంద్రుడి అధ్యయనానికి స్టార్‌షిప్



మనుషులు రాకెట్లు తయారు చేయడం ప్రారంభించినప్పటి నుంచి ప్రతి ప్రయోగం అంతరిక్ష పరిశోధనలో ఒక ముందడుగే. అయితే కొన్నిసార్లు జరిగే పరీక్షలు మాత్రం కొత్త యుగానికి సంకేతంగా కనిపిస్తాయి. ఈనెల 13న జరగాల్సి ఉండగా, తుది క్షణాల్లో వాయిదా పడిన ఒక ముఖ్యమైన అంతరిక్ష పరీక్ష అలాంటిదే. ఇది కొత్త తరహా భారీ రాకెట్ వ్యవస్థకు సంబంధించినది. ఆ వ్యవస్థ పేరు స్టార్‌షిప్. దీనిని అభివృద్ధి చేస్తున్న సంస్థ స్పేస్ఎక్స్. ఈ పరీక్ష సాధారణ రాకెట్ ప్రయోగంలా కనిపించినా దాని వెనుక ఉన్న లక్ష్యం చాలా పెద్దది. భవిష్యత్తులో చంద్రుడిపై మానవ స్థావరాలు నిర్మించడం, అలాగే మరింత దూరంగా వెళ్లి కుజుడు(మార్స్) వరకు మనుషులను పంపడం వంటి దీర్ఘకాల ప్రణాళికలకు ఇది కీలకమైన సాంకేతిక వ్యవస్థగా భావిస్తున్నారు. స్టార్‌షిప్ నిజానికి ఒకే రాకెట్ కాదు. ఇది రెండు ప్రధాన భాగాలతో కూడిన భారీ ప్రయోగవాహనం. దిగువ భాగం భారీ బూస్టర్, దీనిని సూపర్ హెవీ బూస్టర్ అంటారు. పైభాగంలో ఉండే అంతరిక్ష నౌకే అసలైన స్టార్‌షిప్. ఈ రెండు భాగాలు కలిసి భారీ బరువులను భూమి కక్ష్యలోకి పంపగలుగుతాయి. సూపర్‌హెవీ బూస్టర్‌లో మొత్తం 33 రాప్టర్ ఇంజన్లు ఉంటాయి. ఇవి ద్రవ మీథేన్ మరియు ద్రవ ఆక్సిజన్‌ను ఇంధనంగా ఉపయోగిస్తాయి. అన్ని ఇంజిన్లు ఒకేసారి పనిచేసినప్పుడు ఆకాశంలో భారీ అగ్ని స్తంభంలా కనిపించే జ్వాలలు ఏర్పడతాయి. ఈ వ్యవస్థలో అత్యంత ముఖ్యమైన లక్షణం పునర్వినియోగ సామర్థ్యం. సాధారణంగా రాకెట్లు ఒకసారి ప్రయోగించిన తర్వాత సముద్రంలో పడిపోతాయి లేదా నశిస్తాయి. కానీ స్టార్‌షిప్ వ్యవస్థ ను పూర్తిగా మళ్లీ ఉపయోగించుకునేలా రూపొందిస్తున్నారు. ప్రయోగం తర్వాత బూస్టర్ తిరిగి భూమిపై దిగుతుంది. ప్రయోగ స్థలంలో ఉన్న భారీ టవర్, అనధికారికంగా మెకాజిల్లా లాంచ్ టవర్ అని పిలిచే నిర్మాణం, బూస్టర్‌ను గాల్లోనే పట్టుకునే విధంగా రూపొందించారు. ఈ పరీక్షలో ప్రధాన లక్ష్యం స్టార్‌షిప్‌ను భూమి యొక్క తక్కువ కక్ష్యలోకి పంపడం.

### సూర్యుడి చెంతకు బుధుడు.



సూర్యాస్తమయం తర్వాత ఆకాశాన్ని గమనిస్తే అనేక ప్రకాశ బిందువులు కనిపిస్తాయి. వాటిలో చాలా నక్షత్రాలు కాగా, కొన్ని గ్రహాలు. అయితే వీటిలో ఒకటి చాలా అరుదుగా మాత్రమే కనిపిస్తుంది. అదే సూర్యుడికి అత్యంత దగ్గరగా తిరిగే బుధ గ్రహం (మెర్క్యూరీ) గత వారం ఈ గ్రహం ఒక ప్రత్యేక ఖగోళ స్థితికి చేరుకుంది. ఆ స్థితిని ఖగోళ శాస్త్రంలో 'గ్రేటెస్ట్ ఈస్టర్న్ ఎలొంగేషన్' అంటారు. ఈ సమయంలో మెర్క్యూరీ సూర్యుడి నుండి ఆకాశంలో గరిష్టంగా తూర్పు వైపున దూరంగా కనిపిస్తుంది, అందువల్ల భూమి నుండి దాన్ని గమనించడానికి మంచి అవకాశం లభిస్తుంది. సాధారణంగా మెర్క్యూరీని చూడటం కష్టం. ఇది సూర్యుడికి చాలా దగ్గరగా తిరుగుతుండటం వల్ల ఎక్కువసార్లు సూర్యుడి ప్రకాశంలోనే దాగిపోతుంది. కానీ భూమి, సూర్యుడు, మెర్క్యూరీ మధ్య జ్యామితి కొన్నిసార్లు మారుతుంది. అప్పుడు ఈ గ్రహం సూర్యుడి నుండి కొంత దూరంగా కనిపిస్తుంది. ఈసారి అది సుమారు 18 డిగ్రీల దూరంలో ఉంటుంది. ఖగోళ పరిశీలనలో ఇది ఒక ముఖ్యమైన కోణం, ఎందుకంటే ఈ సమయంలో మెర్క్యూరీ సూర్యాస్తమయం తర్వాత కొద్దిసేపు పడమర ఆకాశంలో కనిపిస్తుంది. మెర్క్యూరీ సౌరవ్యవస్థలో ఒక ప్రత్యేక గ్రహం. ఇది సూర్యుడి చుట్టూ ఒక చుట్టు పూర్తి చేయడానికి కేవలం 88 రోజులు మాత్రమే పడుతుంది. అంటే భూమి ఒక సంవత్సరం పూర్తి చేసేలోపు ఇది దాదాపు నాలుగు సార్లు సూర్యుడిని చుట్టేస్తుంది. దాని కక్ష్య కూడా చాలా అండాకారంగా ఉంటుంది. దీనిని ఖగోళ గణితంలో 'ఎక్సెంట్రిసిటీ' అంటారు. ఈ గ్రహం అంతర్గత నిర్మాణం కూడా విశేషమే. దీని లోపల భారీ లోహ గుండె ఉంటుంది, అందువల్ల దీనిని 'ఐరన్ రిచ్' అని కూడా పిలుస్తారు. మెర్క్యూరీ ఉపరితలం అనేక క్రేటర్లతో నిండి ఉంటుంది. ఇవి కోట్ల సంవత్సరాలుగా పడిన గ్రహశకలాల ఢీకొనడం వల్ల ఏర్పడ్డాయి.

## ఉమ్మడి వరంగల్‌ను విస్మరించిన రాష్ట్ర బడ్జెట్

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాను విస్మరించారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస రావు పేర్కొన్నారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌పై పెట్టిన శ్రద్ధ రాష్ట్ర రెండవ రాజధానిగా హైదరాబాద్ కు దీటుగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని ప్రకటించినప్పటికీ వరంగల్ పై దృష్టి పెట్టలేదని తెలిపారు. వరంగల్ అభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు, కొత్త ప్రాజెక్టులు, పరిశ్రమల ఊసే లేదని తెలిపారు. అలాగే దేవాదుల ఎత్తిపోతల పథకం సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించలేని, పేదల పెన్నిధి అయిన వరంగల్ ఎంజిఎంకు అవసరమైన నిధులు కేటాయించలేదని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన నిరుద్యోగ భృతి అంశాన్ని ప్రస్తావించకుండా మరోసారి గత ప్రభుత్వాల మాదిరిగానే నిరుద్యోగులను మోసం చేశారని తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల అర్హులైన మహిళలకు రూ. 2500 వారి ఖాతాలో జమ చేస్తామన్న హామీ నెరవేర్చలేదని పేర్కొన్నారు. అలాగే రైతులను ఆదుకునేందుకు రైతు భరోసా సకాలంలో అందించడం లేదని తెలిపారు. వరంగల్ నగరంలోని మురికి వాడల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక బడ్జెట్ లో లేదని తెలిపారు.

## యువతకు తీవ్ర అన్యాయం : ఎఐవైఎఫ్




**ప్రజాపక్షం /హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026–27 బడ్జెట్‌లో యువజన రంగానికి తీవ్రమైన అన్యాయం చేసిందని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర ఆరోపించారు. యువతపై ప్రభుత్వానికి బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని వారుఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఎఐవైఎఫ్ సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పెరుగుతున్న నిరుద్యోగం, విద్య పూర్తిచేసిన యువతలో ఉన్న ఆందోళనలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. యువజనానికి జీరో ప్రాధాన్యం – బడ్జెట్‌కు జీరో న్యాయం చేశారని ఎద్దేవా చేశారు. లక్షలాది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలపై స్పష్టత లేదని, నిరుద్యోగ భృతిపై ఒక్క మాట లేదని, కాంట్రాక్ట్ ఉద్యోగాలతో యువత భవిష్యత్తు నాశనం అవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పాలన ఇలాగే కొనసాగితే యువత ఆ పార్టీని ఓడించడం ఖాయమన్నారు. ఈ బడ్జెట్ తీవ్ర నిరాశజనకమైన ఈ బడ్జెట్‌ను నిరసిస్తూ ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువత హక్కుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ టి.సత్యప్రసాద్, మహేందర్, బిజ్జ శ్రీనివాసులు, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై ప్రస్తావన లేదు

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



**ప్రజాపక్షం/కరీంనగర్ :** వార్షిక బడ్జెట్‌లో 5 లక్షల ప్రమాద భీమా, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం,ఉద్యోగులకు ప్రమాద బీమా మంచిదైనప్పటికీ పేదలకు ఇండ్లు,పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. హైదారాబాద్ చుట్టూతనే విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం వివక్షత అవుతుందని, వైద్య రంగానికి 4.2 శాతం నిధులు కేటాయించడం సరైంది కాదని కనీసం 10 శాతం కేటాయించాలన్నారు. కరీంనగర్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రత్యేకించి బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం దారుణమని, ఉత్తర తెలంగాణకే తల మాణికం లాంటి కరీంనగర్లో మానేరు రివర్ ఫ్రంట్, కేబుల్ బ్రిడ్జి పనుల పురోగతికి నిధులు కేటాయించలేదని, జిల్లాలోని ప్రాజెక్టులు, వాటి పరిధిలోని కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం నిరాశపర్చిందన్నారు.

## యువతను విస్మరించిన ప్రభుత్వం

### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రాష్ట్ర బడ్జెట్‌లో యువతను పూర్తిగా విస్మరించారని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం స్పందిస్తూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా యువతకి ఇచ్చిన నిరుద్యోగ భృతి అంశాన్ని ప్రస్తావించకుండా మరోసారి గత ప్రభుత్వాల మాదిరిగానే నిరుద్యోగులను మోసం చేశారన్నారు. అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకే ప్రతినెల అర్హులైన మహిళలకు 2500 రూపాయలు వారి ఖాతాలో జమ చేస్తామన్న హామీ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఈసారి యువతకు మొండి చేయి చూపించిన ప్రభుత్వం యువత కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ప్రధాన రంగాలకు మొండి చేయి

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్రబడ్జెట్‌లో ప్రధాన రంగాలకు మొండి చేయి చూపారని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమం పట్ల రాష్ట్ర బడ్జెట్ అంతగా దృష్టి సారించలేదన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు జరిగే పరిస్థితి కనిపించడం లేదని సురేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పినట్లుగా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని ఈ బడ్జెట్ తర్వాత ఖచ్చితంగా పింఛన్లు పెరుగుతాయని ప్రజలు ఆశించారని కానీ కేటాయింపులు చూస్తే పింఛన్ పెంపుదల లేదన్నారు. ఆర్‌టిసి, కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల తదితర విషయాల్లో ఈ బడ్జెట్‌లో సరైన రీతిలో కేటాయింపులు లేవన్నారు. ఈ బడ్జెట్ వాస్తవానికి విరుద్ధంగా ఉందని సురేష్ తెలిపారు.

## విద్యకు, వైద్యానికి ప్రాధాన్యం లేదు

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విద్యకు 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తుంటే 8 శాతం మాత్రమే కేటాయించారని, ఆరోగ్యానికి 4 శాతం మాత్రమే కేటాయించారని సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ ఆరోపించారు. కొత్తగా ఇందిరమ్మ బీమా పథకం కింద ప్రతి కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు ఇస్తున్నారని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో నైపుణ్యాభివృద్ధిలో ఈ బడ్జెట్ దిశానిర్దేశం చేయలేకపోయిందని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల భర్తీలపై స్పష్టత లోపించిందని ఆయన పేర్కొన్నారు. బడ్జెట్ కేవలం అసెంబ్లీ ప్రసంగాలకి పరిమితం కాకుండా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పడేలా ఉండాలని కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేసేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ తరపున కోరుతున్నామని సుధాకర్ తెలిపారు.

## ఆరు గ్యారెంటీల అమలుపై చిత్తశుద్ధి లేదు

### సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం



**ప్రజాపక్షం/జగిత్యాల :** బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీల అమలుకు నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ పనితీరుపై చిత్త శుద్ధి కొరవడిందని సిపిఐ జగిత్యాల జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం అన్నా రు. గతంలో ఖర్చు చేయని పథకాలకే మళ్లీ నిధులు కేటాయించారు. బడ్జెట్ పేదల పక్షాన పూర్తిగా లేదు. కార్మికులు, రైతులు, నిరుద్యోగ యువత సమస్యలకు సరైన పరిష్కారాలు చూపలేదు. ధరల పెరుగుదల నియంత్రణపై స్పష్టమైన చర్యలు కనిపించలేదు.

## ఆశించిన ప్రయోజనాలు లేవు

### సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్

**ప్రజాపక్షం/సిద్దిపేట :** బడ్జెట్‌లో బడుగు, బలహీన వర్గాలు అశించిన ప్రయోజనాలు లేవని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. వార్షిక బడ్జెట్ పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్‌లను రెట్టింపు చేయలేదని, గీత కార్మికులు, యాదవులు, ముదిరాజ్‌లు, చేనేత కార్మికులు వంటి వృత్తి సంఘాల బడ్జెట్‌లో ప్రస్తావన లేదన్నారు. విద్యకు 20 శాతం డిమాండ్ చేస్తుంటే 8 శాతం,ఆరోగ్యానికి 4 శాతం మాత్రమే కేటాయించారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో నైపుణ్యాభివృద్ధిలో ఈ బడ్జెట్ దిశా నిర్దేశం చేయలేకపోయిందన్నారు. కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయాలన్నారు.

## పాలమూరు వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం

### సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** పాలమూరు వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని సిపిఐ మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని లక్ష్యం, ఈ ప్రభుత్వానికి లేదు 22,615 కోట్లు అనగా 6.97% మాత్రమే ఈ బడ్జెట్ కేటాయింపులను బట్టి అర్థమవుతుంది. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు శుక్రవారం జరిగిన బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడం పాలమూరు వ్యవసాయ రంగానికి తీవ్ర అన్యాయం చేయడం జరిగింది. బడ్జెట్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ సంక్షేమాలకు వారి జనాభాకు అనుగుణంగా కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్‌ను సవరించి విద్య, వైద్యం, ఉద్యోగ అవకాశాలు పెంచాలని పాలమూరు, రంగారెడ్డి ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

## కేటాయింపులు సరే.. ఖర్చుపైనే సంశయం

### సిపిఐ నేత బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం :** శాసనసభలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ లో భారీ గణాంకాలు నమోదయ్యాయి కానీ కేటాయింపుల వారీగా ఖర్చులపైనే సంశయం ఉందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. బడ్జెట్‌పై ఆయన స్పందిస్తూ అంకెలను ఘనంగా చూపించి ప్రజలను ఏమార్చే ప్రయత్నం ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయని అప్పులతో కుంగిపోతున్న రాష్ట్రంలో ఈ బడ్జెట్‌లో కేటాయించిన విధంగా అమలు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. రూ. 3.24 లక్షల కోట్ల బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేవలం పది శాతం మాత్రమే అంటే రూ.32 వేల కోట్లు మాత్రమే కేటాయించారని ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయరంగానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. అధికారంలోకి రాక ముందు చెప్పిన విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరగలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన కేటాయింపులు కూడా అరకొరగానే ఉన్నాయన్నారు. పాత బిల్లుల చెల్లింపుకే కేటాయింపులు సరిపోతాయన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు తులం బంగారం విషయాన్ని పట్టించుకోలేదన్నారు. రుణమాఫీ, రైతు బంధు, సంక్షేమం గురించి గొప్పగా చెప్పినప్పటికీ కేటాయింపు ఆ స్థాయిలో లేదని ఆయన అన్నారు. పింఛన్ పెంపుకు సంబంధించి ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా నాలుగు వేలకు పెంచేందుకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. విద్య, వైద్యానికి కేటాయింపులు సరైన రీతిలో లేవని ఏడాది కాలంగా ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీకి సంబంధించి కేటాయింపులు లేవని హేమంతరావు తెలిపారు. బడ్జెట్‌పై ఎన్నో అంచనాలతో ఉన్న రాష్ట్ర ప్రజలకు భట్టి బడ్జెట్ సంతృప్తిని ఇవ్వలేకపోయిందన్నారు. ప్రధానమైన వ్యవసాయం, విద్య, వైద్యం కేటాయింపులు ఆశించిన స్థాయిలో లేవని సంక్షేమం, అభివృద్ధి కూడా ఈ కేటాయింపుల ప్రకారం ఆశించిన స్థాయిలో జరగదని ఆయన తెలిపారు. మొత్తంగా అంకెలు గనం అమలు శూన్యమన్న రీతిలో బడ్జెట్ ఉందని హేమంతరావు తెలిపారు.

## బడ్జెట్‌తో రాష్ట్ర సర్వోన్నత అభివృద్ధి

ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్ర ప్రభుత్వం 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తుందని ప్రభుత్వ చీఫ్ విప్(శాసన మండలి) డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ముఖ్యంగా ప్రజాహిత అంశాలైన విద్యా, వైద్యం అలాగే వ్యవసాయ, నీటి పారుదల, రోడ్ల నిర్మాణం, పట్టణాభివృద్ధి, పారిశ్రామిక రంగాల్లో ప్రగతిశీల అభివృద్ధితో పాటు మహిళా సంక్షేమం, యువత, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలతోపాటు అన్ని వర్గాల అభ్యున్నతికి బడ్జెట్ కేటాయింపులు హర్షణీయం అని పట్నం తెలిపారు. ముఖ్యంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిసరాల్లో నిర్మాణంలో ఉన్న రేడియల్ రింగ్ రోడ్డు మూడు జిల్లాల అభివృద్ధికి దోహదం చేస్తుంది. రాష్ట్ర వృద్ధి రేటు 10.2శాతం గా ఉంది.ఇది జాతీయ వృద్ధి రేటు కంటే 2.7 శాతం ఎక్కువ. ఇవి రైజింగ్ తెలంగాణకు నిదర్శనంగా నిలుస్తోందన్నారు.

## విద్యారంగానికి నిధులు కేటాయించని ప్రభుత్వం : ఎఐఎస్‌ఎఫ్



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యారంగానికి నిధులు కేటాయించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎం.పవన్ చౌహాన్ ఆరోపించారు. శుక్రవారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవన్ చౌహాన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వద్దనే ఉన్న విద్యాశాఖకు రాష్ట్ర బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించలేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మౌళిక సౌకర్యాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వం ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడం విడ్డూరంగా ఉంద న్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 8.22శాతం అంటే రూ.26.674కోట్ల నిధులు మాత్రమే కేటాయించారని, ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో విద్యారంగంపై ఏ స్థాయిలో నిర్లక్ష్యం చేస్తుందో అర్థమవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల మేనిఫెస్టోలో కనీసం 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్ నేడు 8.22శాతం కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్ద పీఠ ఎక్కడ వేసిందో చెప్పాలని, ఆశించిన స్థాయిలో నిధులు కేటాయించకపోవడంలో అంతర్యమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యారంగంపై ప్రభుత్వం నాన్చుగు దోరణి విడనాడి పెద్ద ఎత్తున నిధులు కేటాయించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

## రంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం

బిజెపి నేత బొక్క నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకంగా ఉందని, అంతేకాకుండా రాష్ట్రానికి అత్యధిక తలసరి ఆదాయం అందిస్తున్న రంగారెడ్డి జిల్లాకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన రంగారెడ్డి జిల్లా ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యం, రియల్ ఎస్టేట్, విద్యాసంస్థలు, సేవారంగం ద్వారా ప్రభుత్వ ఖజానాకు అత్యధిక ఆదాయం అందిస్తున్న జిల్లా అయినప్పటికీ, ఈ బడ్జెట్‌లో జిల్లాకు తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం దురదృష్టకరం అన్నారు. రాష్ట్రంలో అత్యధిక తలసరి ఆదాయం ఉన్న జిల్లా అయిన రంగారెడ్డి జిల్లాకు కొత్త ప్రాజెక్టులు, పరిశ్రమలు, రోడ్లు, సాగునీటి పథకాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పట్టణాభివృద్ధి పనులు,గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలకు సరైన కేటాయింపులు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.

## ప్రజా ప్రయోజనాలే ధ్యేయం

మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి



**ప్రజాపక్షం/కేశంపేట:** ప్రజా ప్రయోజనాలు..రాష్ట్రాభివృద్ధియే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందని కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. 2026–27ఆర్థిక సంవత్సర బడ్జెట్ సామాజిక, ఆర్థిక, రాజకీయ, న్యాయం దిశగా ముందుకు వెళ్తుందని వివరించారు. రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, పెట్టుబడులను ఆకర్షిస్తూ ముందుకు వెళ్తుందని, ప్రజలకు చెల్లించాల్సిన ప్రతి పైసాకు కాపాలాదారులుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందన్నారు.

## సురక్షిత తాగునీటితోనే ఆరోగ్యం

ఎంపి డికె అరుణ



**ప్రజాపక్షం/కొందుర్గు:** సురక్షిత తాగునీటితోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ అన్నారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని ఎదిర గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌ఓ ప్లాంట్‌ను ఎంపి డికె అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి డికె అరుణ మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అంధించేందుకే ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. వికసిత్ భారత్‌తోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి సాధిస్తాయని, రోడ్లు, విద్యుత్, పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తంగేడుపల్లి బ్రిడ్జి నిర్మాణం ఫ్లడ్ రిలీఫ్ నివారణ నిధులతో బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందని వివరించారు. బ్రిడ్జి నిర్మాణ పనులు ఏ స్థాయిలో ఉన్నాయనే విషయాన్ని సైతం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఎదిర రాజు, సర్పంచ్ విజయలక్ష్మి, నేతలు దుష్యంత్ రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి, కందూరు మనోహర్‌రెడ్డి, శివారెడ్డి, మచ్చ సుధాకర్‌రావు, మాజీ అధ్యక్షుడు బోయ కురుమయ్య, బోయ శంకర్, పర్వాతాపూర్ సర్పంచ్ బోయ అశోక్‌తోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/యాచారం :** కరెంటు షాక్‌తో ఒ వ్యక్తి మృతి చెందిన సంఘటన యాచారం మండల పరిధిలోని నజ్జిక్‌సింగారం గ్రామంలో శుక్రవారం జరిగింది. సంఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నజ్జిక్ సింగారం గ్రామానికి చెందిన పుణ్యమూర్తి అంజయ్య (50) వ్యవసాయం చేసుకుంటుటూ జీవనం సాగిస్తున్నాడు. వ్యవసాయ పొలం వద్దకు వెళ్ళి పంట చేను తడుపుదామని మోటారు వేశాడు. మోటారు నీళ్ళు పోయకపోవడంతో స్టార్టర్ డబ్బా వద్దకి వెళ్ళి పరిశీలించాడు రాత్రి వర్షం కురవడంలె స్టార్టర్ డబ్బా చుట్టు వర్షం నీరు చేరింది. కరెంటు షాక్ రావడంతో అంజయ్య అక్కడికక్కడే మృతి చెందాడు.

# 99 రోజుల ప్రణాళికతో సత్ఫలితాలు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ '99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' సత్ఫలితాలను ఇస్తోందని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. ఎంఎంసి పరిధిలో ఘన వ్యర్థాల తరలింపులో గణనీయమైన వృద్ధి నమోదైంది. ఫిబ్రవరి నెలలో రోజుకు సగటున 1662.99 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తరలించగా, మార్చి 19 నాటికి ఆ సగటు 2012.59 మెట్రిక్ టన్నులకు చేరిందని వినయ్ కృష్ణా రెడ్డి చెప్పారు. రోజువారీ వ్యర్థాల తరలింపులో 349.6 మెట్రిక్ టన్నుల (17 శాతం) పెరుగుదల నమోదైందని, రాంకీ సంస్థతో జరిపిన చర్చల ఫలితంగా అదనపు వాహనాలను వినియోగించడం వల్ల ఈపురోగతి సాధ్యమైందని కమిషనర్ తెలిపారు. జవహర్‌నగర్ డంప్ యార్డ్‌కు వ్యర్థాల తరలింపు ప్రక్రియను మరింతవేగవంతం చేశామన్నారు.

## పకడ్బందీగా 2027 జనాభా గణన-

జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ చంద్రకళ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జనాభా గణన 2027 ప్రక్రియలో ఏ ఒక్కరినీ వదలకుండా, డూప్లికేషన్ లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ చంద్రకళ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో శుక్రవారం 60సర్కిళ్ల పరిధిలోని ఛార్జ్ క్లర్క్‌లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.



# 'గ్రీన్ ఫీల్డ్'కు భూములు ఇవ్వం...



నాలుగో రోజుకు రైతుల నిరాహార దీక్షలు

**ప్రజాపక్షం/యాచారం :** గ్రీన్ ఫిల్డ్ రోడ్డు నిర్మాణానికి ప్రాణాలు పోయిన భూములు ఇచ్చే ప్రసక్తేలేదని రైతులు అగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం నాల్గవ రోజు కుర్మిద్ద గ్రామానికి చెందిన రైతులు నిరహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పేర్లను అన్‌లైన్ చేస్తామని గోప్పలు చెప్పింది.కాని నేటికి అమలుకు నోచుకోలేదని తెలిపారు. ఎన్నికల ముందు రైతులను ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ నాయకులు గోప్పలు చెప్పారు. ఇప్పుడున్న మంత్రులు రైతులకు హమిలిచ్చి హమీలను తుంగలో తోక్కారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల పేర్లను అన్‌లైన్‌లో నమోదు చేయకుండా గ్రీన్ పీల్డ్ రోడ్డుకు భూములు ఇవ్వాలని అధికారులు చేప్పడం ఎంతవరకు సమం జసమన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే తక్షణమే ఆన్‌లైన్‌లో రైతుల పేర్లు ఎక్కించాలని డిమాండ్ చేశారు. భూసేకరణ పేరుతో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికారులు రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చేవరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని తెలిపారు. నాలుగు గ్రామాల రైతులతో అందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరాహార దీక్షకు తాడిపర్తి సర్పంచ్ మద్దతు తెలిపారు.

### రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి..

ప్రభుత్వం తక్షణమే రైతుల సమస్యలను పరిష్కరించాలని వ్యవకాస రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి.అంజయ్య డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. రైతు పేర్లను తక్షణమే అన్‌లైన్‌లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. గ్రీన్ పిల్డ్ రోడ్డు నిర్మాణం కోసం తీసుకుంటున్న బలవంతపు భూసేకరణ అపాలన్నారు.

## టిఎన్‌జిఓ కాలనీలో విలువైన భూమి రక్షణ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం టిఎన్‌జిఓ కాలనీలో ఆక్రమణకు గురవుతున్న 16 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. దీని విలువ సుమారు రూ. 3,200 కోట్లుగా అంచనగా ఉందని అధికారులు తెలిపారు. 2007 హెచ్ఎండిఏ లేఅవుట్ ప్రకారం ఇందులో 10 ఎకరాలు ముసాయికుంట, 4 ఎకరాలు గ్రీన్ బెల్ట్, 2 ఎకరాలు ప్రభుత్వ పాఠశాలకు కేటాయించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల మేరకు హైడ్రా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, ఆక్రమణలను నిర్ధారించింది. వెంటనే స్పందించిన అధికారులు 16 ఎకరాల చుట్టూ ఫెన్సింగ్ వేసి, ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేశారు. సకాలంలో స్పందించి విలువైన భూమిని కాపాడినందుకు స్థానికులు హైడ్రా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాసన సభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గన్‌పార్క్ అమరవీరుల స్థూపం నుండి అసెంబ్లీ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేస్తామని చెప్పిన ప్రభుత్వం రెండున్నర ఏళ్లు అవుతున్న నేటికి అమలు చేయడం లేదని ఆరోపించారు. బాండ్ పేపర్లు, గ్యారంటీ కార్డులు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మరచిపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలతో ప్రజలు కొట్టుమిట్టాడుతుంటే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోయారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను వర్తింపచేయాలని, నాన్చుడు దోరణి అవలంభిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజల పక్షాలన నిరసనలు, ఆందోళన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు. సభ, సమావేశాలతో కాలం వెలదీస్తున్నారే తప్పా ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలను అమలు చేయడంతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు.

# 27న శ్రీరామనవమి శోభాయాత్ర

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శ్రీరాముడి శోభాయాత్రలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో శ్రీరాముడి శోభాయాత్రకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈనెల 27న శ్రీరామనవమి సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప, కౌన్సిలర్లు సంతోషిబాయ్ చందులాల్, రాజునాయక్, హిందూ వాహిని సభ్యులు చెట్ల వెంకటేష్, క్యామ మహేష్, సల్లా మహేష్, చింతకుంట రాఘవేందర్, కమలాజీ శ్రీనివాస్ చారి, గుండు అశోక్, గంద్రాతి శివశంకర్, మంగ విజయ్, శ్రావణ్, వెంకటేష్, అల్లాడి శ్రీను, మధు, రామకృష్ణ, దేవేందర్, అశోక్, తరుణ్, శ్రీకాంత్‌లు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ స్వప్న సత్యం...** బిఆర్ఎస్‌కు చెందిన సర్పంచ్ స్వప్న సత్యంతోపాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంతో కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం షాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లేడు చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామ సర్పంచ్ స్వప్న సత్యం, ఉప సర్పంచ్ బలరాంలతో పాటు వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సర్పంచ్ స్వప్న సత్యం మాట్లాడుతూ గ్రామ పంచాయతీని అభివృద్ధి చేయాలనే కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో చలివేంద్రంపల్లి రాజు, ఘనపూర్‌సర్పంచ్ శివ ఆంజనేయులు, వెంకట నరసింహారెడ్డి పాల్గొన్నారు.

# ఎల్‌బి నగర్‌లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పంచాయితీ




**ప్రజాపక్షం/హయత్ నగర్:** కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య డ్రగ్స్ వార్ ఎల్‌బి నగర్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. యూత్ కాంగ్రెస్ నాయకులు డ్రగ్ టెస్ట్‌కు ఎల్.బి.నగర్ బిఆర్ఎస్ నేతలు రావాలంటూ సవాల్ విసిరారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు ఎల్‌బి నగర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని పోటాపోటీ నినాదాలతో హోరెత్తించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్‌బి నగర్ ఎసిపి క్రిష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు.

### టెస్ట్‌కు సైతం సిద్ధమంటూ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

యూత్ కాంగ్రెస్ నేతల సవాలు స్వీకరించిన ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే డి.సుధీర్‌రెడ్డి తమ పార్టీ నాయకులు మాజీ కార్పొరేటర్లు కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదీర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు మధు యాష్కి గౌడ్, మల్‌రెడ్డి రామ్‌రెడ్డిలు డ్రగ్స్ టెస్ట్‌కు రావాలని ప్రతి సవాల్ చేశారు.



### టెస్ట్‌కు రమ్మంటే ఆందోళనకు దిగటం సిగ్గుచేటు

కాంగ్రెస్ నాయకుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి

తాము ఇచ్చిన సవాలును స్వీకరించి పరీక్షలు చేయించుకోకుండా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తమ అనుచరులతో ఆందోళన చేయడం సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆరోపించారు. ఎల్‌బి నగర్ బిఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డ్రగ్ టెస్ట్‌లు చేయించుకొని తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, దర్పేల్లి రాజశేఖర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, బుడ్డా సత్యనారాయణ, అశోక్ గౌడ్, రామారావు, చిన్నగొని శ్రీధర్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు గజ్జల మధుసూధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, భవాని, ప్రవీణ్, చెరుకు సంగీత, ప్రశాంత్, పట్నాల విశ్వేశ్వర్ రావు, చిన్నగొని శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సొంతింటి కల నెరవేర్చుతున్న ప్రభుత్వం

**ప్రజాపక్షం/కొందుర్గు:** గ్రామీణ పేదలకు సొంతింటి కల నేరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతోకృషి చేస్తుందని కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో గృహ ప్రవేశాలు చేయించి సర్పంచ్ దంపతులు నూతన వస్త్రాలను అంధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు రామయ్య గౌడ్, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి సురేఖ, నాయకులు కృష్ణయ్య, మల్లయ్య, నరేందర్, రవీందర్, మాణేయ్య, కావలి యాదయ్య, బోరిగే యాదయ్య, జీబి కృష్ణ, అశోక్, బ్యాగరి రవి, వార్డు సభ్యులు శ్రీనయ్య, వాసూరి, నవీన్, కటికె వెంకటేష్, శీలం లింగం, పోమల సంజీవలు పాల్గొన్నారు.



## తక్కళ్ళపల్లి గ్రామానికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని తక్కళ్ళపల్లి గ్రామంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఆగ్రామ మాజీ ఉప సర్పంచ్ ,అడ్వకేట్ పగడాల శ్రీశైలం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి కి వినతి పత్రం అంద జేశారు. ఈ సంధర్భంగా పగడాల శ్రీశైలం మాట్లాడుతూ గ్రామంలో ఎంతో మంది పేదలు ఇండ్లు కట్టుకోవడానికి సిద్దంగా ఉన్నారని తెలిపారు. ఇళ్ళు లేక ఒకే ఇంట్లో ఉంటు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వారి బాధను అర్థం చేసుకోని అర్హులైన వారిని గుర్తించి ఇండ్లు కెటాయించాలని కోరారు.

# నాణ్యమైన మేతతో అధిక పాల దిగుబడి

డాక్టర్ నాగలక్ష్మి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నాణ్యమైన మేత అందించడం ద్వారా పశువులలో పాల దిగుబడిని పెంచడమే కాకుండా, వాటి పునరుత్పత్తి సామర్థ్యాన్ని శాస్త్రీయంగా మెరుగుపరచుకోవచ్చునని రాజేంద్రనగర్‌లోని పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలోని పశువైద్య కళాశాల పోషణ విభాగం అధిపతి డాక్టర్ డి.నాగలక్ష్మి తెలిపారు. గురువారం పివి నరసింహారావు తెలంగాణ, పశువైద్య విశ్వవిద్యాలయంలోని పశువైద్య కళాశాల రాజేంద్రనగర్ పశుపోషణ విభాగం, ఐసిఆర్ జాతీయ మాంస పరిశోధన స్థానం ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాల యువత కు పాడి పశువులలో అధిక పాల ఉత్పత్తి, పునరుత్పత్తి సామర్థం కోసం పోషణలో మెళకువలు అనే అంశంపై ఒక్క రోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పశువుల ఉత్పాదకతను పెంచడంలో సరైన సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను డాక్టర్ నాగలక్ష్మి వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధ్యాపకులు డాక్టర్ ఎన్.నళిని కుమారి, డాక్టర్ జె.నరసింహ, డాక్టర్ అలెగ్జాండర్,. డాక్టర్ ఏ.సుధీర్ బాబు, డాక్టర్ రామకృష్ణతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన ఔత్సాహిక రైతులు పాల్గొన్నారు.



## రైతు కమిషన్ కార్యాలయంలో కెవిఎన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు కమిషన్ కార్యాలయంలో కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కమిషన్ చైర్మన్ ఎ.కోదండరెడ్డి, సభ్యులు రాములునాయక్, గోపాల్ రెడ్డి, భూమి సునీల్, కమిషన్ అధికారులు సంధ్యారాణి, హరి వెంకటప్రసాద్, పతంజలి, ప్రవంతి, రజిత, శ్రావ్య, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని కెవిఎన్ రెడ్డికి శాలువాలు కప్పి, బొకేలు అందజేసి బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ కోదండరెడ్డి ఛాంబర్ లో కెవిఎన్ రెడ్డి కేక్ కట్ చేశారు.

## సివికి కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం సీనియర్ విభాగం నిర్వహిస్తున్న సుధీర్ కృష్ణ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు వై.ఉమామహేశ్వర్ గౌడ్ వాతో సత్కరించి సివికు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో మహేష్ కార్తీక్ రెడ్డి, కళ్యాణ్ గౌడ్, శివారెడ్డి, వరుణ్, రాజేష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 24న ఇందిరాపార్క్ వద్ద సిపిఐ మహాధర్నా

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు ఈ నెల 24న ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు సిపిఐ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి జిల్లాలలో ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, భూదాన్ భూముల్లో నివసిస్తున్న వారికి హక్కులు కల్పించాలని, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని, వెలుగుమట్ల బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలనే డిమాండ్లతో ఈ నిరసన చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాధర్నాను విజయవంతం చేయాలని ప్రజలను కోరుతూ, సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి.కృష్ణ పిలుపునిచ్చారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ హక్కుల సాధనకు మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఈటలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/దుండిగల్ :** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి వారిని మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గోనె మల్లారెడ్డి, నల్ల రామచంద్రరెడ్డి, దమ్మగారి ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఎంబరి ఆంజనేయులు, ఎన్ రోజా, సర్కిల్ ప్రధాన కార్యదర్శులు డి.సీతారాంరెడ్డి, తురాయి భానుగౌడ్, మున్సిపల్ కోశాధికారి కొమ్ము ప్రశాంత్, శ్రీధర్ గౌడ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## 22న సిఎం రేవంత్ రెడ్డి నర్మెట్ట రాక

### రూ.9 వేల కోట్ల రైతు భరోసా నిధుల విడుదల

### రైతు సదస్సును విజయవంతం చేద్దాం

### సిసి రోడ్డుకు శంకుస్థాపన చేసిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** నర్మెట్టలోని ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 22వ తేదీన ప్రారంభించి రైతులకు అంకితం చేయనున్నట్లు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వర్గల్ మండలం అంబర్ పేటలో సర్పంచ్ భాగ్యలక్ష్మి కుమార్ యాదవ్ తో కలిసి సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సిద్దిపేట జిల్లాతో పాటు సమీప ప్రాంతాల అన్నదాతలు ఆయిల్ ఫామ్ పంటను సాగు చేయగా, ఫ్యాక్టరీ ప్రారంభంతో వారు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రైతు సంబరాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టగా, నియోజకవర్గం నుండి రైతులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అయితే అదే రోజున సీఎం రేవంత్ రెడ్డి రూ 9 వేల కోట్లు రైతు భరోసా నిధులు విడుదల చేయనున్నట్లు చెప్పారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వరితో పాటు ఆయిల్ ఫామ్ పంట సాగుకు అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ సబ్సిడీలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల మెప్పు పొందుతున్నట్లు గుర్తు చేశారు. గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి అడిగిన అభివృద్ధి పథకాలు, నిధులు మంజూరి చేస్తుండగా, అర్హులైన ప్రతి పేదకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని రూ 5 కోట్ల 41 లక్షల వ్యయంతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాంణ చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను పేదంలదరికి చేర్చుతుండగా, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు సదానంద రెడ్డి, కాంగ్రెస్ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు వెంకటేష్, మాజీ ఎంపీటీసీ నీల శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సాయి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నిర్మాణ వ్యర్థాలు రోడ్ల పక్కన పడేస్తే చట్టరీత్యా చర్యలు




జిహెచ్‌ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నిర్మాణ వ్యర్థాలను రోడ్ల పక్కన పడేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవటంతో పాటు జరిమానాలు విధిస్తామని జిహెచ్‌ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా హెచ్చరించారు. 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్కయక్రమంలో భాగంగా శనివారం జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్ పరిధిలో పర్యటించి పారిశుద్య పనులను పర్యవేక్షించారు. డి మార్ట్ శివ సాయినగర్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న బాక్స్ డ్రైవ్ పనులు, కందిగూడ చౌరాస్తాలో నిర్మాణంలో ఉన్న ఫుట్ బాల్ గ్రౌండ్ పనులను పర్యవేక్షించారు. సర్కిల్ పరిధిలో రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్దంగా పడేసిన నిర్మాణ వ్యర్థ పదార్థాలు తొలగించేందుకు 15 రోజుల ప్రణాళిక తయారు చేసి దీనిలోని భాగంగా వంపుగూడ నుండి జవహర్‌నగర్ వెళ్లే రహదరిలో రహదారికి ఇరుపక్కలా ఉన్న నిర్మాణ వ్యర్థాలను జెసిబి, టిప్పర్‌ల ద్వారా తొలగించే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటి కమిషనర్ శ్రీహరి, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిఈ రవి, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, రాంకీ సర్కిల్ ఇన్‌చార్జి నవీన్‌కుమార్, రాంకీ సూపర్‌వైజర్ శృతి తదితరులు పాల్గొన్నారు.

**పోస్టర్ల ఆవిష్కరణ**

వరల్డ్ సిండ్రోమ్ డౌన్ డే సందర్భంగా అనురాగ్ స్పెషల్ స్కూల్ ఫర్ మెంటల్లీ ఛాలెంజ్‌డ్ పోస్టర్లను జిహెచ్‌ఎంసి కాప్రా డిప్యూటి కమిషనరర్ శ్రీహరి, నాచారం డిప్యూటి కమిషనర్ నిత్యానందలు ఆవిష్కరించారు.

## లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు రుణాలు

### జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

**ప్రజాపక్షం/వికారాబాద్ :** లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో 2025–26పై జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్ ఆధ్వర్యంలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ అమలుకై ప్రత్యేక బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025 26 లో ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాదికల్పన లక్ష్యంగా యూన్లి స్థాపన చేపట్టుకు కార్యాచరణను బ్యాంకర్ల సమావేవంలో చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష రూపాయల విలువ గల ఎలక్రిక్ ద్విచక్ర వాహన యూనిట్లు 90శాతం సబ్సిడీతో అందించబడుతాయన్నారు. ప్రస్తుతం గిగ్ వర్కర్లకు అన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్స్ అయినటువంటి జొమాటో ,స్విగ్గి ,ర్యాపిడో మొదలైన వాటిలో పనిచేస్తున్న వారికి ఎంపికలో ప్రాధాన్యత ఉంటుందని కలెక్టర్ తెలిపారు. వికారాబాద్ జిల్లాకు ఈ పథకం కింద 168 ఎలక్రిక్ ద్విచక్ర వాహనాలు, 82 త్రిచక్ర వాహనాలు, 17సోలార్ యునివర్సల్, బ్యాంకర్లు చురుకుగా వ్యహరించాలని అదేశించారు. ఈనెల 24వరకు అర్హులైన ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాలని ,బ్యాంకులు సమర్పించలని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్‌చౌదరి, బ్యాంకర్లు తదితరులు పాల్గొన్నారు.



**10వ తరగతి పరీక్షలు పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు**

ఈ సందర్భంగా చీఫ్ సూపరిండెంట్లు ,డిపార్ట్‌మెంట్ అధికారులు ,ఇన్విజిలేటర్లకు జుమ్ మీటింగ్ ద్వారా పలు సూచనలు సలహాలు కలెక్టర్ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేలా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరీక్ష విధులు నిర్వహించే ప్రాంగణంలో మొబైల్, ఎలక్రానిక్, వస్తువులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలీసు బందోబస్తు వాటర్ బాయ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షలను పక్కగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

## చెత్త వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చకూడదు



సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన

**ప్రజాపక్షం/దుండిగల్ :** ప్రజాపాలన ప్రగతికి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన దుండిగల్ సర్కిల్ 59 లోని బహదూర్ పల్లి వార్డ్ ను సందర్శించి అక్కడ జరుగుతున్న పారిశుద్ధ పనుల తీరును స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజలు మరియు వ్యాపారులు మరియు పారిశుద్ధ్య కార్మికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రతి దుకాణం ముందు తప్పనిసరిగా చెత్త బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని అదే విధంగా ప్రజలు చెత్తను రోడ్లపై వేయకుండా ఎప్పటికప్పుడు మీ ఇంటి వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోలకు అందించాలని సూచించారు. చెత్త వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్చకూడదని ఆమె స్పష్టం చేశారు. ఆ చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చూడాలని అధికారులకు సూచించారు. అదే విధంగా ఫుట్‌పాత్ ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించాలని, సి అండ్ డి వేస్ట్ వ్యర్థాలను రోడ్లపై వేయకుండా వేస్ట్ ప్లాంట్‌కి తరలించేలా చూడాలని, ఈ నియమాలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అమలవుతున్న 99 రోజుల ప్రణాళిక, పట్టణ ప్రగతి ప్రగతి ప్రణాళిక, పురోగతిని శమీక్షించరు ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించి విధానం మరింత సమర్థవంతంగా ఉండాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ సాత్విక్, ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీజన ఐఏఎస్, బహదూర్ పల్లి చౌరస్తా నుండి బహదూర్ పల్లి వార్డ్ ఆఫీస్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఉన్నటువంటి రోడ్డు ఫుట్ పాత్ చిన్నచిన్న డబ్బాలు టీ స్టాల్స్, సైన్ బోర్డ్స్, ఆక్రమణలను తొలగించారు.

## కోటి నిధులతో అలియాబాద్ మున్సిపల్ అభివృద్ధి

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అలియాబాద్ మున్సిపాలిటిని పార్టీలకతీతంగా అభివృద్ధి పరుస్తామని ఇందులో భాగంగా రూ.కోటితో మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మొదటి సాధరణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అలియాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కౌన్సిలర్‌లు సహకరించాలని కోరారు. అధికారులు వంద శాతం పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేకర్, మున్సిపల్ వైస్ చైర్మన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు, డిప్యూటి ఇఇ నరసింహారాజు, టిపిఓ వికాస్, ఎఇ సనా షాహీమ్, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఓ వేణుగోపాల్, శానిటరి ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, ఆర్‌ఐలు విజయ్‌కుమార్, ప్రమీల, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మంజీరా నదిలో చేపల మృత్యువాత



పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** మంజీరా నదిలో చేపలు మృత్యువాత పడ్డాయి. నదిలో కుప్పలు తెప్పలుగా చేపలు చనిపోయి ఉన్నాయి. ఇందుకు ఆయా పరిశ్రమల నుంచి వస్తున్న వ్యర్థ జలాలే కారణమంటూ వారిపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేసింది. హత్నూర మండలం పల్పనూరు గ్రామ శివారులో వేల సంఖ్యలో చేపలు మృతి చెందాయి. శుక్రవారం ఉదయం నదిలో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లగా కుప్పలు తెప్పలుగా పడి ఉన్న చేపలను చూసి కంగుతిన్నారు. వేలాది చేపలు ఒక్కసారిగా మృతితో మంజీరా నది పరిసరాలు కంపు కొడుతున్నాయి. కొన్నేళ్లుగా మంజీరా నదిలో కలుస్తున్న నక్క వాగులోని పారిశ్రామిక వ్యర్థ జలాలే ఇందుకు కారణం అని ఆరోపణలు ఉన్నాయి. పారిశ్రామిక వ్యర్థ జలాలతోనే చేపలు చనిపోయి ఉండవచ్చని మత్యకారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలోనూ మంజీరా నదిలో పారిశ్రామిక వ్యర్థ జలాలతో వేలాది చేపల మృత్యు వాత పడ్డాయి. చేపల మృతికి కారణమైన పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారుల సంఘం డిమాండ్ చేస్తున్నారు. హత్నుర మండలం పల్పనూరు శివారులో చేపలు చనిపోయిన ఘటనమస్థలాన్ని మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మాణయ్య మత్స్యకారులతో కలసి పరిశీలించారు. పరిస్థితులను గమనించిన వీరు దీనికి కారణమైన పరిశ్రమలపై ప్రభ్యుం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంజీరా జలాలు కలుషితం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పల్పనూరు గ్రామానికి చెందిన సుమారు పది కుటుంబాలు చేపల వేటపై ఆదారపడి జీవిస్తున్నాయని పరిశ్రమల నుంచి విడుదలైన కలుషిత నీటీ కారణంగా మంజీరాలో టన్నుల కొద్దీ చేపలు మృతి చెందినట్లు పేర్కొన్నారు.

**పరిశ్రమల వ్యర్థజాలలే కారణం**

ఈ నీరు మళ్లీ శుద్ధి కావాలంటే పై ప్రాంతంలోని మంజీరా నది నుంచి నీటిని విడుదల చేయాల్సిందేనని అన్నారు. ఇందుకు సంబందించిన ప్రభుత్వ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. మత్యకారుల జీవనోపాదిని కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ,అలాగే కలుషిత నీటిని విడుదల చేస్తున్న కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు మాణయ్య మత్స్యకారులతో హత్నూర మండలం పల్పనూర్ శివారులో చేపలు చనిపోయిన ఘటన స్థలానికి చేరకున్నారు. పరిస్థితులను గమనించి దీనికి కారకులైన పరిశ్రమలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మంజీరా జలాలు కలుషితం కావడం వలన ప్రజలకు ఇబ్బందికరంగా మారిందని అన్నారు. పల్పనూరు గ్రామానికి చెందిన పది కుటుంబాల వ్యక్తులు చేపలు పట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. ఈ రోజు ఈ పరిశ్రమల కలుషిత నీటి వలన మంజీరాలో ఉన్న టన్నుల కొద్దీ చేపలు మృతి చెందాయని ఆయన తెలిపారు. ఈ నీరు మళ్లీ మంచినీరుగా మారాలంటే పై నున్న మంజీరా నది నుంచి నీటిని వదిలితే తప్ప నీరు శుద్ధి కాదని, నీరు శుద్ధి కావాలంటే మంజీర నుండి ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకుని నీటిని వదిలాలని కోరారు. వెంటనే ప్రభుత్వాదికారులు చర్యలు తీసుకొని మత్స్యకారుల జీవన ఉపాదిని కాపాడాలని ఆయన కోరారు. అలాగే ఏదైతే కంపెనీ నుంచి కలుషిత నీరును వదిలేరో ఆ కంపెనీపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



## రంజాన్ తోఫాలు పంపిణీ

### తోటకూర వజ్రేష్‌యాదవ్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న రంజాన్ తోఫాను నారాయణ ఫంక్షన్ హాల్‌లో లబ్దిదారులకు మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ రంజాన్ కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మామిడ్ల ముత్యాలు యాదవ్, ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు కొంతం అంజిరెడ్డి, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి, యూత్ అధ్యక్షులు బొక్క సంజీవ రెడ్డి, మైనార్టీ నాయకులు మమ్మద్ ఖయ్యూం, మైనార్టీ అధ్యక్షులు ఫరుక్, మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ బాధితులకు అందజేత



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజవర్గం దుండిగల్ మాజీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్, బిఆర్‌ఎస్వి సీనియర్ నాయకులు కొర్ర ప్రవీణ్ నాయక్ దుండిగల్ తండా 2 లోని నివసించే బానోత్ దీక్షిత నాయక్ ఆరోగ్య సమస్యతో హాస్పిటల్‌లో చికిత్స నిమిత్తం, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెక్కుని మంజూరు చేయించారు. మంజూరు చేసిన చెక్కులను బాధితులకు అందజేశారు. అదేవిధంగా దుండిగల్ గ్రామానికి చెందిన రామ్ మూర్తి గుండె స్టెంట్ శస్త్రచికిత్స కారణంగా 76,000/ సిఎంఆర్ ఎఫ్ సహాయం అందించిన ఎమ్మెల్యే కెపి వివేకానంద్ కు బాధితులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు ఈ చెక్కును చింతల్ ఎమ్మెల్యే కార్యాలయంలో దుండిగల్ మాజీ సర్పంచ్, మాజీ కౌన్సిలర్ జక్కుల కృష్ణ యాదవ్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జక్కుల కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, అత్యవసర సమయంలో సహాయం అందించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి సత్వర సహాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు సింగం బాగయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని లక్ష్మాపూర్‌కు చెందిన సింగం బాగయ్య(49) తెలంగాణ రాష్ట్ర సాధనలో జెఎసి చైర్మన్‌గా నియమితులై అనేక చైతన్య కార్యక్రమాలను చేశారని ప్రజలు గుర్తు చేశారు. రాష్ట్ర సాధనకు ర్యాలీలు, పాదయాత్రలు, వంట వార్పు, తదితర కార్యక్రమాలు చేపట్టి మేడ్చల్ జిల్లాలోనే లక్ష్మాపూర్‌ను ముందు స్థాయిలో ఉంచేందుకు కృషి చేశారని ఉద్యకారులు కొనియాడారు. తెలంగాణ రాష్ట్రం సాధికారత కావడంతో సంబరాలను అంగరంగ వైభవంగా జరుపుకోవడానికి బాగయ్య విశేష కృషి చేశారని ప్రజలు, నాయకులు గుర్తు చేశారు. అనంతరం ఆయన బౌతిక కాయానికి నివాళ్లర్పించి జై తెలంగాణ.. సింగం బాగయ్య అమర్ హై అంటూ యువకులు, గ్రామస్థులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సింగం బాగయ్య అంత్యక్రియల్లో వేలాదిగా ప్రజలు తరలివచ్చి ఆయనకు నివాళ్లర్పించారు. ఆయన కుటుంబానికి ప్రజలు తమ ప్రఘాడ సానుభూతిని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులకు మెరుగైన మౌళిక వసతులు కల్పించడమే ధ్యేయమని పలు కంపెనీల ప్రతినిధులు శ్రీధర్, విశ్వనాథ్, నందిలు అన్నారు. శుక్రవారం శామీర్‌పేట డివిజన్ పోతాయిపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పునరుద్ధరణ పనులను పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్సిర్ ఓయిక్స్ హైద్రాబాద్, హావీన్ హోల్ బెంగుళూర్ సంస్థల ప్రతినిధులు సుమారు రూ. 10 లక్షలతో సిఎస్‌ఆర్‌లో బాగంగా కేవలం 15 రోజుల్లో పాఠశాలలో అనేక సౌకర్యాలు కల్పించారని చెప్పారు. విద్యార్థులకు శుద్ధిచేసిన తాగునీని కోసం వాటర్ ఫిల్టర్ ప్లాంట్, కంప్యూటర్ ప్రింటర్, మైక్ సెట్, కొత్త ఫర్నిచర్, ఓవర్‌హెడ్ ట్యాంక్, ప్రహారీగోడ లాంటి అనేక వసతులను ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కమలాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లక్ష్మి , ఇందిరమ్మ కమిటి సభ్యులు మోహన్‌రెడ్డి, దర్శన్‌గౌడ్, మురళీగౌడ్, బల్వంత్‌రెడ్డి, మాజి కౌన్సిలర్ హరిబాబు, హెచ్‌ఎం వేణు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లన్న సాగర్ ప్రధాన కాల్వకు గండి

**ప్రజాపక్షం/దుబ్బాక:** మల్లన్న సాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు భారీ గండి పడింది. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ శివారులో కాల్వకు భారీ గండి పడడంతో సమీపంలోని కందుల చెరువులోకి నీరు ప్రవహిస్తోంది. ఈ కాలువ ద్వారా జిల్లాలో చాలా గ్రామాలతో పాటు రాజన్నసిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలో పలు గ్రామాలకు చెరువులు, పంట పొలాలకు నీరు అందుతోంది. సుమారు 50 కిలో మీటర్ల మేర నిర్మించిన ఈ ప్రధాన కాల్వ ద్వారా వేల ఎకరాల పంట పొలాలకు నీరు అందుతోంది. కాల్వకు గండి పండడంతో నీరు వృధాగా పోతున్న సమాచారం తెలుసుకున్న ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా గండి మరమ్మతులు చేపట్టారు. పంట ఎండిపోయే ప్రమాదం ఉందని అధికారులు స్పందించి నీటిని కాల్వ ద్వారా విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శనివారం
21-03-2026
www.prajapaksham.in

"తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఇవ్వడం మా ప్రభుత్వం బాధ్యతగా భావించింది. హైదరాబాద్ అంటే కేవలం ఐటి హబ్, బిర్యానీ మాత్రమే కాదు.. ఇదొక సినిమా హబ్‌కు కేరాఫ్. హైదరాబాద్‌కు చార్‌మినార్‌లోని చార్‌మినార్స్‌లాగా పలుగురిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు."



## 'పాపం ప్రతాప్' ఏప్రిల్ 17న రిలీజ్



'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న యంగ్ హీరో తిరువీర్ ప్రస్తుతం పలు ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్స్ చేస్తున్నారు. తిరువీర్ హీరోగా దుర్గా నరేష్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పాపం ప్రతాప్'. పాయల్ రాధ కృష్ణ హీరోయిన్ గా నటిస్తోంది. కృషి ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా యూనిక్ ప్రమోషన్స్ తో ఆసక్తిని పెంచింది.తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. ఈ సినిమా సమ్మర్ స్పెషల్ గా ఏప్రిల్ 17న థియేటర్స్ లో విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ లో తిరువీర్, పాయల్ రాధాకృష్ణ నవవధూవరులగా కనిపించడం క్యూరియాసిటీ పెంచింది. ఈ చిత్రంలో అజయ్ ఘోష్, ప్రసాద్ బెహరా కీలక పాత్రలు పోషిస్తున్నారు. కెమెరా: రాధా కృష్ణ, సురేష్ బొబ్బిలి మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి విశ్వేశ్వర్ ఎస్.వి డిఒపి, అన్వర్ అలీ ఎడిటర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి స్టంట్స్: మార్షల్ నటరాజ్, కొరియోగ్రాఫర్ : ఈశ్వర్ , పాటలు : సుద్దాల అశోక్ తేజ, అనంత్ శ్రీరామ్, రెహమాన్.

# సినిమా హబ్‌కు కేరాఫ్ "హైదరాబాద్"



తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025 ప్రధానోత్సవ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ఈ వేడుక తారా తోరణంతో మెరిసిపోయింది.చిరంజీవి, కమల్ హాసన్ వంటి నట దిగ్గజాలతో పాటు బాలీవుడ్ నటి మాధురి దీక్షిత్, తమిళ నటి కుష్బూ, మరాఠి నటుడు, దర్శకుడు రితేష్ దేశ్‌ముఖ్, హీరోయిన్ జెనీలియా, అక్కినేని నాగార్జున, రామ్ చరణ్ వంటి తారలతో గద్దర్ అవార్డుల వేదిక తళుక్కుమంది. అవార్డుల ప్రధానోత్సవం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులను ఇవ్వడం మా ప్రభుత్వం బాధ్యతగా భావించింది. హైదరాబాద్ అంటే కేవలం ఐటీ హబ్, బిర్యానీ మాత్రమే కాదు.. ఇదొక సినిమా హబ్ కు కేరాఫ్. హైదరాబాద్ కు చార్ మినార్ లోని చార్ మినార్స్ లాగా ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు, కృష్ణ నలుగురు సినీ పరిశ్రమను ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. రామోజీ రావు ఫిల్మ్ సిటీ ఏర్పాటు చేసి హైదరాబాద్ ను సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేశారు. ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికుల కోసం తన సొంత స్థలాన్ని ఇచ్చి ఆదుకున్నారు.ఆనాడు సినీ రంగంలో ఏ సమస్య వచ్చినా ముందుండే దాసరి నారాయణ రావుని స్మరించుకోవాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ ను గ్లోబల్ సినీ హబ్ గా తీర్చి దిద్దేందుకు మా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇవాసామాజిక బాధ్యతను గుర్తెరిగి గద్దర్ స్ఫూర్తితో సామాజిక సమస్యలను పరిష్కారానికి సినిమా ద్వారా సందేశం అందించాలి అని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సంకల్పం పూర్తి చెయ్యడానికి అన్ని వేళలా తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు.

**......అవార్డులు అందుకున్న విజేతలు వీరే**

ఉత్తమ నటుడిగా అక్కినేని నాగచైతన్య (తండేల్) , ఉత్తమ నటిగా రష్మిక మందాన (గర్ల్ ఫ్రెండ్), ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి నిర్మాత వేణు, ఉత్తమ దర్శకుడిగా సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఎన్టీఆర్ జాతీయ అవార్డును చిరంజీవికి, పైడి జయరాజ్ అవార్డును కమల్ హాసన్ కు, కత్తి కాంతారావు అవార్డును ఆర్ నారాయణ మూర్తికి, సి నారాయణరెడ్డి అవార్డును గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు, అక్కినేని నాగేశ్వర్ రావు అవార్డును నటి జయసుధకు అవార్డులను ముఖ్యమంత్రి ప్రధానం చేశారు. జ్యూరి సభ్యులకు, ఇతర సాంకేతిక నిపుణులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎఫ్ డీ సీ చైర్మన్ దిల్ రాజు, ఎఫ్ డీ సీ ఎండీ ప్రియాంక కలసి ప్రధానం చేశారు. దేవిశ్రీ ప్రసాద్, గాయని శ్రేయ గోషాల్ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

## 'ఉత్తమ నటిగా కోడలు' భావోద్వేగానికి గురైన అత్త



ఉత్తమ నటిగా తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందని హీరోయిన్ రష్మిక దేవరకొండ అన్నారు. 2025వ ఏడాదికి గాను ఉత్తమ నటిగా ఎంపిక అయిన రష్మిక ఉగాది పండుగ పండుగ నాడు జరిగిన అవార్డుల ప్రధానోత్సవ వేడుకలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ ఒకప్పుడు నాకు నటన రాదనీ ట్రోల్ చేశారు. కానీ నా పెర్ఫార్మెన్స్ నచ్చి రాష్ట్ర స్థాయి అవార్డు రావడం ఎంతో గర్వాంగా ఉందని చెప్పారు. గర్ల్ ఫ్రెండ్ సినిమాలో నటనకు గాను రశ్మిక ఉత్తమ నటి అవార్డు గెలుచుకుంది. ఇప్పటి వరకు నన్ను కూతురిలాగా ఆదరించారు. ఇప్పుడు తెలంగాణ కోడలిగా మీ ముందు నిల్చున్నాను. నా కుటుంబాన్ని బాగా చూసుకోండి. రష్మిక మాటలు వింటున్న విజయ్ దేవరకొండ తల్లి భావోద్వేగానికి లోనైయ్యారు. అనంతరం గద్దర్ అవార్డు చేతిలో తీసుకుని అత్త , కోడళ్ళు సంతోషాన్ని పంచుకున్నారు. రష్మిక మాటల మధ్యలో ముఖ్యమంత్రి కల్పించుకుని మా ఊరి కోడలు అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని రష్మిక చెప్పారు

## యాక్షన్ నేపథ్యంలో 'కరుప్పు'

తమిళ నటుడు సూర్య యాక్షన్ నేపథ్యంలో చేస్తున్న తాజా చిత్రం 'కరుప్పు'. దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది.సూర్య పవర్ఫుల్ అవతార్లో కనిపించిన 'కరుప్పు' ఫస్ట్ లుక్ టీజర్ సంచలనం క్రియేట్ చేసింది. ఈ ఏడాది మే 14న ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో సూర్య సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. ఇంద్రన్స్, నట్టి, స్వసిక, అనఘ మాయ రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు.సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్న ఈ చిత్రానికి



జికె విష్ణు సినిమాటోగ్రఫర్ గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి యాక్షన్ అన్బరివ్ విక్రమ్ మోర్, ఎడిటర్ ఆర్.కళైవానన్, ప్రొడక్షన్ డిజైన్ అరుణ్ వెంజారామూడు నిర్మాతలు: ప్రకాష్ బాబు, ఎస్.ఆర్. ప్రభు.

# ఎపి సర్కారు ఫిలిం అవార్డులు ఇవ్వడంలో వెనుకబడింది

### గద్దర్ అవార్డుల వేడుకలో చిరంజీవి



సినిమా కళాకారులను ప్రోత్సహించే విషయంలో తెలంగాణ ప్రభుత్వంతో పోలిస్తే పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ చాలా వెనుకబడి ఉందని చిరంజీవి వ్యాఖ్యానించారు. ఈ వేదికపై చెప్పడం సమంజసమోకాదో కానీ అంటూనే పక్క రాష్ట్రము అవార్డుల విషయంలో వెనుకబడి పోయిందని సెటైర్ వేశారు. సినిమా వాళ్లకు అతి దగ్గరగా ఉండే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలంగాణ గద్దర్ అవార్డులను స్ఫూర్తిగా తీసుకుని సినిమా కళాకారులను ప్రోత్సహించాలని సూచించారు. ఉగాది పర్వదినాన తెలంగాణ ప్రభుత్వం అందించిన తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల్లో భాగంగా ఎన్టీఆర్ జాతీయ అవార్డును చిరంజీవి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాలీవుడ్ నటి మాధురి దీక్షిత్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ సినిమా ప్రభావం ఎంత ఉంటుంది? దాని ప్రతాపం ఎంత ఉంటుంది అనేది తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించారని, సినిమా కళాకారులకు అవార్డులను పునరుద్ధరించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. సినిమా పరిశ్రమ ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న విషయాన్నీ తెలంగాణ ప్రభుత్వం గుర్తించిందని అన్నారు. ఒక పక్క పెద్దలను గౌరవించుకుంటూనే, కొత్తవాళ్లను ప్రోత్సహించే విధంగా అవార్డులను బహుకరిస్తున్నారని చిరంజీవి పేర్కొన్నారు.

**నేను గద్దర్ అభిమానిని : కమల్ హాసన్**

గద్దర్ కు ఉన్న మిలియన్ల అభిమానుల్లో నేను ఒకడిని ...నేను గద్దర్ కు అభిమానిని అని ప్రముఖ నటుడు పద్మశ్రీ, రాజ్య సభ సభ్యుడు కమల్ హాసన్ వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రధానం చేసిన పైడి జయరాజ్ అవార్డుతో పాటు దర్శకుడు సింగీతం శ్రీనివాస్ రావు కు ప్రకటించిన అవార్డును కూడా కమల్ హాసన్ అందుకున్నారు. ఈ సందర్భంగా కమల్ హాసన్ మాట్లాడుతూ బి ఎన్ రెడ్డి పురస్కారానికి ఎంపికైన సింగీతం శ్రీనివాస్ రావు అవార్డు అందుకున్నప్పుడు "సొమ్మొకడిది సోకొకడిది' అనే సినిమా గుర్తుకొచ్చింది చెప్పారు. తనకు పదహారేళ్లు ఉన్నప్పుడు తొలిసారిగా హైదరాబాద్‌కు వచ్చానని చెప్పారు. మేమిద్దరం బ్రదర్స్ లాంటివాళ్ళం. ఇప్పుడు ఇద్దరం కూడా డెబ్బైలో ఉన్నాం అని చెప్పారు. పైడి జయరాజ్ అవార్డు అందుకోవడం చాలా గర్వాంగా ఉందన్నారు. సినిమా కళాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందుకు వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందిస్తునాన్ని పేర్కొన్నారు.

# 'ఉస్తాద్‌కు' ఊహించిన దానికంటే ఎక్కువ రెస్పాన్స్

### సక్సెస్ ప్రెస్ మీట్‌లో చిత్ర బృందం



పవన్ కళ్యాణ్ హీరోగా, శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా సక్సెస్ మీట్ హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శం కర్ మాట్లాడుతూ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు విడుదల అనంతరం మేము ఊహించిన దానికంటే ఎక్కువ రెస్పాన్స్ వచ్చిందని దర్శకుడు హరీష్ శంకర్ అన్నారు. ఇదొక మాస్ ఎంటర్‌టైనర్ కాబట్టి, ఓవర్సీస్ నుం చి పాజిటివ్ టాక్ రావడానికి కొంచెం సమయం పడుతుంది అ నుకున్నాను. కానీ, మొదటి షో నుం చే అన్ని ప్రాంతాలలో పాజిటివ్ టాక్ రావడం ఆనందంగా ఉంది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఈ సి ని మాని మలిచాము. సినిమా చూసిన వారిలో చాలామంది.. సినిమాలో ఇంత కం టెంట్ ఉందని మాకు ముందు తెలియదు అంటూ ఆశ్చర్యపోతున్నారు. నేను మొదటి రోజు నుంచి ఓ కమర్షియల్ ఎంటర్‌టైనర్ తీస్తున్నాను. తొలిప్రేమ పాట సెకండ్ హాఫ్ లో ఉపయోగించడం అభిమానులకు బాగా నచ్చింది. ఎన్నో ఎలిమెంట్స్ ఉన్న ఇలాంటి ఒక కమర్షియల్ సినిమాకి తమన్ తక్కువ సమయంలో అద్భుతమైన సంగీతం అందించారు. మా టీమ్ అందరి కృషి వల్లే ఇంత మంచి సినిమా చేయగలిగాము అన్నారు. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా మొదటి షో నుంచే అద్భుతమైన స్పందన లభిస్తోంది. విమల్ థియేటర్ లో ప్రేక్షకులతో కలిసి మేము సినిమా చూశాం. సినిమా చూస్తున్న అంతసేపూ ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తూనే ఉన్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రవి శంకర్, ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

## యుద్ధ వ్యతిరేఖ ర్యాలీ

(మొదటి పేజీ తరువాయి)

నాయకులు డిమాండ్ చేశారు. యుద్ధం నివారించి ప్రపంచ శాంతిని నెలకొల్పడం అత్యవసరమని, ఇందులో భాగంగా ప్రధాని మోదీపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 29న చార్మినార్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు యుద్ధ వ్యతిరేక ర్యాలీని నిర్వహించనున్నట్లు నేతలు ప్రకటించారు. ఈ ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్.కె.నారాయణ, టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు అబ్బాస్, సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ నాయకురాలు కె.రమా, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నేత జె.చలపతిరావు, ప్రజా సంఘాల నాయకులు తారిక్ ఖాద్రీ, మునురుద్దీన్ ముజాయుద్దీన్‌లు పాల్గొన్నారు.

**యుద్ధ నివారణకు ప్రధాని చొరవ చూపాలి : కూనంనేని సాంబశివరావు**

యుద్ధ నివారణకు ప్రధాని మోదీ వెంటనే చొరవ చూపాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. 140 కోట్ల మంది ప్రజలకు ప్రతినిధిగా ఉన్న మోదీ ఈ దేశ ప్రజల శ్రేయస్సును ఏమాత్రం పట్టించుకోకుండా అమెరికాకు వత్తాసు పలకడం గర్హనీయమన్నారు. యుద్ధం కారణగా గల్ఫ్ దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయులు ప్రత్యక్షంగా, దేశంలోని ప్రజలు పరోక్షంగా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ నివారణకు యుద్ధ వ్యతిరేక కమిటీ కార్యాచరణ చేపట్టిందన్నారు. యుద్ధ నివారణకు ప్రధాని చోరవ చూపేలా ఒత్తిడి తెచ్చేందుకు శాసనసభ సమావేశాల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

**ప్రధానివి దివాళాకోరు రాజకీయాలు : డాక్టర్ నారాయణ**

భారతదేశం ఎప్పటి నుంచో అవలంభిస్తున్న అలీన విధానాన్ని భారత ప్రధాని మోదీ విస్మరిస్తూ దివాళాకోరు రాజకీయాలకు పాల్పడుతున్నారని డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. అమెరికా చేస్తున్న ఈ దురాక్రమణను ప్రపంచ దేశాలు వ్యతిరేకిస్తున్నా భారత ప్రధాని మాత్రం యుద్ధానికి తలపడుతున్న అమెరికాను కాకుండా ఇరాన్‌ను దాడులు నిలిపివేయాలని కోరడం దారుణమన్నారు. సర్వ మానవాళిని ధ్వంసం చేస్తున్న ఈ యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని అమెరికాపై ప్రధాని మోదీ ఒత్తిడి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.

**ఎక్కడ యుద్ధం జరిగినా ప్రపంచ శాంతికి భంగమే : ప్రొఫెసర్ కోదండరామ్**

నిప్పు అంటుకుంటే దావానంలా అంతా వ్యాపించినట్లుగానే ఎక్కడ యుద్ధం జరిగినా ప్రపంచ శాంతికి భంగమేనని ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ఈ యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లో ఉన్న కోటి మంది భారతీయులు అందులో 15 లక్షల మంది తెలంగాణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యుద్ధం కారణంగా దేశంలో అన్ని ధరలు పెరగుతూ ప్రజలపై పెను భారంగా మారుతోందని, ఈ తరుణంలో దేశ సమగ్రత, భద్రత, ఆర్థిక అభివృద్ధి, దేశ ప్రజల క్షేమాన్ని ఆకాంక్షిస్తూ ప్రధాని తక్షణమే యుద్ధ నివారణకు చోరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు మరింత ఒత్తిడి పెంచేందుకే కాంగ్రెస్, టిజెఎస్, సిపిఐ, సిపిఐ(ఎం), సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమాక్రసీ, కార్మిక , మహిళా, విద్యార్థి, యువజ, పౌర హక్కులు తదితర ప్రజాసంఘాలతో ఏర్పడిన యుద్ధ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ర్యాలీలో బిజెపి, ఎంఐఎంలు తప్ప అన్ని పార్టీలు ప్రజాసంఘాలు పాల్గొనున్నాయని వెల్లడించారు. ప్రజలను పెద్ద ఎత్తు భాగ స్వామ్యం చేసేందుకు ఈనెల 28వ తేదీ వరకు సదస్సులు, సమావేశాలు, ర్యాలీల ద్వారా విస్తృత, ప్రచార కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కోదండరామ్ వెల్లడించారు.

## నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌కు బడ్జెట్ కేటాయింపులు హర్షణీయం : ఎస్‌టియుటిఎస్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు నూతన ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ప్రకటించడం, బడ్జెట్ సైతం కేటాయించడం హర్షించదగిన విషయం అని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. సదానందం గౌడ్, జుట్టు గజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగా ణ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2026–27 వార్షిక బడ్జెట్లో విద్యారంగానికి సంబంధించిన కొన్ని సానుకూల అంశాలను స్వాగతిస్తున్నామని, మొత్తంగా కేటాయింపులు అ వసరానికి తక్కువగా ఉన్నాయని, విద్యారంగానికి బడ్జెట్ మరింత పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యారంగానికి గత సంవత్స రం కంటే 0.65 శాతం బడ్జెట్ పెరిగినప్పటికీ, మొత్తం బడ్జెట్ వ్య యం 3,24,234 కోట్లలో, విద్యారంగానికి 26,674 కోట్లు అం టే కేవలం 8.22 శాతం మాత్రమే కేటాయించడం ఆందోళనకరమని అన్నారు.

**బడ్జెట్‌లో విద్యకు మళ్ళీ యధాస్థితి: ఎస్‌టియుటిఎస్ స్థానిక కార్యదర్శి వై.కరుణాకర్ రెడ్డి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొత్తం బడ్జెట్ రూ. 3, 24,234 లక్షల కోట్లు అందులో విద్యకు కెటాయించినది రూ .26,674 వేల కోట్లు మాత్రమేనని, అనగా మొత్తం బడ్జెట్‌లో 8.2 శాతం మాత్రమే అని ఎస్‌టియుటిఎస్ స్థానిక కార్యదర్శి వై.కరుణాకర్ రెడ్డి అన్నారు. అంటే గత సంవత్సరం కెటాయించిన బడ్జెట్ కంటే కేవలం 0.63 శాతం మాత్రమే ఎక్కువ అని, ఈ సంవత్సరం నుండి నర్సరి నుండి ఇంటర్ వరకు అందరు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్, ఇంటర్ విద్యార్థులకు కూడా మద్యాహ్న భోజనం ఇస్తామంటున్నారు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంబిస్తామని చెపుతున్నారు, మీరు కెటాయించిన రూ.26,674 వేల కోట్ల బడ్జెట్‌లో ఇవన్నీ సాధ్యమేనా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

## విద్యార్థులు గల్లంతు

(మొదటి పేజీ తరువాయి)



బయటపడగా మిగతా ఐదుగురైన శ్రీకర్, అభిరామ్, సతీష్,, నవదీప్, తేజజ్ఞ మునిగిపోయి మృత్యువాత పడ్డారు. వీరిలో ఇప్పటి వరకు భద్రాచలానికి చెందిన చారుగుళ్ల శ్రీకర్, అభిరామ్‌తో పాటు ఉయ్యూరుకు చెందిన నవదీప్ ల మూడు మృతదేహాలు లభ్యం కాగా మిగతా వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

ఉగాదికి వచ్చి అనంత లోకాలకు : ఈ ఏడుగురు విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ లోని అమరావతిలో గల ఎస్ఆర్ఎంటి ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ ద్వితీయ సం. చదువుతున్నారు. ఉగాది సందర్భంగా రామాలయం దర్శనం కోసం భద్రాచలంలో ఉండే శ్రీకర్, అభిరామ్ అనే స్నేహితుని వద్దకు వచ్చి ఉగాది రోజులు రామాలయంలో దర్శనం చేసుకున్నారు. ఆరోజు శ్రీకర్ ఇంట్లో బస చేసిన ఆ మరుసటి రోజైన శుక్రవారం గోదావరిలో సెల్ఫీలు దిగి, స్నానాలు చేసేందుకు భద్రాచలం సమీపంలోని కూనవరం రోడ్‌లో గల ఏపి సరిహద్దు కొల్లుగూడెం గోదావరి తీరానికి వెళ్లారు. నదిలోకి దిగి సెల్ఫీలు తీసుకుంటున్న క్రమంలో అనుకోకుండా లోతులోకి వెళ్లిపోయిన వారు కాళ్లు అందక నీళ్లలో కొట్టుకుపోయారు. ఈత రావడటంతో ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు యువకులు 100 కు డైయిల్ చేయగా, అక్కడని నుండి భద్రాచలం పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలమైన గోదావరి తీరానికి చేరుకున్న పోలీసులు ఏపి సరిహద్దు కావడంతో ఏపిలోని ఎటపాక పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు కూడా గోదావరి తీరానికి వచ్చిన గాలింపుల చర్యలు మొదలుపెట్టారు. స్థానికంగా నివాసం ఉండే శ్రీకర్ కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మిగతా విద్యార్థుల కుటుంబీకులకు కూడా సమాచారం ఇవ్వడంతో బోరున విలపిస్తూ ఆగమేఘాల మీద భద్రాచలం బయలు దేరారు. లభ్యమైన మృతదేహాలను భద్రాచలంలోని ఏరియా ఆస్పత్రిలోగల మార్చురీకి తరలించగా, మరో రెండు మృతదేహాల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దైవదర్శనం కోసమని భద్రాచలం వచ్చిన యువకులను గోదావరి రూపంలో మృత్యువు కబళించడంతో గోదావరి తీరంలో శోఖ సంద్రంగా మారిపోయింది. స్థానిక యువకులు కుటుంబీకుల రోదనలు మిన్నంటుతున్నాయి. చేతి కందిన కొడుకులు గోదావరిలో కొట్టుకుపోయి మృతి చెందడంతో ఆ కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. గత 30 ఏళ్ల క్రితం కిన్నెరసానిలో భద్రాచలంకు చెందిన యువుకులు ఐదుగురు మృతి చెందగా, ఇప్పుడు గోదావరి తీరంలో ఐదుగురు యువకులు మృత్యువాత పడటంతో ఆ నాటి సంఘటనను పలువురు నెమరు వేసుకుంటున్నారు.

## ఫ్యూచరిస్టిక్ బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబానికి ఇందిరా కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశపెట్టామన్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలో రేషన్ కార్డు ఉండే కుటుంబాలకు అర్హత ఉంటుందన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో విద్యా విధానంలో కూడా మార్పులు తీసుకువస్తామని,ప్రీ ప్రైమరీ నుంచి ప్లస్ టూ వరకు విద్యార్థులు ఒకే చోట ప్రభుత్వ స్కూల్లో చదివే విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. పదవ తరగతి తరువాత డ్రాపౌట్‌లు ఎక్కువ అవుతున్నందు వల్లే తాము ప్లస్ టూ విధానాన్ని తీసుకొస్తామన్నారు. జిఎస్‌టి రాబడి విషయంలో కేంద్ర ప్రభుత్వం కంటే తెలంగాణ మెరుగ్గా ఉందని, రూ.4వేల కోట్లు అదనంగా వచ్చిందని తెలిపారు. గతంలో ఎక్కువ స్లాబులు ఉన్నప్పటి కంటే, తగ్గించాక ఎక్కువ జిఎస్‌టి వసూలు అవుతున్నట్లు తెలిపారు. ఇసుక విక్రయంతో వచ్చే రాబడిలో 16 శాతం పెరుగుదల ఉందన్నారు. ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలు ఆపే ఆలోచన లేదని, ప్రస్తుతం సిబ్బంది జనగణనలో ఉన్నందునే ఆగిందన్నారు.

**అప్పులు తీర్చేందుకే అప్పులు**

బిఆర్‌ఎస్ హయాంలో అప్పులు, తప్పులు చేసి తమ ప్రభుత్వంపై రూ.8 లక్షల కోట్ల అప్పులు భారం పెట్టారని, ఆర్థిక క్రమశిక్షణతో దానిని జాగ్రత్తగా తగ్గించుకుంటున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నుంచి ఇప్పటి వరకు రూ.3.47లక్షల కోట్లు అప్పు చేయగా, అందులో నుంచి గత ప్రభుత్వం చేసిన అప్పులు, వడ్డీలకే రూ.3.30 లక్షల కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. నెలకు రూ.13 వేల కోట్ల వరకు నాటి అప్పులు, వడ్డీల చెల్లింపులకే పోతోందని, అప్పు పెరుగుతూనే పోతుండడంతో, రూ.2లక్షల కోట్ల అప్పులను తక్కువ వడ్డీ, ఎక్కువ కాలానికి రీస్ట్రక్చర్ చేసి కొత్త వెసులుబాటు తెచ్చుకున్నామన్నారు.

**హిల్ట్, టిడిఆర్, భూ బదలాయింపులపై విచారణకు సిద్ధం**

హిల్ట్ పేరుతో రూ.5లక్షల కోట్ల భూముల అగ్గువకు అమ్ముకుంటున్నారని, అలాగే టిడిఆర్‌లో కుంభకోణం ఉందని బిఆర్‌ఎస్ ఆరోపించడాన్ని సిఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. కాలుష్య పరిశ్రమలను హైదరాబాద్ నుంచి ఔటర్ రింగ్ రోడ్ అవతలకు తరలించేందుకు ఈ విధానం తీసుకువచ్చామని, గతంలో ఆ పరిశ్రమలకు ఇచ్చి భూములను మళ్లీ పర్పస్ జోన్‌గా బదలాయింపునకు పారదర్శకంగా హిల్ట్ పాలసీని తీసుకువచ్చామన్నారు. మొత్తం 9వేల ఎకరాల భూములను అమ్మినా రూ.లక్ష కోట్లు రావని, అలాంటిది రూ.5లక్షల కుంభకోణం అంటూ బిఆర్‌ఎస్ విషప్రచారం చేస్తోందన్నారు. అందుకు 2014 జూన్ 2 నుంచి భూముల బదలాయింపు, హిల్ట్, టిడిఆర్‌లపై విచారణ కోరుతూ కెటిఆర్, హరీశ్‌రావులు తనకు లేఖ రాస్తే, వారు కోరిన ఎలాంటి విచారణకైనా శాసనసభలో ఆమోదించి, అమలు చేస్తామన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు తెలిసిన సమాచారం మేరకు 6వేల ఫోన్‌లు ట్యాప్ అయ్యాయన్నారు. హరీశ్ రావు తన ఫోన్ ట్యాప్ చేయించారని చక్రధర్ గౌడ్ అనే ఫిర్యాదుదారుడి ఎఫ్‌ఐఆర్ బాగాలేదనే, దానిని హైకోర్టు కొట్టేసిందే తప్ప హరీశ్‌రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో క్లీన్‌చిట్ ఇవ్వలేదన్నారు.

**డ్రగ్స్ కేసుపై బిజెపి ఎందుకు మాట్లాడదు?**

మూసీ ప్రక్షాళన, పునరుజ్జీవన పథకంలో తమ ప్రభుత్వం ముందుకే పోతుందని సిఎం స్పష్టం చేశారు. మూసీని ప్రక్షాళన చేయడం తప్ప ప్రత్యామ్నాయం లేదని, ఇప్పటికే మొదటి దశ డిపిఆర్‌ను ప్రజల ముందు ఉంచామని, దానిపై అభ్యంతరాలు, సూచనలు ఉంటే తెలపవచ్చన్నారు. డ్రగ్స్ కేసులో బిఆర్‌ఎస్ మాజీ ఎంఎల్‌ఎ పట్టుబడినా బిజెపి అగ్ర నేతలు జి.కిషన్‌రెడ్డి, రామచంద్రరావు ఎందుకు స్పందించడం లేదని సిఎం ప్రశ్నించారు. ఇది బిఆర్‌ఎస్– బిజెపిల మధ్య బంధాన్ని తెలియజేస్తోందన్నారు. అల్లుడు, కుమారుడు కలిసి గృహ నిర్భందం చేసినందునే ప్రతిపక్ష నాయకుడు కెసిఆర్ శాసనసభకు రావడం లేదన్నారు.

**వచ్చే సిఎంను ఎంఎల్‌ఎలే ఎన్నుకుంటారు**

వచ్చే ఎన్నికల్లో కూడా గెలిచి, తానే ముఖ్యమంత్రి అవుతానన్న ప్రకటనపై ఆ పదవిని ఆశించిన నేతల నుంచి కూడా వ్యతిరేకత రాలేదు కదా అని ఒక జర్నలిస్టు వేసిన ప్రశ్నకు సిఎం రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవిని ఎవరైనా ఉంటారని, పార్టీలో మాత్రం ఎన్నికల తరువాత ఎంఎల్‌ఎలు సిఎల్‌పి నేతపై తమ అభిప్రాయాలను ఎఐసిసికి తెలియజేస్తారని, అప్పుడు నిర్ణయం జరుగుతుందన్నారు. ఎవరు ఆశించిన ఆ ప్రక్రియను అనుసరించాల్సిందేనని చెప్పారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com